


శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



సురక్షితంగా మరో రెండు భారతీయ నౌకలూ హోర్ముజ్ జలసంధిని.. దాటేశాయ్

స్వప్రయోజనాలకోసం వ్యవసాయాన్ని త్యాగం చేసేందుకు సిద్ధమైన బిజెపి

రష్యా నుండి ఆయిల్ కొనమని వైట్‌హౌస్ అడుక్కుంటోంది 05



సంపుటి 09, సంచిక: 105 | ఆదివారం | 15-03-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# గ్యాస్ తిప్పలు

## టీ, టిఫిన్ సెంటర్లు బంద్

● పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో నిలిచిన కమర్షియల్ గ్యాస్ సరఫరా ● రాష్ట్రంలో 50 వేలకు పైగా చిన్నాచితకా హోటళ్లు బంద్ ● కట్టెలపొయ్యిలపై వంటలు-పెరిగిన ధరలు ఇబ్బందుల్లో వలస కార్మికులు

ప్రజాపక్షం/హైదరాబాద్

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం ప్రభావం తెలంగాణలోని చిన్నా చితక హోటళ్లపై తీవ్ర ప్రభావం చూపింది. 14 రోజుల నుంచి నడుస్తున్న యుద్ధంతో కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 50 వేలకు పైగా టి, టిఫిన్ సెంటర్ హోటళ్లు మూతపడ్డాయి. మరోపక్క 20 వేలకుపైగా కర్రీ పాయింట్లు సైతం మూతపడ్డాయి. దీని ప్రభావం టి, టిఫిన్ ప్రియులపై పడింది. ఉద్యోగం నిమిత్తం ఇంటి నుంచి బయటికి వెళ్లే వారు టి షాప్‌లు బంద్ ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టిఫిన్ సెంటర్లు మూత పడడంతో ముఖ్యంగా వలస కార్మికులు ఇక్కట్లకు గురవుతున్నారు. టిఫిన్ సెంటర్ల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి వెతకాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని హోటళ్లు కట్టెల పొయ్యిలపై తమ దిన చర్యను కొనసాగిస్తున్నారు. దీంతో పాటు హోటల్ యజమానులు టిఫిన్ ధరలను అమాంతంగా 20 శాతం పెంచేశారు. ఆకలి కోసం అలమటిస్తున్న వలస కార్మికుల కష్టాలు మాత్రం వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన లారీ డ్రైవర్లు, క్లీనర్లు టిఫిన్, భోజనం చేయాలంటే వారు తప్పనిసరిగా హోటల్‌నే ఆశ్రయించాలి. అయితే హోటళ్లు బంద్ ఉండడంతో వీరు సైతం అవస్థలకు గురవుతున్నారు. ఆకలిని తీర్చుకునేందుకు కొందరు అరటి పండ్లను ఆహారంగా తీసుకుంటున్న వైనం కూడా కనిపించింది. ఇక బిర్యానీ హోటళ్లలో కూడా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. కొందరు బ్లాక్‌లో సిలిండర్లు తీసుకుని తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో బిర్యాని ధరలను కూడా అమాంతంగా పెంచేశారు.

**ప్రత్యామ్నాయం కోసం పరుగులు..**

దేశవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన అంతరాయం సామాన్యుడి వంటగదిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సిలిండర్ల కొరత కారణంగా గ్యాస్ కోసం వారాల తరబడి వేచి చూడాల్సి రావడంతో, ప్రత్యామ్నాయ మార్గాల వైపు ప్రజలు వేగంగా మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ఇండక్షన్ స్టవ్ల విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. తాజాగా అందిన గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా కేవలం ఒక్క రోజులోనే 1.34 లక్షల ఇండక్షన్ స్టవ్లు అమ్ముడయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో తరువాయి 2లో




### కట్టెల పొయ్యిపై నిషేధం ఎత్తివేత

దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న గ్యాస్ కొరతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా ఢిల్లీలో కట్టెల పొయ్యిల వాడకంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గ్యాస్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా కట్టెల పొయ్యిల వాడకానికి అధికారికంగా అనుమతి నిచ్చింది. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని తగ్గించే ఉద్దేశంతో గతంలో కట్టెల పొయ్యిలు, బొగ్గు వాడకంపై కఠినమైన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం నెలకొన్న గ్యాస్ కొరత కారణంగా సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించిన కేంద్రం, ఈ నిబంధనలను సడలిస్తూ నిర్ణయం తీసుకుంది.

# పశ్చిమాసియాలో మారణహోమం

● యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కీలక చమురు నిల్వ కేంద్రంపై ఇరాన్ దాడి ● ఇరాన్‌కు ప్రాణాధారమైన ఖర్గ్ ఆయిల్ రిఫైనరీని ధ్వంసం చేసిన అమెరికా ● బాగ్దాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయం,హెలిపాడ్ ధ్వంసం ● సౌదీలో ఐదు అమెరికా రీ-ఫ్యూయలింగ్ ఎయిర్‌క్రాఫ్టులు ధ్వంసం ● ఇరాక్‌లో ఆరుగురు అమెరికన్ సైనికులు మృతి ● గల్ఫ్ దేశాలపై ఆగని ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులు ● ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్లస్టర్ బాంబు దాడులు ● లెబనాన్‌పై దాడుల్లో 12 మంది వైద్యసిబ్బంది మృతి ● 5వేల మంది ఇరాన్ సేనలు, 14 మంది ఇజ్రాయెల్ సైనికులు మృతి ● 15 రోజుల్లో శాతం పెరిగిన బ్రెంట్ క్రూడాయిల్ ధర ● ఇజ్రాయెల్‌తో దీర్ఘకాలిక యుద్ధానికిసిద్ధమని హెజ్బొల్లా ప్రకటన





**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో 15వ రోజు శనివారం పశ్చిమాసియాలో మారణహోమం సంభవించింది. అమెరికా-ఇరాన్ ప్రతీకార దాడులతో అత్యంత ప్రాణాధారమైన చమురు నిల్వ కేంద్రాలను పరస్పర దాడులతో ధ్వంసం చేసుకున్నాయి. ఇది ఇప్పటివరకూ జరిగిన యుద్ధాన్ని మలుపుతిప్పే అత్యంత కీలక పరిణామం. అమెరికా-ఇరాన్ మధ్య దాడులు ఎదురు దాడులు, బాంబు పేలుళ్ళతో దద్దరిల్లింది. గల్ఫ్‌లోని పొరుగు అరబ్ దేశాలపై ఇరాన్ క్షిపణి-డ్రోన్ దాడులు ఆగకుండా కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాలో అత్యంత కీలకమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన అతిపెద్ద చమురు నిల్వ కేంద్రంపై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. పోర్ట్ ఫుజైరాహ్ పై ఈ దాడి జరిగింది. ఈ ప్రాంతంలో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. నౌకల రీ-ఫ్యూయలింగ్‌కు, బంకరింగ్‌కు ఈ ప్రాంతం ఎంతో కీలకమైనది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వాయువ్యంగా హోర్ముజ్ జలసంధికి దగ్గరగా ఒమన్ వైపు ఈ ఫుజైరాహ్ ఓడరేవు ఉంది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలకు అతి సమీపంలోనే ఈ ప్రాంతం ఉంది. దాడులతో ఈ ప్రాంతం అంతటా ఆకాశంలో అతిదట్టమైన నల్లని పొగ మేఘాలు కమ్ముకున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు, పశ్చిమాసియాకు ఇది అత్యంత కీలకమైన చాలా పెద్ద చమురు నిల్వ కేంద్రం కావడంతో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ ఎగుమతులకు ప్రాణాధారమైన ఖర్గ్ ద్వీపంలో ఉన్న చమురు మౌలిక సదుపాయాలపై అమెరికా దాడి చేసి విధ్వంసం సృష్టించింది. దానివల్ల పెద్ద నష్టమేమీ కలగలేదని ఇరాన్ మొదట ప్రకటించినప్పటికీ ఆ తర్వాత తీవ్రస్థాయిలో స్పందించి ఎదురు దాడులు చేసింది. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయాన్ని కూడా ధ్వంసం చేసింది.ఖర్గ్‌లోని కీలక క్షేత్రంపై అమెరికా దాడి చేసినందువల్ల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో తరువాయి 2లో

## రేపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు

పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాల వైఫల్యం కారణంగానే దేశంలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరా తగ్గడంతో పాటు గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బిజెపి ప్రభుత్వ విధాన వైఫల్యంతో పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలను వ్యతిరేకిస్తూ. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీన సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా కేంద్రాలలో నిరసన ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలంతా అ తరువాయి 12లో



## వైర్ తెగి బావిలో పడిన క్రేన్

## ముగ్గురు మృతి

పూడిక తీస్తుండగా దుర్ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొరికిశాల గ్రామంలో విషాదం

ప్రజాపక్షం/భూపాలపల్లి/మొగుళ్లపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికి శాల గ్రామ శివారులో వ్యవసాయ బావిలో క్రేన్ తో పూడిక తీస్తుండగా ప్రమాదవశాత్తు క్రేను జారి పడి బావిలో పని చేస్తున్న కూలీ లపై పడడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు, తరువాయి 12లో



## సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధం రద్దు

● జోధ్‌పూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదలైన పర్యావరణవేత్త ● లడ్డాఖ్‌కు రాష్ట్ర హోదా నిరసనలు హింసాత్మకంగా మారడంతో 6 నెలల క్రితం కస్టడీలోకి వాంగ్‌చుక్

**జోధ్‌పూర్ :** పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో శనివారం ఆయన జోధ్‌పూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదల అయ్యారు. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద అతన్ని నిర్బంధంలోకి తీసుకున్న విషయం తెలిసిందే . దాదాపు ఆరు నెలల తర్వాత సోనమ్ వాంగ్‌చుక్ జైలు నుంచి విడుదలయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశం మేరకు తరువాయి 12లో

# రీజినల్ రింగ్ రైల్‌కు కేంద్రం ఓకే



● ప్రాజెక్టుకు అవసరమైన డిపిఆర్ రూపకల్పనకు అనుమతులు మంజూరు ● భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నకు లేఖ ద్వారా కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ సమాధానం ● డిపిఆర్ సిద్ధమైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు




ప్రజాపక్షం/హైదరాబాద్/భువనగిరి

హైదరాబాద్ నగరం చుట్టూ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టుకు సంబంధించి కీలక అడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సమగ్రప్రాజెక్ట్ నివేదిక (డిపిఆర్) రూపకల్పన కోసం సర్వే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి లోక్ సభలో రూల్377 కింద లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ ఈ మేరకు అధికారిక లేఖ ద్వారా వివరాలను వెల్లడించారు. రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్ట్ తయారీకి అవసరమైన సర్వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) వెంబడి రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. డిపిఆర్ సిద్ధమైన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరపనున్నట్లు వెల్లడించారు. అనంతరం నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖల ఆమోదం పొందిన తర్వాత ప్రాజెక్టుకు తుది మంజూరు లభించనుందని లేఖలో పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల మధ్య రవాణా వ్యవస్థ మెరుగుపడటమే కాకుండా, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి పెద్దపీట పడనుందని కేంద్ర మంత్రి వివరించారు.తన నియోజకవర్గంతో పాటు తెలంగాణా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక చొరవ చూపిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి కేంద్ర మంత్రి తన లేఖలో ధన్యవాదాలు తెలిపారు.

**ఏమిటీ రీజినల్ రింగ్ రైల్?**

**యాదాద్రి :** ప్రస్తుతం మనకు ఎంఎంటీఎస్ మెట్రో రైళ్లు నగర అంతర్గత ప్రయాణాలకు తోడ్పడుతున్నాయి. కానీ, హైదరాబాద్ చుట్టూ సుమారు 40 కిలోమీటర్ల అవతల ఉన్న పట్టణాలను అనుసంధానిస్తూ నిర్మించేదే ఈ రీజినల్ రింగ్ రైల్. ఇది దాదాపు రీజినల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ వెంబడే సాగుతుంది.

**మారుమూల పట్టణాలకు 'రైలు' వేగం**

ప్రస్తుతం హైదరాబాద్‌కు దూరంగా తరువాయి 2లో



## శుభకార్యానికి వెళ్లివస్తూ మృత్యు ఒడికి

● బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు ముగ్గురు దుర్మరణం ● మెదక్ జిల్లా రాంపూర్ శివారులో ఘటన

ప్రజాపక్షం/మెదక్/ కొల్చారం

బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన శనివారం సాయంత్రం మెదక్ కొల్చారం మండలం రాంపూర్ శివారులో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, మృతుల బంధువుల కథనం ప్రకారం హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన అమృత్ గౌడ్(50), అతని కుమారుడు రిషి వర్దన్ గౌడ్(12), అలాగే అల్లుడు సాయి గౌడ్(35) కలసి మండలంలోని రంగంపేట గ్రామంలో శనివారం తరువాయి 12లో

# మూసీకి ఆనాటి వైభవం తిరిగొచ్చేనా?

### వేలాది కుటుంబాల భవిష్యత్ ప్రశ్నార్థకం

### ప్రజల్లో వెల్లువెత్తుతున్న సందేహాలు



## పునరుజ్జీవం పోసుకునేనా

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో 'మూసీ' రాజకీయాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ నగరానికి జీవనాడిగా ఒకప్పుడు నిలిచిన మూసీ నది, కాలక్రమేణా కాలుష్యానికి ప్రతీకగా మారింది. ఇప్పుడు దానిని మళ్లీ పునరుజ్జీవింపజేయాలని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'మూసీ పునరుజ్జీవన, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు' అభివృద్ధి అవసరాన్ని గుర్తు చేస్తూనే, మరోవైపు వేలాది కుటుంబాల భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పర్యావరణ పరిరక్షణ, వరద నియంత్రణ, పర్యాటకాభివృద్ధి, నగర సౌందర్యవర్ధక కార్యక్రమంగా ప్రస్తావిస్తున్న అంశాలు, నిర్వాసితుల పునరావాసం, ఉపాధి అవకాశాలు, ఆస్తి నష్టంపై ప్రజల్లో సందేహాలు ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి. గత కొంత కాలంగా ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం, విపక్షాల మధ్య వాగ్వాదాలు, విమర్శలు, ప్రతివిమర్శలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ''మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్ట్ తొలి దశలో చేపట్టనున్న పనులకు కేవలం రూ.7 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంది. గాంధీ విగ్రహానికి రూ.75 కోట్ల ఖర్చు అవుతుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను శాసనసభలో పెడుతాం. అందరూ ఆమోదిస్తేనే ముందుకు వెళ్తాం. లేదంటే ప్రాజెక్టును వదిలేస్తాం'' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం తరువాయి 2లో



## యుద్ధ ప్రాతిపదికన సంక్షేమ వసతి గృహాలు

● మూడు నెలల్లో పూర్తిచేయాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశం ● వారసత్వంగా ఉన్న ఆలయాలను అభివృద్ధి చేయాలని సూచన ● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్షేమ వసతి గృహాల కోసం నిర్మిస్తున్న భవనాల్లో 80 శాతం పూర్తయిన వాటిని యుద్ధ ప్రతిపదికన రాబోయే మూడు నెలల్లో పూర్తిచేసి, రానున్న విద్యా సంవత్సరంలో అందుబాటులోకి తీసుకురావాలని సంక్షేమ శాఖ అధికారులను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తరువాయి 12లో


దోచుకునేందుకే.. తెరపైకి మూసీ ప్రణాళిక
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ 03

# హోర్ముజ్ జలసంధికి తరలించనున్న సెవెన్త్ ఫ్లీట్ బలగాలు

### ఐఆర్‌జిసి జాడ చెబితే 10 మి.డాలర్లు బహుమతి

### ఇరాన్ లొంగిపోవడమే మంచిది : ట్రంప్





**వాషింగ్టన్:** పశ్చిమ ఆసియాకు అమెరికా తన సెవెన్త్ ఫ్లీట్ బలగాలను హోర్ముజ్ జలసంధికి తరలించనున్నది. హోర్ముజ్ ద్వారా వాణిజ్య నౌకలను సురక్షితంగా మహాసముద్రంలోకి మళ్ళించే బాధ్యతలను ట్రంప్ తీసుకున్నారు. వాణిజ్య నౌకలకు తామే రక్షణ కల్పిస్తామని ట్రంప్ భరోసా ఇచ్చిన నేపథ్యంలో సెవెన్త్ ఫ్లీట్ బలగాలు త్వరలో హోర్ముజ్‌కు చేరుకోనున్నాయి. ఈ మేరకు 2,500 మంది అమెరికా సైనికులు హోర్ముజ్‌కు వస్తారు. వీరిని యాంఫీబియస్ రెడీ గ్రూప్ (ఎఆర్‌జి) అని పిలుస్తారు. యుఎస్‌ఎస్ ట్రిపోలీ నాయకత్వంలో ఎఆర్‌జి ఊగ్రపు పనిచేస్తుంది. రక్షణ రంగ అధికారులను ఉటంకిస్తూ ఫాక్స్ న్యూ స్ ఈ విషయం వెల్లడించింది. యుఎస్‌ఎస్ ట్రిపోలీ ఎఆర్‌జి గ్రూపుతోపాటు 31వ మెరైన్ ఎక్స్‌పెడిషనరీ యూనిట్ (ఎంఇయు)ను కూ కూడా పశ్చిమాసియాకు పెంటగాన్ అధికారులు తరలించనున్నారు. మరోవైపు ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ క్వాలిబాఫ్‌తోపాటు జాయింట్ మిలిటరీ క మాండ్ కూడా ఒక ప్రకటన చేస్తూ, అమెరికాతో అనుబంధం ఉన్న అని చము రు ట్యాంకర్లు, ఇంధన సదుపాయాలపై దాడులు చేస్తామని హెచ్చరించింది.

మొజ్తబా ఖమేనీ ప్రత్యక్ష హెచ్చరికతో ఊహించనిరీతిలో యుద్ధం ఉద్ధృతం కావడటంతో 2,500 మంది సైనికులతోపాటు మరో విమానవాహక యుద్ధ నౌకను కూడా పశ్చిమాసియాకు ట్రంప్ పంపుతున్నారు. ఈ సైనికులు ఉభయచరాల్లాబాధ్యతలు నిర్వహిస్తాయి. ఈ యుద్ధ విమానాలను నేరుగా నీళ్ళల్లో కూడా దించి పార్కింగ్ చేయడానికి వీలు కలుగుతుంది. ఇప్పటివరకూ పచ్చిమాసియాలో ఎంతమంది అమెరికా సైనికులు ఉన్నారనేది స్పష్టంగా తెలియదు. ఐతే ఖతార్‌లోని అతిపెద్ద అల్–ఉడైద్ వైమానిక స్థావరమే అమెరికాకు అతిపెద్దది. ఈ స్థావరంలో 8,000 మంది సైనికులు ఉంటారనేది ఒక అంచనా. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డులు పెద్ద సవాలుగా మారడంతో ఆ నాయకుల జాడ, ఉనికి తెలియజేసినవారికి 10 మిలియన్ డాలర్లు నగదు బహుమతి ఇస్తామని ట్రంప్ ప్రకటించారు.

హోర్ముజ్ ద్వారా నౌకలను వెళ్ళనివ్వకపోతే పశ్చిమాసియాలో చరిత్రలో ఊహించనిరీతిలో దాడులు చేస్తామని ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు చేయగా, మీకోసం ఎదురుచూస్తున్నామని, త్వరగా రావాలని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డులు కూడా ప్రతి సవాలు చేయడంతో ఉద్రిక్తతల తీవ్రత పెరిగి హోర్ముజ్ కేంద్రంగా యుద్ధం ఉద్ధృతరూపం దాల్చేందుకు రంగం సిద్ధమవుతున్నది. అలీ ఖమేనీతోపాటు ఆయన కుమార్తె,అల్లుడు,మనుమరాలు,కోడలు కూడా గతనెల 28న జరిగిన దాడిలో మరణించడంతో కొత్తగా ఇరాన్ సర్వాధినేతగా బాధ్యతలు తీసుకున్న మొజ్తబా ఖమేనీ రెండు రోజులక్రితం మొదటిసారి ప్రకటన విడుదల చేస్తూ, రక్తానికి రక్తం పరిహారం చేస్తామని, యుద్ధం పూర్తయ్యేవరకూ హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించడంతో పరిస్థితులు ట్రంప్ ఊహించనిరీతిలో కొత్త మలుపు తీసుకున్నాయి. దీంతో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నాయకుల జాడ తెలియజేసినవారికి 10 బిలియన్ డాలర్లు నగదు బహుమతి ఇస్తామని కూడా ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ పూర్తిగా ఓడిపోయిందని, ఆ దేశం చర్చలు కావాలని అడిగినాగానీ తాము ఒప్పుకునేదిలేదని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. "వాళ్ళ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదు, రాబోయే రోజుల్లో యుద్ధం మరింత తీవ్రం చేస్తాం, అమెరికా సైన్యాన్ని ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యంగా తీర్చిదిద్దాను, ఇక ఇరాన్ లొంగిపోవడమే మంచిది" అని ట్రంప్ పేర్కొన్నారు. వచ్చే వారం నుండి అమెరికా వ్యూహాత్మక రిజర్వు చమురు మార్కెట్‌లోకి విడుదల కావడం ప్రారంభమవుతుందని ట్రంప్ చెప్పారు. ఐతే ఒక బ్యారల్‌కు 200 డాలర్లు చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని, హోర్ముజ్ జలసంధిని స్తంభింపజేసే ఉంచుతామని ఐఆర్‌జిసి విరామం లేకుండా ప్రకటనలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఇప్పటికే ఐఆర్‌జిసి అమెరికా, థాయ్‌లాండ్ సహా ఆరు వాణిజ్య నౌకలను ధ్వంసం చేసింది.

## ఒకేసారి 10 బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం

### ఉత్తర కొరియా మిలిటరీ డ్రిల్స్



**ప్యాంగ్యాంగ్:** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఉత్తర కొరియా ఒకేసారి 10 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలు చేసింది. మిలిటరీ విన్యాసాలలో భాగంగా ఉత్తర కొరియా తమ దేశ జలాల దిశగాఈ క్షిపణులను ప్రయోగించిందని దక్షిణ కొరియా ఫిర్యాదు చేసింది. ఒకవైపు ఉత్తర కొరియా అధ్యక్షుడు షరతులతో కూడిన చర్చలు అమెరికాకు ప్రతిపాదించారు. మరోవైపు అమెరికా–దక్షిణ కొరియా కూడా ఇటీవల సైనిక విన్యాసాలు చేశాయి. ఇప్పుడు కిమ్ తాజాగా క్షిపణి ప్రయోగాలు చేశారు. సముద్రంలో ఉత్తర కొరియాకు చెందిన క్షిపణి శకలాలు కనిపించాయని జపాన్ పేర్కొంది. జపాన్ ఆర్థిక మండలానికి సమీపంలోనే ఇవన్నీ తేలుతూ ఉన్నాయని మిలిటరీని ఉటంకిస్తూ దేశ ఎన్‌హెచ్‌కె మీడియా తెలియజేసింది. గడచిన రెండు దశాబ్దాలుగా ఉత్తర కొరియా అణు క్షిపణులను తయారు చేసేందుకు అనేక ప్రయోగాలు చేస్తోంది. ఈ దిశగా 2006 నుండి ఉత్తర కొరియా ఐక్యరాజ్యసమితి, ఇతర అగ్రదేశాల ఆంక్షలు ఎదుర్కొంటోంది. చాలా విజయవంతంగా ఉత్తర కొరియా అణుక్షిపణులను తయారు చేసిందని ఇప్పుడు అందరూ విశ్వసిస్తున్నారు. ఆదేశంపై ఆర్థిక,సాంఘిక ఆంక్షలు ఉన్నప్పటికీ దేశాధినేత కిమ్ వాటిని ఉల్లంఘిస్తూ అణు క్షిపణి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళుతున్నారు. ఐతే ఇటీవల అమెరికా–దక్షిణ కొరియా కూడా సైనిక విన్యాసాలు చేశాయి. ఈ విన్యాసాలను దేశ రక్షణాత్మకమైనవిగా పేర్కొన్నాయి. ఉత్తర కొరియా కూడా ఇదే వాదన వినిపిస్తున్నది.

# అమెరికా–క్యూబా మధ్య చర్చ ద్వారా పరిష్కారం

### క్యూబా అధ్యక్షుడు డయాజ్ కానెల్ ప్రకటన

### 51 మంది ఖైదీల విడుదలకు రంగం సిద్ధం




**హవానా:** అమెరికా–క్యూబా మధ్య సమస్యలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని క్యూబా అధ్యక్షుడు మిగ్యుయేల్ డయాజ్ కానెల్ చెప్పారు.డయాజ్ కానెల్ శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ, ట్రంప్ పాలనాయంత్రాంగంతో తెరవెనుక చర్చలు జరుగుతున్నాయన్న విషయం నిజమేనని ధృవీకరించారు. మొదటిసారి ఆయన ఈ విధమైన ప్రకటన చేశారు. రెండు దేశాలమధ్యా దీర్ఘకాలంగా ఉన్న విభేదాలు, వైరుధ్యాలు, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనేదే ప్రధానమైన ఉద్దేశమని చెప్పారు. అంతర్జాతీయ పరిణామాలు ఈ పరస్పర చర్చలకు తావిచ్చాయన్నారు. ఐతే ఆయన ఆ అంతర్జాతీయ కారణాలు ఏమిటో వివరంగా చెప్పలేదు. గడచిన మూడు నెలలుగా దేశానికి పెట్రోలు సరఫరాలు పూర్తిగా స్తంభించిపోవడంతో దేశంలో కార్యకలాపాలన్నీ దాదాపు ఆగిపోయాయని ఆయన చెప్పారు. అమెరికా ఆర్థిక ఆంక్షలన కారణంగానే క్యూబాకు ఈ దుస్థితి వచ్చిందని ఆయన మండిపడ్డారు. అనేక దశాబ్దాలుగా క్యూబాలో కమ్యూనిస్టు పాలనను కూలదోయాలని అమెరికా ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయి. ఇటీవల వెనిజులాలో జరిగిన అచాచక,ఆటకవిక పరిణామాలు క్యూబాను పశ్చిమార్థగోళంలో ఒంటరిని చేశాయి.

ట్రంప్ విధించిన అరాచక ఆర్థిక ఆంక్షల కారణంగా క్యూబాలో ఆర్థిక సంక్షోభం, చమురు సంక్షోభం పరాకాష్టకు చేరింది. క్యూబాలో వ్యవస్థలు పూర్తిగా చతికిలబడి నడవని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అమెరికాతో అనివార్యంగా చర్చలకు అంగీకరించినట్లు క్యూబా శనివారం బాహాటంగా ప్రకటించింది. క్యూబా పరిపాలన పతనావస్థకు తీసుకువచ్చామని, ఆ దేశంలో పాలన కుప్పకూలే దశలో ఉందని, క్యూబాలో కమ్యూనిస్టుపాలనను కూల్చివేస్తామని, అక్కడి పరిస్థితులను తమ మంత్రులు కనిపెట్టుకుని ఉన్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఈ పరిస్థితులమధ్య క్యూబా రక్షణమంత్రి, విదేశీమంత్రి వెనిజులా పర్యటనకు వెళ్ళారు. అదేవిధంగా వాటికన్‌సిటీ చేసిన విజ్ఞప్తి మేరకు జైళ్ళ నుండి 51 మంది ఖైదీలను కూడా విడుదల చేసేందుకు క్యూబా రంగం సిద్ధం చేసింది. జైళ్ళలో సత్ ప్రవర్తన గల ఖైదీలను గుర్తించి విడుదల చేస్తారు. ఐతే ఇంకా ఎవరెవర్ని విడుదల చేయాలనే విషయాన్ని క్యూబా ప్రభుత్వం నిర్ణయించలేదు. ఇప్పటికే ఖైదీలు గణనీయస్థాయిలో శిక్షలు అనుభవించారని క్యూబా ప్రభుత్వం ప్రకటించింది. క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్ కానెల్ ఖైదీల విడుదల అంశం పేర్కొన్నారు. 2010 నుండి ఇప్పటివరకూ దేశంలో 9,905 మంది ఖైదీలను విడుదల చేశామని ఆయన పేర్కొన్నారు. గడచిన మూడేళ్ళలో జైలుశిక్ష పడిన మరో 10,000 మందిని కూడా విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. గడచిన జనవరిలో వాటికన్‌సిటీతో ఖైదీల విడుదలపై క్యూబా చర్చలు జరిగాయి. ఇందులో భాగంగా 500మందిని విడుదల చేయాలని నిర్ణయించారు. క్యూబా అసమ్మతివాది జోస్ డేనియల్ ఫెర్రన్‌ను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. ఫెర్రర్ గత ఏడాది అక్టోబరులో క్యూబాను వదిలిపెట్టి అమెరికా వెళ్ళిపోయి అక్కడే ఆశ్రయం పొందాడు. గత ఏడాదిలో వాటికన్ సిటీలో జరిగిన చర్చల ఫలితంగా విడుదల చేసిన ఏడుగురు ఖైదీలలో ఫెర్రర్ కూడా ఒకరు.

# రష్యా దాడుల్లో నలుగురు ఉక్రేనియన్లు మృతి



**కీవ్:** ఉక్రేన్‌పై రష్యా చేసిన దాడుల్లోనలుగురు మరణించారు. శనివారం తెల్లవారక ముందుగానే జరిగిన డ్రోన్ దాడుల్లో నలుగురు మరణించగా మరో 15 మంది గాయపడ్డారు. రాజధాని కీవ్‌లో ఈ మ రణాలు సంభవించాయి. గాయపడిన ఐదుగురిలో ముగ్గురు పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. నాలుగు జిల్లాలలో ఈ దాడులు జరిగాయి. ఈ దాడులవల్ల నివాసిత ప్రాంతాలు, భవనాలు ధ్వంసమయ్యాయి. విద్యాసంస్థలు, వాణిజ్యకేంద్రాలు, కీలక మౌలిక సదుపాయా లు ధ్వంసమయ్యాయని సోషల్ మీడియా వేదికగా ఉక్రే న్ పేర్కొంది. దేశాధ్యక్షుడు జెలెనస్కీ దీనిపై స్పందిస్తూ, కీవ్ ప్రాంతంలో ఇంధన వనరులను లక్ష్యంగా చేసుకుని రష్యా డ్రోన్ల దాడి చేసిందని విమర్శించారు. ఉక్రేన్– అమెరికా–రష్యా మధ్య ఇటీవల త్రైపాక్షిక సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలు నిర్ణీత ప్రకా రం వచ్చే బుధవారం అంటే మార్చి 25వ తేదీన ప్రారం భం కావాల్సి ఉంది. ఈ దశలో మళ్ళీ డ్రోన్ల దాడులు జరిగాయి. రాత్రికి రాత్రే వివిధ రకాల 430 డ్రోన్లు, 68 క్షిపణులను రష్యా ప్రయోగించిందని జెలెన్స్కీ చెప్పా రు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల వాతావరణాన్ని రష్యా దుర్వినియోగం చేసి ఈ ప్రాం తంలో యుద్ధం విస్తరించేందుకు ప్రయత్నం చేస్తోందని జెలెన్స్కీ విమర్శించారు. యూరప్‌లో, ఉక్రేన్‌లో తీవ్ర విధ్వంసం సృష్టించాలని పుతిన్ ప్రయత్నం చేస్తున్నారని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. కాగా రష్యా చమురుకు ఉపశమనం కలిగిస్తే ప్రమాదకరమైన పరిస్థితులు వస్తాయని ఆ అవకాశం ఇవ్వొద్దని ట్రంప్‌కు జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. చమురు విక్రయాలకు రష్యాకు ఉపశమనం కలిగిస్తే ఈ రూపేణా రష్యా 10 మిలియన్ డాలర్ల మేరకు నిధులను సమకూర్చుకుని మరింత బలం చేకూర్చుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## కేంద్రం ఓకే

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న భువనగిరి, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, గజ్వేల్ వంటి పట్టణాలకు నేరుగా రైల్వే కనెక్టివిటీ పరిమితంగా ఉంది. రీజినల్ రింగ్ రైల్ అందుబాటులోకి వస్తే, ఈ ప్రాంతాలన్నీ ఒకే గొడుగు కిందకు వస్తాయి. సామాన్య ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో, వేగవంతమైన రవాణా సౌకర్యం కలగడమే కాకుండా, శివారు ప్రాంతాల ప్రజలు ప్రతిరోజూ నగరానికి వచ్చి వెళ్లడం సులభతరమవుతుంది.

ఆర్థిక పురోగతి.. పారిశ్రామిక విప్లవం రైల్వే నెట్వర్క్ బలోపేతం కావడం వల్ల ఆయా ప్రాంతాల్లో కొత్త పరిశ్రమలు, భారీ లాజిస్టిక్ హబ్లు, వేర్ హౌసింగ్ యూనిట్లు వెలిసే అవకాశం ఉంది. రవాణా వ్యయం తగ్గడం వల్ల పెట్టుబడిదారులు ఈ ప్రాంతాలపై మొగ్గు చూపుతారు. ఫలితంగా స్థానిక యువతకు భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు లభించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కానుంది. హైదరాబాద్ నగరంపై రోజురోజుకూ వాహనాల ఒత్తిడి పెరుగుతోంది. శివారు జిల్లాల నుంచి వేల సంఖ్యలో వాహనాలు నగరంలోకి ప్రవేశించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రింగ్ రైల్ అందుబాటులోకి వస్తే, సరుకు రవాణా మరియు ప్రయాణికుల రాకపోకలు నగరం వెలుపల నుంచే సాగిపోతాయి. దీనివల్ల భాగ్యనగర ప్రధాన రహదారులపై ఒత్తిడి తగ్గి, కాలుష్యం కూడా అదుపులోకి వస్తుంది.

**రాబోయే 50 ఏళ్ల అవసరాలను తీర్చే ముందడుగు**

సర్వేకు అనుమతి లభించడం అనేది తొలి విజయం మాత్రమే. ఇకపై అసలైన ప్రక్రియ మొదలుకానుంది. తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి, ఎక్కడెక్కడ స్టేషన్లు ఉండాలి, భూసేకరణ ఎలా ఉండాలనేది అలైన్మెంట్ ఖరారు చేస్తారు. డిపిఆర్ సిద్ధమయ్యాక నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక శాఖల ఆమోదం పొందాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయించుకోవాల్సి ఉంటుంది. 'హైదరాబాద్ చుట్టూ రింగ్ రైల్ రావడం అనేది రాబోయే 50 ఏళ్ల అవసరాలను తీర్చే ఒక భారీ ముందడుగు.

## గ్యాస్ తిప్పలు

(మొదటి పేజీ తరువాయి)

కూడా వేల సంఖ్యలో ఇవి అమ్ముడయ్యాయని సమాచారం.గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో విక్రయాలు జరగడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ అనూహ్య డిమాండ్ కారణంగా ఎన్నో చోట్ల నో స్టాక్ బోర్డులు వేయాల్సి వచ్చింది.సిలిండర్ల బుకింగ్ చేసినా డెలివరీలో జాప్యం జరుగుతుండటం, కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ మార్కెట్ దందా పెరగడంతో వినియోగదారులు ఇండక్షన్ స్టవ్లను నమ్ముకుంటున్నారు. గ్యాస్ కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా విద్యుత్ సాయంతో వంట పూర్తి చేసుకోవచ్చు. గ్యాస్ ధరలు పెరగడం, రీఫిల్లింగ్ కష్టతరమవ్వడంతో పోలిస్తే ఇండక్షన్ స్టవ్ వాడకం కొంత మేర పొదుపుగా ఉంటుందని మధ్యతరగతి ప్రజలు భావిస్తున్నారు. కేవలం ఫిజికల్ స్టోర్లలోనే కాకుండా, అమెజాన్, ఫ్లిప్కార్ట్ వంటి ఈకామర్స్ సైట్లలో కూడా ఇండక్షన్ స్టవ్లకు ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. గ్యాస్ సిలిండర్ల సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు ఈ ఇండక్షన్ స్టవ్ల జోరు కొనసాగేలా కనిపిస్తోంది. ప్రభుత్వం గ్యాస్ పంపిణీ వ్యవస్థను ఎప్పటికి చక్కదిద్దుతుందో వేచి చూడాలి.





## ముగిసిన హెచ్‌జె దొర అంత్యక్రియలు

### పాడే మోసిన డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించి, అలుపెరుగని సంస్కర్తగా పేరుగాంచిన దివంగత మాజీ డిజిపి హెచ్.జె.దొర అంత్యక్రియలు శనివారం నాడు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో పలువురి అశ్రునయనాల మధ్య ముగిశాయి. జూబ్లీహిల్స్‌లోని ఆయన స్వగృహం నుండి శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన అంతిమయాత్రలో పోలీసు అధికారులు, సిబ్బంది, అభిమానులు పాల్గొనగా, మహాప్రస్థానం వద్ద అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు శనివారం మధ్యాహ్నం వరకు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించిన పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు ఘన నివాళులర్పించారు. తన మార్గదర్శికి అంతిమ గౌరవం సమర్పిస్తూ రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి స్వయంగా పాడే మోశారు. ఆయనతో పాటు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ కూడా పాడే మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎస్పీగా ఉన్న తొలి నాళ్లలో తనను ప్రోత్సహించి, హెచ్.జె.దొర సొంత జిల్లా అయిన శ్రీకాకుళానికి ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చి విధి నిర్వహణలో దిశానిర్దేశం చేసిన జ్ఞాపకాలను ఈ సందర్భంగా డిజిపి గుర్తుచేసుకున్నారు. మాజీ డిజిపి జితేందర్, ఐపిఎస్ అధికారులు రాజీవ్ త్రివేది, ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఐఎస్‌డబ్ల్యూ, ఒఎస్డి కమలాసన్ రెడ్డి తదితరులు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. పోలీస్ వ్యవస్థకు హెచ్.జె.దొర చేసిన సేవలు స్మరించుకుంటూ వీడ్కోలు పలికారు.

## భక్తుల ఇంటికే శ్రీ సీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలు

### 23 నుంచి బుకింగ్స్ ప్రారంభం : టిజిఎస్‌ఆర్‌టిసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరగబోయే శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని టిజిఎస్‌ఆర్‌టిసి నిర్ణయించింది. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో శనివారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను టిజిఎస్‌ఆర్‌టిసి విసి, ఎండి వై.నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 27న జరిగే వేడుకలను దృష్టిలో ఉంచుకుని, వివిధ కారణాల వల్ల భద్రాచలం కు వెళ్లలేని తెలంగాణ, ఎపి భక్తుల కోసం గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములవారి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకు చేరవేసే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ తలంబ్రాల ప్యాకెట్లు పొందాలనుకునే భక్తులు www.tgsrtclogistics.co.in వెబ్ సైట్‌లో లాగిన్ అయి ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవడంతో పాటు టిజిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి, వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 04023450033, 04069440069లలో సంప్రదించాలన్నారు. శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం అనంతరం ఈ తలంబ్రాలను భక్తులకు టిజిఎస్‌ఆర్‌టిసి హోం డెలివరీ చేస్తుందని నాగిరెడ్డి పేర్కొన్నారు.

# మూసీకి ఆనాటి వైభవం తిరిగొచ్చేనా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించిన వివరాల ప్రకారం మూసీ నదిని శుద్ధి చేసి శాశ్వత నీటి ప్రవాహం కల్పించడం, కాలుష్య నియంత్రణ కోసం సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు, వరదల నివారణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నది తీరంలో రోడ్లు, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, పర్యాటక అభివృద్ధి, నైట్ టూరిజం ప్రోత్సాహం, నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లడం లక్ష్యం. నది బఫర్ జోన్‌లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం సరైన పునరావాసం, ఆర్థిక సహాయం అందిస్తామని, పరివాహక ప్రాంత పేదలకు మెరుగైన ఇళ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం బాధితులకు ఊరట కలిగించే అంశాలు. మూసీ అభివృద్ధి వల్ల కాలుష్యం తగ్గి ప్రజల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో పాటుమరో వైపు పర్యాటక, వాణిజ్య కార్యకలాపాల వల్ల ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

**ప్రజల భయాందోళనలు... అభివృద్ధి వర్సెస్ ప్రజా హక్కులు**

మూసీ నది అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ప్రకటించిన భారీ ప్రాజెక్టు ఇప్పుడు 'అభివృద్ధి వర్సెస్ ప్రజా హక్కులు' అనే చర్చగా మారుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై చేసిన ప్రసంగంలో హైదరాబాద్ భవిష్యత్తు విజన్ కనిపించినా, నేలమీద ఉన్న వాస్తవాలు మాత్రం బాధితుల్లో అనేక అనుమానాలకు దారితీస్తున్నాయి. ఒక వైపు గ్లోబల్ సిటీ లక్ష్యం, మరోవైపు ఇళ్ల భవిష్యత్తు ఏమిటి? అనేది సాధారణ ప్రజల ప్రశ్న. మూసీ అభివృద్ధి ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వ హామీలు కాగితాలపై మాత్రమేనా? లేక అమలులో కనిపిస్తాయా? అని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బఫర్ జోన్‌లో ఉన్న వేలాది నిర్మాణాలు తొలగించే అవకాశం ఉండటం వల్ల ప్రజలు నిర్వాసితులయ్యే ప్రమాదం ఉందని, బఫర్ జోన్‌లో ఉన్న భవనాలకు జీరో విలువ అనే వ్యాఖ్యలు ఆస్తి యజమానుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు అమలు పారదర్శకతపై ప్రధానంగా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పరిహారం మార్కెట్ రేటుకి వస్తుందా? పునరావాసం నగరంలోనే ఉంటుందా? జీవనోపాధి ఏమవుతుంది? అనేవి బాధితుల ప్రధాన భయాలు, సందేహాలుగా ఉన్నాయి. మూసీ అభివృద్ధి అవసరం అనే విషయంలో పెద్దగా విభేదం లేదు కానీ అభివృద్ధి పేరు చెప్పి ప్రజల ఆస్తి, జీవనాధారంపై అనిశ్చితి ఏర్పడితే సహజంగా ప్రజల నుంచి వ్యతిరేకత ఏర్పడే అవకాశం ఉంది. నది శుద్ధి, వరద నియంత్రణ, రివర్ ఫ్రంట్ అభివృద్ధి, పర్యాటక అవకాశాలు వంటి అంశాలు అభివృద్ధి దిశగా సానుకూల సంకేతాలుగా కనిపిస్తున్నప్పటికీ అభివృద్ధి అంటే కేవలం నిర్మాణాలు కాకుండా అది ప్రజల జీవితాలతో ముడిపడి ఉంటుంది అనే వాస్తవాన్ని ప్రభుత్వం మరవకూడదని సామాజిక వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

**విపక్షాల రాజకీయ దాడి**

ప్రాజెక్టు అమలులో భాగంగా మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న అనేక ఇళ్లు తొలగించే అవకాశం ఉందనే విషయం రాజకీయ వివాదానికి కేంద్ర బిందువైంది. ప్రజాభిప్రాయం తీసుకోకుండా, భారీ వ్యయం, నిధుల సమీకరణపై స్పష్టత లేకుండా రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే ప్రాజెక్టు చేపట్టిందని బిఆర్‌ఎస్, బిజెపి విమర్శిస్తున్నాయి. అభివృద్ధి కోసం పేదలే బలి కావాలా? అని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల ఎన్ని కుటుంబాలు ప్రభావితమవుతాయి? పునరావాసం ఎక్కడ? పరిహారం ఎంత? ప్రాజెక్టు ఖర్చు ఎంత? ప్రజలతో చర్చ జరిగిందా? అనే అంశాలపై స్పష్టత లేదని విమర్శిస్తున్నాయి. పేదలను బయటకు పంపి విలువైన భూములను అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు ఇస్తారా? పూర్తి ప్రాజెక్టు నివేదిక ఎందుకు బయట పెట్టడం లేదు? అనే ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

**రాజకీయంగా రేవంత్ రెడ్డికి పరీక్షే**

మూసీ ప్రాజెక్టు కేవలం అభివృద్ధి ప్రాజెక్టు మాత్రమే కాదని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా కూడా ఒక పెద్ద పరీక్షే అని చెప్పాలి. పట్టణ మధ్యతరగతి అభివృద్ధిని కోరుకుంటోంది. పేదలు భద్రత కోరుకుంటున్నారు. ప్రతిపక్షాలు అవకాశం కోసం చూస్తున్నాయి. ఈ మూడు అంశాల మధ్య సమతుల్యత సాధించడం ప్రభుత్వానికి సవాల్ అనే చెప్పాలి. మరోవైపు ఈ ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వ మొదటి మెగా అర్బన్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు విఫలమైతే ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతుంది. విజయవంతమైతే ప్రభుత్వానికి ఇమేజ్ బూస్టర్ అవుతుంది. అందుకే దీనిని రాజకీయ విశ్లేషకులు 'రేవంత్ రెడ్డి అర్బన్ గవర్నెన్స్ టెస్ట్'గా చూస్తున్నారు.

# మారణహోమం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికాకు ఎంతో ప్రయోజనకరమైన పోర్టులు, డాక్‌లు, సైనిక స్థావరాలు,చట్టబద్ధమైన ప్రదేశాలను ధ్వంసం చేస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. చెప్పినవిధంగానే దాడి చేసింది. బాగ్దాద్‌లో ఇరాన్ అనుకూల శక్తులు క్షిపణి దాడిచేసి అమెరికా దౌత్య కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్లు వార్తలు వచ్చాయి. దౌత్యకార్యాలయం లోపల హెలిపాడ్, రాడార్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నాయి.ఆ ప్రాంతంలో చాలా దట్టంగా పొగలు కమ్ముకున్నాయని అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది. ఫుజిరాహ్ చమురు కేంద్రంపై దాడి చేసింది. హోర్ముజ్ జలసంధి నుండి వాణిజ్య నౌకలు వెళ్ళకుండా జోక్యం చేసుకుని అడ్డుకుంటే ఖర్గ్ ద్వీపం సహా ఏ దీవిలో ఉన్న ఇరాన్ కీలక చమురు మౌలిక సదుపాయాలనైనా ధ్వంసం చేస్తామని ట్రంప్‌ముందురోజు హెచ్చరిక చేశారు. చెప్పినట్లుగానే ఖర్గ్‌లో ఉన్న ఇరాన్‌కు ఉన్న అతిపెద్ద ప్రాధాధారమైన ఆయిల్ టర్మినల్‌ను పూర్తిగా తుడిచిపెట్టినట్లు ట్రంప్ ప్రకటించిన వెంటనే ఈ ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. తమ చమురు క్షేత్రాల జోలికివస్తే గల్ఫ్‌లో అమెరికా కలిసి పనిచేసే కీలక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఇరాన్ కూడా ప్రకటించింది. అనుకున్నవిధంగానే అమెరికా–ఇరాన్ పరస్పర తీవ్ర దాడులు చేసుకున్నాయి.

లెబనాన్‌లో జరిగిన దాడుల్లో మరో 12 మంది వైద్య సిబ్బందిమరణించడంతో అక్కడ సంక్షోభం ముదిరింది. సౌదీ అరేబియాలో ఇరాన్ చేసిన క్షిపణి దాడుల్లో అమెరికాకు చెందిన ఐదు రీ–ఫ్యూయలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ధ్వంసమయ్యాయి. మరోవైపు టెహ్రాన్‌లో క్వాడ్ వార్షిక దినోత్సవ ర్యాలీ సందర్భంగా వేలాదిమంది ప్రజలు వీధుల్లో ప్రదర్శనలకు దిగారు. డెత్ టూ ఇజ్రాయెల్, డెత్ టూ అమెరికా అంటూ నినాదాలు చేశారు. ఈ పరిస్థితుల్లో టెహ్రాన్ నగరం పేలుళ్ళతో దద్దరిల్లింది. దీంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని ప్రభుత్వం హెచ్చరికలు చేసింది. యుద్ధం మొదలైనప్పటినుండీ ఇరాన్‌లో రోజుకు వెయ్యి లక్ష్యాల వంతున ఇప్పటివరకూ 15,000 లక్ష్యాలపై అమెరికా దాడులు చేసింది.

ఇరాన్ దాడివల్ల ఐదు రీ–ఫ్యూయలింగ్ ఎయిర్‌క్రాఫ్టులకుపెద్ద నష్టం కలగలేదని, మరమ్మతులు జరుగుతున్నాయని అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ ప్రకటించారు. సెంట్రల్ దోహాలో పేలుళ్ళు సంభవించాయి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో క్లస్టర్ బాంబు వార్‌హెడ్స్‌ను ప్రయోగించడంతో ఇజ్రాయెల్‌లో అనేక ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. టెల్‌అవీవ్‌లో శనివారం ఇరాన్ దాడులతో అనేక చోట్ల భారీ పేలుళ్ళ సంభవించాయి. 2,745 మంది గాయపడ్డారు. సెంట్రల్ ఇజ్రాయెల్ సిటీ హోలోన్‌లో ఇరాన్ చేసిన క్షిపణి దాడ్లు వేర్‌హౌస్ భారీ మంటల్లో దగ్ధమైంది. ఇరాక్‌లో కె.సి–135 రీ–ఫ్యూయలింగ్ ఎయిర్‌క్రాఫ్టు కుప్పకూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు అమెరికా సైనికులు మరణించారు.దీంతో ఇప్పటివరూ యుద్ధంలో మరణించిన అమెరికా సైనికుల సంఖ్య 13 కు పెరిగింది. ఐతే ఇరాన్ దాడివల్ల తెలియక మిత్రదేశాల తప్పిదంవల్ల ఈ రీ–ఫ్యూయలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోలేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా ప్రకటించింది. ఫ్రెంచ్ సైనికుడు మరణిచడంతో ఇరాన్‌లో రక్షణ వ్యవస్థను పటిష్టవంతం చేస్తామని ఆ దేశ ప్రధానమంత్రి ప్రకటించారు. హోర్ముజ్ జలసంధి ద్వారా సహాయ నౌకలను సురక్షితంగా బయటకు పంపాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ఐఆర్‌జిసికి విజ్ఞప్తి చేయగా, పొరుగు దేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయవద్దని హమాస్ ఉగ్రవాద సంస్థ ఇరాన్‌కు విజ్ఞప్తి చేసింది. లెబనాన్‌పై మార్చి రెండోతేదీన ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధ దాడులు మరింత తీవ్రమయ్యాయి. దక్షిణ లెబనాన్‌లో ప్రభుత్వ మౌలిక సదుపాయాలపై చేసిన దాడుల్లో 12 మంది వైద్య సిబ్బంది మరణించారు. సాధారణ జీవన కార్యకలాపాలు కొనసాగించేందుకు లెబనాన్ ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారు. లెబనాన్‌లో యుద్ధం మొదలైనప్పటినుండీ 800మంది మరణించగా, 8,50,000 మంది ప్రజలు ఇళ్ళు వదలి సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. ఇజ్రాయెల్‌లో ఇప్పటివరకూ ఇరాన్ చేసిన దాడుల్లో 14 మంది మరణించగా ఇరాన్‌పై చేసిన దాడుల్లో ఇప్పటివరకూ 5000 మంది సైనికులు మరణించారని ఇజ్రాయెల్ రక్షణ సైనికులు (ఐడిఎఫ్) అంచనావేసింది. 15 రోజులుగా ఇరాన్‌కు చెందిన 50 డ్రోన్లు కూల్చివేసినట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డులు తమ దాడులను మరింత తీవ్రతరం చేశారు. ఇరాన్‌పై కూడా అమెరికా–ఇజ్రాయెల్ దళాలు ఊహించని దాడులు చేస్తున్నాయి. టెహ్రాన్ నగరం బాంబు పేలుళ్ళతో దద్దరిల్లిపోయింది. ఖతార్‌లో ప్రభుత్వం అనేక కీలక ప్రాంతాలను ఖాళీచేసి సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర 15 రోజుల వ్యవధిలో 42 శాతం మేరకు పెరిగింది. అమెరికా,యూరప్‌లలో యూదుల స్థావరాలపై ఆత్మాహుతి, ఉగ్రవాద దాడులు మొదలయ్యాయి. నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌లో యూదుల స్కూలువద్ద బాంబు పేలుడు సంభవించింది. ఇజ్రాయెల్‌తో దీర్ఘకాలిక దాడులకు సిద్ధమని హెజ్బొల్లా ప్రకటించింది. హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థతో కలిసి ఐఆర్‌జిసి సైనికులు అమెరికా–ఇజ్రాయెల్‌పై మార్చి 13 నుండి ఉమ్మడి సమన్వయుద్ధం ప్రారంభించారు.

# కమ్యూనిస్టులతోనే మెరుగైన రాజకీయాలు



## ప్రజాప్రతినిధులు సుపరిపాలన దిశగా అడుగులేయాలి: ప్రొ.నాగేశ్వర్

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కమ్యూనిస్టులతోనే మెరుగైన రాజకీయాలు ప్రజలకు అందుతాయని, నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సుపరిపాలన దిశగా అడుగులేయాలని ప్రొ.నాగేశ్వర్ అన్నారు. పాల్వంచ సుగుణ గార్డెన్స్ జరుగుతున్న సిపిఐ తరుపున నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు శనివారం హాజరైన ఆయన ప్రజా ప్రతినిధులుగా కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పాటుపడాలని, అప్పుడే వారికి ప్రజల నుండి ఆదరణ అందుతుందన్నారు. యుపిఏ 1 ప్రభుత్వంలో కమ్యూనిస్టులు కలిసి ఉన్నప్పుడు ఉపాధిహామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీహక్కుల చట్టం వంటి ప్రజా ప్రయోజన చట్టాలు అమల్లోకి వచ్చాయని, యుపిఏ 2 ప్రభుత్వం నుండి కమ్యూనిస్టులు వైదొలగినప్పుడు అన్నీ కుంభకోణాలు చోటు చేసుకున్నాయని అన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందాలంటే కమ్యూనిస్టుల పాత్ర ఎంతో అవసరమని గుర్తు చేశారు. కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ పేదల పక్షాన నిలుస్తూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరతరం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య పరిష్కారం, రహదారుల నిర్మాణం, వైద్య, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నిజమైన అర్హులకు చేరేలా పర్యవేక్షించడం, అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు కృషి చేయడం కూడా బాధ్యతే అన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం అవసరమైనప్పుడు ముక్కుసూటిగా వ్యవహరించడం చేయాలన్నారు. ప్రజలతో నిరంతరం కలిసిమెలిసి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారం కృషి చేయడం ద్వారానే ప్రజా ప్రతినిధుల పాత్రకు సార్థకం అవుతుందని, ఇది కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు మరీ ముఖ్యమన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యాలతో కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు ఎప్పటికీ ప్రజల పక్షాన నిలబడి పనిచేయాలని, చేస్తున్నారని నాగేశ్వర్ స్పష్టం చేశారు. ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మేలు చేసే దిశగా ముందుకు సాగుతూ కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉండాలన్నారు.

**కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజాసేవకులు**
**ఆర్టిఐ మాజీ కమిషనర్ ప్రొ.మాడభూషి శ్రీధర్**



కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు ప్రజాసేవకులని ఆర్టిఐ మాజీ కమిషనర్ ప్రొ.మాడభూషి శ్రీధర్ అన్నారు. పార్లమెంటు, శాసనసభల మాదిరి గ్రామసభకు కూడా ఒక బాధ్యతాయుత గౌరవం ఉందని ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భారత రాజ్యాంగంలో ఉన్న ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**ప్రణాళికాబద్ధ ఆలోచనతోనే అభివృద్ధి**
**మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి**



స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రణాళికబద్ధంగా ఆలోచన చేసి నిధులను సాధించగలిగితే త్వరితగతిన అభివృద్ధి సాధ్యపడుతుందని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ హక్కులు, నిధుల కోసం పోరాడాలని ఆయన సూచించారు. భారత దేశ పౌరులుగా ఉన్న ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగానికి లోబడి పని చేయాలని రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని భారత రాజ్యాంగంలో అందరికీ సమానమైన హక్కులు కేటాయించబడ్డాయన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత స్థానిక ప్రభుత్వాల విషయంలో కొంత నిర్లక్ష్యం ఉండేదని 73, 74 రాజ్యాంగ సవరణ తర్వాత తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహిస్తేనే నిధులు కేటాయించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉదాహరణకు తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడంతో కేంద్రం నిధులు నిలిపివేసిందని పంచాయతీ ఎన్నికలు జరిగిన తర్వాత ఇప్పుడు నిధులు విడుదల చేసిందని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీలకు 90 శాతం నిధులు జనాభా ప్రతిపాదికన పది శాతం నిధులు వైశాల్యం ప్రాతిపదికన కేటాయించబడతాయన్నారు. నిధుల కేటాయింపులో ఎటువంటి వివక్షత ఉండదన్నారు. పంచాయతీ లేదా మున్సిపల్, కార్పొరేషన్ ప్రతినిధులు ముందుగా తమ విధులు, బాధ్యతలను గుర్తెరగాలని ఆయన సూచించారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి సురేష్, ఎస్‌కె సాబీ ర్ పాషా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర్లు, భిక్షపతి, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### జనం మన్ననలు పొందగలిగిన వారే నిజమైన నాయకులు – ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు



జనం మన్ననలు పొందగలిగిన వారే నిజమైన నాయకులు అని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు అనునిత్యం ప్రజలతో మమేకం కావాలిని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కమ్యూనిస్టు నాయకునిగా ఉంటే ఆ విలువే వేరని, అన్యాయం రాజ్యమేలుతున్నప్పుడు ప్రజల కమ్యూనిస్టులను కోరుకుంటారని కమ్యూనిస్టుల దగ్గరకు వెళితే సమస్యలు తీరుతాయనే నమ్మకం ప్రజల్లో ఉందని, దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రతీరోజు ప్రజాప్రతినిధులు వారివారి వార్డుల్లో, డివిజన్లలో తిరగాలాని, ఆత్మీయానుబంధాలు పెంచుకోవాలని, సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మన ప్రాంతంలోనే కాకుండా జిల్లా నలు మూలల, రాష్ట్రవ్యాప్తంగా, దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వార్తా పత్రికలు చదవాలని, పుస్తక పఠనం అలవర్చుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

### తెలంగాణ గడ్డపై కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర – సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ



కమ్యూనిస్టుల సహకారం లేకుంటే ప్రభుత్వాలు మనుగడను కోల్పోతాయని, దేశంలో యూపిఏ 1 ప్రభుత్వం ఉన్నప్పుడు ఉపాధిహామీ, సమాచార హక్కు, అటవీ హక్కుల చట్టం రూపొందాయని, యుపిఏ 2 ప్రభుత్వం నుండి వామపక్షాలు వైదొలగినప్పుడు అన్నీ కుంభ కోణాలే చోటు చేసుకున్నాయని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. తెలంగాణ గడ్డపై కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర అని, ఆ వీరోచిత చరిత్ర ఇప్పుడు కొత్తగూడెం నియోజకవర్గంలో పునరావృతం అవుతోందన్నారు. దేశ కమ్యూనిస్టు రాజకీయాల్లో కొత్తగూడెం నియోజకవర్గ విజయాలు ఆదర్శమని, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గెలిచిన నాటి నుండి గ్రామ పంచాయితీ ఎన్నికలతో పాటు కార్పొరేషన్ ఎన్నికల్లోనూ విజయపరంపర కొనసాగిందని, రానున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో ఇదే హవా కొనసాగాలన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ నుండి గెలిచిన వారిలో 90 శాతం యువతరం ఉందని, ఇది శుభపరిణామం అన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కమ్యూనిస్టులపై గురుతర బాధ్యత ఉందని, ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ విస్తరణకు పాటుపడాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా సుపరిపాలన అందించి ప్రజల్లో చెరగని ముద్ర వేయాలని కోరారు.

### బిజెపి, ఆర్‌ఎస్ఎస్ ప్రయత్నాలు తిప్పికొట్టాలి – పశ్య పద్మ



దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నదని దీనితో పేదరికం పెరిగి పోతున్నదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ ఆందోళన వ్యక్తం చేశారు.

### మహిళా ప్రతినిధులపై మరింత బాధ్యత – అక్కినేని వనజ



అనంతరం మహిళా ప్రజాప్రతినిధులపై మరింత బాధ్యత ఉందని దానిని నెరవేర్చటానికి అహర్నిషలు కష్టపడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు.

# అణగారిన వర్గాల కోసం ప్రాణాలర్పించిన వీరుడు అనభేరి




## ప్రభాకర్ రావు 78వ వర్ధంతి సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** స్వతహాగా దేశ్‌ముఖ్‌ల కుటుంబంలో పుట్టినా, వందల ఎకరాలు భూములు ఉన్నప్పటికీ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, తాడిత, పీడిత అణగారిన వర్గాల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదలడమే కాకుండా, నిజాం నవాబు రజాకార్ పోలీస్ మూకలపై రణభేరి మ్రోగించిన తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట యోధుడు అనబేరి ప్రభాకర్ రావు అని, ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత సిపిఐ శ్రేణులపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సిపిఐ కరీంనగర్ జిల్లా మొట్ట మొదటి కార్యదర్శి అనభేరి ప్రభాకర్ రావు 78వ వర్ధంతి సందర్భంగా నగరంలోని వెంకటేశ్వర టెంపుల్ ముందుగల అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి చాడ వెంకటరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలోని నిజాం నవాబుల పరిపాలన సమయంలో ప్రజల నుండి పన్నులు వసూలు చేస్తూ, వెట్టిచాకిరి చేయించుకుంటూ, ప్రజలను బానిసలుగా చూసే రోజుల్లో తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్ రావు తన చిన్నతనం నుండే ఎదిరించే స్వభావాన్ని కలిగి ఉన్నాడని, ఆనాటి పరిస్థితులను అంచనా వేసి పేదల కోసం నిజాం పరిపాలకులను, వారి తాబేదారులైన రజాకార్లను, దేశ్‌ముఖ్‌లను ఎదిరించడానికి ఆంధ్ర మహాసభలో చేరి ప్రజలను చైతన్యపరచాడన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని, ఆనాడు సాయిధ పోరాటమే సిపిఐ నిర్వహించకపోతే నేటి తెలంగాణలో పరిస్థితులు భిన్నంగా ఉండేవని, నిజాం నవాబుల కింద బానిసలుగా ఉండేదని, రజాకార్లు, దేశ్‌ముఖ్‌ల, పటేల్ పట్వారి, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే నేడు మనం అనుభవిస్తున్న స్వతంత్ర ఫలమని, అనభేరి ప్రభాకర్ రావుతో పాటు సింగిరెడ్డి భూపతిరెడ్డి లాంటి అమరవీరుల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి, రానున్న భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా పాలక ప్రభుత్వాలు పనిచేయాలని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, గూడెం లక్ష్మి, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కొట్టే అంజలి, సిపిఐ జిల్లా, నగర నాయకులు నగునూరు రమేష్, బాకం సంపత్, కసిబొజుల సంతో ష్ చారి, కూన రవి ఎలిశెట్టి భారతి, కేమ్సారం నర్సింహులు, ఓర్సు కొమురయ్య, రమేష్, పెం చాల సంపత్, మామిడిపల్లి హేమంత్ కుమార్, బానోత్ రవి తదితర నాయకులు ఉన్నారు.

# న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగా వ్యవహరించాలి



## ఐఎఎల్ జాతీయ అధ్యక్షుడు ఆర్.ఎస్.చీమా

**న్యూఢిల్లీ :** పాలక వర్గాల ప్రయోజనాలకు దూరంగా ప్రజానుకూలమైన చట్టాలను వర్తింపజేయటంలో రాజ్యాంగ విలువలు, నైతికత ప్రమాణాలు పాటిస్తూ న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ అధ్యక్షుడు రాజేందర్ సింగ్ చీమా పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని జవహర్ భవన్‌లో శనివారం జరిగిన ఐఎఎల్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో న్యాయవాద వృత్తి వ్యాపారంగా రూపుదిద్దుకుంటోందని, సంపన్నవర్గాలకు చెందిన వారు కార్పొరేట్ పద్ధతుల్లో న్యాయసంస్థల(లీగల్ ఫర్మ్స్) పేరుతో ప్రవేశిస్తూ, లబ్ది పొందే ప్రయత్నాలు సాగతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జనసామాన్యానికి న్యాయవ్యవస్థను ఐఎఎల్ అందుబాటులోకి తీసుకెళ్ళాలని కోరారు. సమావేశంలో ఐఎఎల్ జనరల్ సెక్రెటరీ బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ చేస్తూ దేశవ్యాప్తంగా న్యాయవాదులపై ప్రత్యక్ష దాడులు తీవ్రమవుతున్నాయని, భూమి విలువ పెరగడం కూడా అందుకు ఒక కారణమని చెప్పారు. న్యాయవాదులకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, ఇందులో భాగంగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తీసుకోరావాలని కోరారు. సంక్షేమ చర్యలకు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని అన్నారు. ప్రధాన కార్యదర్శులు మురళీధర, లోహిత్ కుమార్‌లు మాట్లాడుతూ ప్రస్తుతం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లు కార్మిక వర్గ ప్రయోజనాలను కాలరాసాయని, గతంలో న్యాయకోవిదుడైన జస్టిస్ కృష్ణయ్యర్ ఇచ్చిన తీర్పులలో ప్రమాణికంగా భావించే వాటిని ఫుల్ బెంచ్‌ల పేరుతో తిరగదోడే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది దేశానికే నష్టదాయకమని అన్నారు. అందుకు కార్మిక వర్గంతో పాటు న్యాయవాదులు కూడా ప్రజలను చైతన్యవంతులను చేయాలని అన్నారు. సమావేశంలో ఐఎఎల్ నాయకుల అశ్విని భక్షి, సునీల్, ముఖర్జీ, కునాల్ రావత్, రీతు పురి, కారింగుల రామ్మూర్తి, తదితరులు న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఈ ఏడాది చివరలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఐఎఎల్ జాతీయ మహాసభలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

# డిజిటల్ ఎకానమీగా మారేందుకు సహకరిస్తాం

## టాంజానియా ఉన్నత స్థాయి బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఐటి, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, మహిళా సాధికారత, ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలెప్ మెంట్ తదితర కీలక రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను సిద్ధం చేస్తామన్నారు. తెలంగాణ సచివాలయంలో శనివారం టాంజానియా మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్, ఐటి, ఇన్నోవేషన్ ముద్రిక్ రమదాని సోరాగా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యింది. 'తెలంగాణ టాంజానియా' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సామాజిక, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి బలమైన పునాదిగా మారిందన్నారు. ఆ దిశగా తెలంగాణ వేసిన అడుగులు ప్రపంచ పటంలో మన రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండ ఇమేజ్‌ను క్రియేట్ చేశాయన్నారు. ఇదే స్ఫూర్తితో డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారం, మెంటార్ షిప్, నైపుణ్య మార్పిడి అందిస్తామన్నారు. అక్కడ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు గల సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.

'మీ సేవ' ద్వారా డోర్ స్టెప్ సిటిజన్ సర్వీసెస్ డెలివరీ, 'టీ హబ్' మార్గ నిర్దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహం, స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం తదితర అంశాల్లో ఒక 'నాలెడ్జ్ పార్ట్నర్'గా వ్యవహరిస్తామన్నారు. యంగ్ ఇండి యా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ పై మార్గనిర్దేశం చేస్తామన్నారు. బ్లూ ఎకానమీ, టూరిజంలో టాంజానియా అవలంభిస్తోన్న బెస్ట్ ప్రాక్టీసెస్ పై అధ్యయనం చేసి... తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 'డిజిటల్ ఎకానమీగా మారాలన్న మా లక్ష్య సాధనలో తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఆవశ్యకం. ఐటీ, హెల్త్ కేర్, మెడికల్ టూరిజం, డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో సాధించిన ప్రగతి, చేపట్టిన సంస్కరణలు మాకు స్ఫూర్తిదాయకం. అందుకే... తెలంగాణతో కలిసి పని చేసేందుకు త్వరలోనే ఎంఓయూ కుదుర్చుకుంటాం' అని టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టాంజానియా కమ్యూనికేషన్, ఐటి, ఇన్నోవేషన్ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ఫాత్మా మబ్రూక్ ఖమిస్, జాంజిబార్ ఐసిటి అథారిటీ సిఇఒ శుకూరు అవాద్ సులేమాన్, ప్రెసిడెంట్స్ డెలివరీ బ్యూరో హెడ్ ఆఫ్ టెక్నాలజీ, ఇన్వెస్ట్ మెంట్స్ జాన్ మహుండి తదితరులు పాల్గొన్నారు.

# దోచుకునేందుకే... మూసీ ప్రణాళిక తెరపైకి తెచ్చారు

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి కోసమే లక్షన్నర కోట్లతో మూసీ ప్రణాళికను తెరపైకి తెచ్చిందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కె.తారక రామారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసి సుందరికరణ కాదని, మూసీ భూముల అక్రమ పథకమని ఆయన పేర్కొన్నారు. హిమాయత్ సాగర్ వేదికగా శనివారం 'మూసీ పునరుజ్జీవం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.16,000 కోట్లతో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో 6 కిలోమీటర్ల మేర విజయవంతంగా అభివృద్ధి చేశామని వివరించారు. అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్షన్నర కోట్ల రూపాయల అంచనాలతో సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ విధ్వంసానికి పాల్పడుతోందని ఆయన విమర్శించారు. ఎలాంటి డీటెయిల్స్ ప్లానింగ్ రిపోర్టు లేకుండా, సోషల్ ఇంపాక్ట్ స్టడీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు, ప్రజలతో ఎలాంటి చర్చలు లేకుండా వేలమంది ఇండ్లను కూలగొడతామని భయాందోళనకు గురిచేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చట్టాలను, ఇతర నిబంధనలను అన్నింటినీ పాతర వేసి వేలకోట్ల అవినీతికి తెగబడుతున్నది అని విమర్శించారు. అభివృద్ధికి మేము ఏమాత్రం వ్యతిరేకం కాదు అని అవినీతికి కాంగ్రెస్ పార్టీ భూదాహానికి రేవంత్ రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు మాత్రం వ్యతిరేకమని కెటిఆర్ అన్నారు. కచ్చితంగా రేవంత్ రెడ్డి అవినీతిని అడ్డుకుంటామన్నారు. పార్టీలకు అతీతంగా హైదరాబాద్ నగర ప్రజలను కాపాడుకుంటాము అని తెలిపారు. బాధితుల వెంట కచ్చితంగా అండగా ఉంటామన్నారు. ఒక రెండు సంవత్సరాల పాటు మూసి బాధితులు సమిష్టిగా కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాడితే మా ప్రభుత్వం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ బుల్డోజర్ రాజ్యాన్ని పారదోలి ప్రతి ఒక్కరి ఇళ్లను భూములను కాపాడుతామని కెటిఆర్ హామీ ఇచ్చారు.

# వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్

## రూ.300 కోట్లతో నర్మెట్ట ఆయిల్‌ఫెడ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ
## 22న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
## మంత్రులు తుమ్మల నాగేశ్వర్, పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/సిద్దిపేట :** తెలంగాణలో అత్యధిక శాతం పండించే వరిని కేంద్ర ప్రభుత్వం కొనననని తెగేసి చెప్పిందని ఈ సమయంలో ప్రత్యామ్నాయంగా తెలంగాణ రైతులకే కాదు దేశంలోని రైతులకు సిరులు కురిపించే అద్భుతమైన పంట ఆయిల్‌పామ్ అని, అలాంటి పంటకు దేశంలోనే అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన ఫ్యాక్టరీ సిద్దిపేట జిల్లాలోని నర్మెట ఆయిల్‌ఫెడ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అని, 120 మెట్రిక్ టన్నుల వరకు ఆయిల్ గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉన్న ఈ ఫ్యాక్టరీ "ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా మారుతుందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్, జిల్లా మంత్రి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లు తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట ఆయిల్‌ఫెడ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ రాష్ట్ర ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హైమావతిలతో కలిసి మంత్రులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్, పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లు మాట్లాడుతూ... ఈ నెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించేందకు క్షేత్ర స్థాయిలో పరిశీలించామని తెలిపారు. చిన్నచిన్న పనులు తప్ప దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయని అన్నారు. ప్రస్తుత కాలంలో రైతులుపంట మార్పిడి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందని, ఎలాంటి చీడ, పీడ బాధలు, అడవి పందులు, కోతులు, వడగండ్ల వానల బాధలు లేకుండా "రైతులకు స్థిరమైన అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలి" అని మంత్రులు అన్నారు. ఈ నెలలో ఫ్యాక్టరీ ప్రారంభించి అందులోనే 20 నుండి 22 వరకు మూడు రోజులపాటు రైతుమేళా నిర్వహిస్తామన్నారు. ఇందులో ఆయిల్‌పామ్ పంటలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యవసాయ యాంత్రీకరణ, అధునాతన వ్యవసాయ పద్దతులపై ప్రదర్శన, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులచేత రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని మంత్రులు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో పండించిన ఆయిల్‌పామ్ పంటను ప్రాసెస్ చేసే కెపాసిటీ నర్మెట ఆయిల్‌ఫెడ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి ఉంది అన్నారు. ఎకరాకు లక్ష రూపాయలకు పైన ఆదాయం వచ్చే ఏకైక పంట ఆయిల్‌పామ్ పంట అని, రైతులకు ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ తెలిపారు. అలాగే ఫ్యాక్టరీని ప్రారంభించిన అదే రోజు రూ.40 కోట్లతో ఆయిల్ రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయడం జరుగుతుందని మంత్రులు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రిగా మొదటి సంతకం నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చేశానని అప్పుడు రూ.12000 వేలు ఉన్న ధర ఇప్పుడు రూ.21,546లకు చేరిందని, 25వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డైరెక్టర్, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ భాషా, సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారులు, ఆయిల్ ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# పారా ఒలింపిక్స్ విజేతలకు ప్రోత్సాహాలు అందిస్తాం

### మంత్రి వాకిటి శ్రీహరి


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారా ఒలింపిక్స్‌లో వివిధ స్థాయిల్లో విజయం సాధించిన క్రీడాకారుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, వారికి ఇళ్ల స్థలాలు, ఆర్థిక సాయం వంటి అంశాలపై బడ్జెట్ లో చర్చిస్తున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.మంత్రి వాకిటి శ్రీహరిని మినిస్టర్ క్వార్టర్స్‌లో పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్–2026లో 6 కాంస్య పతకాలు సాధించిన ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు.
ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీలలో వీరు ప్రతిభ చాటుతూ రాష్ట్రానికి గౌరవం తీసుకొచ్చారు. మార్చ్ 8 నుండి 13 వరకు ఢిల్లీలో నిర్వహించిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్–2026 పోటీలలో అకాడమీకి చెందిన క్రీడాకారులు మమతా, కుడుముల లోకేశ్వరి, రవి కిరణ్, లోకేష్ కలిసి మొత్తం 6 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంత్రి క్రీడాకారులను అభినందిస్తూ, పారా క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పారా అథ్లెట్ కుడుముల లోకేశ్వరి తన క్రీడా ప్రయాణాన్ని వివరించారు. చిన్న వయస్సులోనే బ్రెయిన్ ట్యూమర్‌కు చికిత్స తీసుకున్న అనంతరం శరీరంలోని కుడివైపు పూర్తిగా పనిచేయని పరిస్థితి వచ్చినప్పటికీ ధైర్యంగా ముందుకు సాగి 2020 నుండి ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 12 పతకాలు సాధించినట్లు తెలిపారు. 2025 జూలైలో చెక్ రిపబ్లిక్‌లో జరిగిన విమెన్ అథ్లెటిక్స్ గ్రాండ ప్రిక్స్ పోటీలలో కాంస్య పతకం గెలిచిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం తనను గుర్తించి ఆర్థిక సహాయం అందించడం మరింత ప్రోత్సాహాన్నిచ్చిందన్నారు.శ్రీహరి క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ, పారా స్పోర్టట్స్ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వాకిటి తెలిపారు.

## ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

**ప్రజాపక్షం / సోమాజిగూడ :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ వేయాలని పలువురు వక్తలు కోరారు. కేవలం ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా కాకుండా, మీడియా, ఉద్యమ సంఘాల ధ్రువీకరణ ద్వారా ఉద్యమకారులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయి అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఉద్యమ సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపి కేశవరావు మాట్లాడుతూ ప్రతి తెలంగాణ బిడ్డ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఆకాంక్షించిందన్నారు. వీరంతా వివిధ రూపాల్లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. జైలుకు పోయి, దెబ్బలు తిన్న వారే ఉద్యమకారులు కాదని పేర్కొన్నారు. తెలంగాణలోని అందరూ తెలంగాణ ఉద్యమకారులేనని స్పష్టంచేశారు. సిపిఐ ఎంఎల్ నేత గోవర్ధన్ మాట్లాడుతూ ఉద్యమకారుల డిమాండ్లపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కాంగ్రెస్ ఉద్యమకారులకిచ్చిన హామీలను నెరవేరాల్చని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ఉద్యమకారులు ఏకమై రాజకీయ పార్టీలను నిలదీయాలన్నారు. బతిమాలాడటం కాదని బలంగా గుంజుకొందామని, అది ఉద్యమకారుల హక్కు అని పేర్కొన్నారు. బిజెపి ఇంటెలెక్చువల్ కన్వీనర్ గంగాపురం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ రాజకీయ అవసరాలకు ఉద్యమాన్ని వాడుకొన్నారన్నది అందరికి తెలిసిన విషయమేనన్నారు. అయితే, ఉద్యమకారుల హామీలను మేనిఫెస్టోలో పెట్టలేదన్నారు. కాంగ్రెస్ మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు, 250 గజాల ఇంటి స్థలం వంటి హామీలను పెట్టి, ఇప్పుడు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. బిఆర్‌ఎస్ నేత చెరుకు సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులంతా కమిటీగా ఏర్పాటై, అమరులైన ఉద్యమకారులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని పేర్కొన్నారు. కరుణాకర్ దేశాయి మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించి ఉచిత వైద్యం, ప్రయాణం కల్పించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఉద్యమకారుల కాలనీలు ఏర్పాటు చేసి,250గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమ సంఘాల నేతలు ప్రఫుల్ రాంరెడ్డి, జానకి రెడ్డి, రఫీ, చీమ శ్రీనివాస్ పాల్గొన్నారు.



గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కుమారుడు సాయి సాకేత్ రెడ్డి, ఐశ్వర్యల వివాహానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు హాజరైన దృశ్యం.

## తమ్మినేని వీరభద్రంను పరామర్శించిన సిపిఐ(ఎం) నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రంను శనివారం హైదరాబాదులోని గచ్చిబౌలి ఎఐజి హాస్పిటల్‌లో సిపిఐ(ఎం) నేతలు పరమార్శించారు. గుండె జబ్బు, ఊపిరితిత్తుల్లో నీరు, తదితర సమస్యలతో గత 4 రోజులుగాఎఐజి హాస్పిటల్‌లో ఐసియులో చికిత్స పొందుతున్న ఊపిరితిత్తుల్లో నీరు, తదితర సమస్యలతో తమ్మినేని వీరభద్రంను సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పార్టీ నాయకులు బి వెంకట్, టి సాగర్, ఎండి అబ్బాస్, భూపాల్, ఆర్ వెంకట్రాములు, పి జయలక్ష్మి హాస్పిటల్‌కు వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా వీరభద్రం ఆర్యోగ పరిస్థితిని వారు డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారని డాక్టర్లు తెలిపారు.

## రచయితలు సమాజానికి దారి చూపించే మార్గదర్శకులు

### అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 'రైటర్స్ మీట్ రజతోత్సవం'లో విసి ప్రొ. ఘంటా చక్రపాణి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రచయితలు సమాజానికి దారి చూపించే మార్గదర్శకులని, వారిని గౌరవించాల్సిన భాద్యత అందరిపై ఉందని డా.బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. డా.బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, తెలుగు శాఖ కళల విభాగం ఆధ్వర్యంలో రచయితల సంఘం రజతోత్సవం సందర్భంగా 'రైటర్స్ మీట్ కార్యక్రమం' శనివారం జరిగింది. దీనికి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగిస్తూ రచయితలు, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా మాట్లాడుకునేందుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎల్లప్పుడూ ఒక వేదికగా ఉంటుందన్నారు. ఈ వేదిక ద్వారా రచయితలు వారి ఆలోచనలు, భావాలు, అనుభవాలు, సామాన్య ప్రజల సమస్యలకు గొంతుగా మారాలని, అది తమ రచనల రూపంలో ప్రజలను చైతన్య పరచాలని రైటర్స్ సంఘం ప్రతినిధులకు సూచించారు. ఈ సంఘం స్థాపించి ఇరవై ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరుపుకునే వేడుక రజతోత్సవంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భాగస్వామి కావడం గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రచయిత అల్లం రాజయ్య మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలలోని తెలుగు రచయితలను ఒకచోట చేర్చి, తెలుగు సాహిత్యానికి కొత్త దిశను చూపుతుందని పేర్కొంటూ, కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. ప్రముఖ రచయిత ఖదీర్ బాబు, పాత్రికేయులు, సంపాదకులు డా. కె.శ్రీనివాస్, రచయిత వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, ప్రఖ్యాత రచయితలు ఎల్.వి.రెడ్డి, కె.ఎన్ మల్లీశ్వరీ, కుప్పిలి పద్మ, ఎన్. రజని, వాసిరెడ్డి నవీన్, పలువురు కథకులు, పలు రాష్ట్రాల నుంచి రచయితలు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## ఐపిఎల్ టికెట్ల వివాదంలో కేంద్రం జోక్యం

### టిసిఎ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో త్వరలో సీరిస్ ప్రారంభమయ్యే ఐపిఎల్ మ్యాచ్‌ల టికెట్ల పంపిణీపై వివాదం చెలరేగింది. ప్రతి మ్యాచ్‌కు వేల సంఖ్యలో ఉచిత పాస్‌లు వస్తున్నప్పటికీ అవి యువ క్రికెటర్లకు అందడం లేదని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ఆరోపించింది.ఈ అంశంపై కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఐపిఎల్ మ్యాచ్‌కు సుమారు 4,000 ఉచిత పాస్‌లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అందుతున్నాయని తెలిపారు. అయితే ఆ పాస్‌లను అసోసియేషన్ అధికారులు తమ వద్దే ఉంచుకుంటున్నారని, నిజంగా క్రికెట్ ఆడుతున్న యువ ఆటగాళ్లకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ పాస్‌లను ముందుగా హెచ్‌సిఎ, టిసిఎలో నమోదు చేసుకున్న యువ క్రికెటర్లకు ఇవ్వాలని గురువారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి చెందాలంటే నిజమైన ఆటగాళ్లను ప్రోత్సహించాల్సిందేనని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఉప్పల్ స్టేడియంలో భద్రతా అంశాలపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అగ్నిమాపక భద్రతా అనుమతులు లేకుండానే మ్యాచ్‌లు నిర్వహిస్తే ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ఐపిఎల్ మ్యాచ్‌లను ఇతర రాష్ట్రాలకు తరలించే పరిస్థితి రావచ్చని కూడా పేర్కొన్నారు. అదే విధంగా హెచ్‌సిఎలో అక్రమాలను నివారించేందుకు బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ) ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని నియమించాలని ఆయన కేంద్రాన్ని కోరారు.మాజీ హెచ్‌సిఎ అధ్యక్షుడు మహ్మద్ అజాహరుద్దీన్ కూడా కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదని ఆరోపించారు. హెచ్‌సిఎలో మొత్తం ఆర్థిక అవకతవకలు రూ.300 కోట్లకు పైగా ఉండవచ్చని ఆయన అన్నారు. రాజకీయ నాయకులు, పవర్ బ్రోకర్లు, ప్రైవేట్ అకాడమీలు కలిసి తెలంగాణ క్రికెట్‌ను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. నిజాలు బయటపడే వరకు చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిసిఎ నేతలు శ్రీనివాస్‌గార్గే, చిత్తరంజన్, వరుణ్‌రెడ్డి, రామ్‌చల్ల తదితరులు పాల్గొన్నారు.



## విపత్తుల తీవ్రత నివారణలో ముందస్తు ప్రణాళికలు అనివార్యం

### బాల్ రక్షా భారత్, సేల్స్ ఫోర్స్ ఫౌండేషన్, యూనిసెఫ్ సంయుక్త కార్యాచరణ

**హైదరాబాద్ :** విపత్తులను ముందే పసిగట్టి రాబోవు విపత్తులను అనగా ప్రకృతి పరంగా, మానవీయ తప్పిదల వలన, ప్రతిరోజూ సమాజం ఎదుర్కొంటున్న ప్రమాదాలు, వాటి తీవ్రతను ముందుగానే అంచనా వేసి దానికి రాష్ట్రంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సమాజాన్ని సమాయత్తం చేయడానికి బాల్ రక్షా భారత్, సేల్స్ ఫోర్స్ ఫౌండేషన్, యూనిసెఫ్ సంయుక్తంగా రాష్ట్ర స్థాయి వర్కుషాప్ హైదరాబాద్ రాయల్ రేవ్ హోటల్ లో ప్రాంగణంలో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సామజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు , ప్రభుత్వ అధికారులు, ఎస్.డి.ఆర్.ఎఫ్ వంటి శాఖాధికారులు కూడా కార్యక్రమానికి విచ్చేసి వారి సలహాలను, సూచనలను అందించారు. రాష్ట్రంలో లేదా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు , రాబోవు కాలంలో ఎదుర్కోబోతున్న వేసవి కలపు వేడి గాలులు, రోడ్డు భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరదలు, ఉప్పెనలు, భూకంపాలు, ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితులు, ప్రత్యేకించి పిల్లల భద్రత ఇంటినుండి పాఠశాలకు పాఠశాల నుండి ఇంటికి అనే దృక్కోణంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు , యువత, సమాజం, స్థానిక సంస్తలు, రాష్ట్ర పరిపాలనా విభాగాలు ఉమ్మడిగా చేపట్టాల్సిన తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలు, చర్యలపై ఈ వర్కుషాప్ లో సుదీర్ఘముగా చర్చించారు. ఈ సందర్భంగా బాల్ రక్షా భారత్ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో రూపొందించిన పాఠశాల భద్రతా కరికులం, సాధించిన ప్రగతిని ఒక ఉదాహరణగా ప్రదర్శించగా , యూనిసెఫ్ మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విపత్తుల నిర్వహణలో చేపట్టిన ఊహలను వివరిస్తూ కొన్ని కీలకం సలహాలతో ఒక మార్గదర్శకాన్ని రచించడానికి నాంది పలికారు. ఈ కార్యక్రమానికి అచ్చలేందర్ రెడ్డి, ఐ.ఎఫ్.ఎస్ పూర్వ ప్రిన్సిపాల్ కన్సర్వేటివ్ అఫ్ ఫారెస్ట్, పూర్వ బయోడైవర్సిటీ చైర్‌పర్సన్, బయోడైవర్సిటీ సలహాదారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## పనులు పక్కాగా జరిపించాలి

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/బోధన్ :** పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు అందుబాటులో ఉండేలా పక్కగా పనులు జరిపించాలని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్‌ను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆయా శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. 2027 జూన్ 26వ తేదీ నుంచి జూలై 07వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని జిల్లాలోని ప్రధానమైన ఈ పుష్కర ఘాట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి, చేపట్టాల్సిన పనుల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

### దేశవ్యాప్తంగా రుతుక్రమ సెలవు పాలసీ అమలు పిటిషన్

## సుప్రీం' తిరస్కరణపై భిన్నాభిప్రాయాలు

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా రుతుక్రమ సెలవు విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడంతో న్యాయవాదులు, హక్కుల కార్యకర్తల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. కొందరు స్వచ్ఛంద నిబంధనలకు మద్దతు ఇస్తుండగా, మరికొందరు మహిళల ఆరోగ్యం, గౌరవాన్ని కాపాడటానికి బలమైన, చట్టపరమైన రక్షణలను నొక్కిచెప్పారు. ప్రజా ప్రయోజనాల వ్యా జ్యాన్ని (పిల్) శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. నెలసరి సెలవులను తప్పనిసరి చేస్తే దీర్ఘకాలంలో ఏ ఒక్కరికీ ఉద్యోగాలు ఇవ్వడానికి యాజమాన్యాలు ఇష్టపడవని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. సీనియర్ న్యాయవాది కరుణ నండి 'పిటిఐ'తో మాట్లాడుతూ ఒక జీతంతో కూడిన రుతు సెలవు వంటి పరిమిత నిబంధన ఒక ఆచరణాత్మక ప్రారంభ స్థానం కావచ్చని అన్నారు. 'సాధారణ నొప్పులు మొదలు ఎండోమెట్రియోసిస్ వరకూ మహిళలు చదువుకుంటున్నారా ? లేదా పనిచేస్తున్నారా ? అనే తేడా లేకుండా రుతు నొప్పిని ఎదుర్కొంటున్నారు కాబట్టి విధానాలు స్త్రీ ఆరోగ్య సవాళ్లను, మారుతున్న సందర్భాన్ని పరిష్కరించాలి' అని కరుణ నండి అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. రుతు సెలవులు మహిళ ల ఉద్యోగావకాశాలను తగ్గిస్తాయని వస్తున్న ఆందోళనలను హక్కుల కార్యకర్త యోగితా భయానా విమర్శించారు. వాళ్లు అలా ఆలోచించడం చాలా తెలివితక్కువతనమన్నారు. మహిళలు ఎల్లప్పుడూ గర్భం, పిల్లల సంరక్షణ వంటి జీవసంబంధమైన వాస్తవాలతో వ్యవహరిస్తారు. దాని కారణంగా మీరు అవకాశాలను నిరాకరిస్తే, వారి ఉద్యోగాలకు ఆటంకం కలిగించవద్దని మీరు కార్పొరేట్‌లకు మార్గనిర్దేశం చేయాలి లేదా ఆదేశించాలి అని భయానా 'పిటిఐ'కి తెలిపారు. చాలామంది మహిళలు బహిష్టు సమయాలలో తీవ్రమైన నొప్పిని ఎదుర్కొంటున్నారని, వారికి సెలవు తీసుకునే అధికారాన్ని తప్పక కల్పించాలని కోరారు.తీవ్రమైన నొప్పితో బాధపడే, పనిమీద దృష్టిపెట్టలేని మహిళలకు స్వచ్ఛంద సెలవు ఎంపికను ఖచ్చితంగా ఇవ్వాలి అని ఆమె చెప్పారు. ఈ సమస్య ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వస్తుందని హక్కుల కార్యకర్త రంజనా కుమారి అన్నారు. సుప్రీంకోర్టు ఆందోళనలకు న్యాయవాది సునితా శర్మ మద్దతు ఇస్తూ తప్పనిసరి సెలవులు మహిళల ఉగ్యోగావకాశాలను తప్పక దెబ్బతీస్తాయన్నారు. ఈ సమస్యకు అనేక సామాజిక, ఆర్థిక కోణాలు ఉన్నాయని యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ న్యాయశాస్త్ర ప్రొఫెసర్ సీమా సింగ్ అన్నారు. సుప్రీంకోర్టు దీనిని తప్పనిసరి చేస్తే మహిళలను నియమించుకోకపోవడం వల్ల వారి ఉత్పాదకత దెబ్బతింటుందని యజమానుల భావించినట్లయితే అప్పుడు ఎవరు నష్టపోతారు? అని ఆమె ప్రశ్నించారు.చట్టపరమైన నిబంధనలు అమలు చేసే ముందు సమాజం సున్నితత్వాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని సీమా సింగ్ చెప్పారు.

## నేపాల్‌లో రోడ్డు ప్రమాదం

### ఏడుగురు భారత యాత్రికులు దుర్మరణం



**కాఠ్మండు:** నేపాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు భారతీయ యాత్రికులు దుర్మరణం చెందారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఐదుగురు పురుషులు ఉన్నారు. యాత్రికులు అందరూ మనకమన లోని ఒక ఆలయానికి వెళ్ళి ఒక మైక్రో బస్సులో వీరంతా తిరిగి వస్తుండగా బస్సు ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 16 మంది ఉన్నారు. గూర్ఖాజిల్లా సాహిద్ లఖన్ మున్సిపాలిటీ–3 ప్రాంతంలోని కాంతర్ వద్ద మైక్రో బస్సు రోడ్డు పక్కన 150 మీటర్ల లోతులో ఉన్న ప్రదేశంలో పడిపోయిందని జిల్లా ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారి సూరజ్ ఆర్యల్ చెప్పారు. గాయపడినవారిని రక్షించి అన్బుఖైరేనీలోని ఆసుపత్రిలో చేర్చారు. వారంతా చికిత్స పొందుతున్నారు. ప్రమాదం సంభవించడానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. ఈ భారతీయులు ఏ ప్రాంతానికి చెందినవారు? అనే వివరాలు తెలియాల్సి ఉంది.

# 29 రాష్ట్రాలలో ఎల్‌పిజి విక్రయాలు ప్రారంభం

### కొరతలేదు, భారీగా నిల్వలున్నాయి : కేంద్ర అధికారి

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో కమర్షియల్ వంటగ్యాస్ సిలెండర్ల పంపిణీ ప్రారంభమైంది. ఒకవైపు అధికారులు దేశవ్యాప్తంగా వంటగ్యాస్ అక్రమ నిల్వలు చేసినవారిపై దాడులు కొనసాగిస్తుండగా మరోవైపు ఈ కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. అధికారులు దేశంలోని అనేక ప్రాంతాలలో ఆకస్మిక దాడులు చేస్తున్నారు. భారీగా చేసిన అక్రమ నిల్వలను కనిపెట్టి వెలికితీస్తున్నారు. వంటగ్యాస్ కోసం దేశమంతటా తీవ్ర కల్లోలం చెలరేగుతున్న పరిస్థితుల్లో ఏకకాలంలో ఈ రెండు చర్యలూ కొనసాగుతున్నాయని కేంద్ర చమురు,సహజవనరుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శనివారంప్రపం ఢిల్లీలో చెప్పారు. గ్యాస్ బుకింగ్ విషయంలో భయాందోళన కొనసాగుతోందని ఐనప్పటికీ దేశంలో ఎలాంటి కొరతా దేదన్నదే ముఖ్యమైన వాస్తవమని చెప్పారు.కావల్సినన్ని నిల్వలు కేంద్రం వద్ద ఉన్నాయన్నారు. దేశంలో కావాల్సినన్ని ముడి చమురునిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దేశీయ రిఫైనరీలు పూర్తి శక్తిసామర్థ్యాలతో ఉన్నాయని, పెట్రోలు, డీజిలు దేశమంతటా సరిపడినంత ఉందని ఆమె చెప్పారు. ''నిల్వలు ఐపోయాయనే భయం లేదు, బోళ్ళన్ని నిల్వలు ఉన్నాయి, ఏ రిటైల్ కేంద్రం వద్దనైనా సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి, మన రిఫైనరీలు కూడా పూర్తి శక్తిసామర్థ్యాలతో పనిచేస్తున్నాయి, కావాల్సినంత పెట్రోలు, డీజిలు అందుబాటులో ఉంది, మన అవసరాలుకు సరిపోతుంది, భయం వద్దు, ఆందో ళన చెందాల్సిన అవసరం లేదు, దిగుమతులు చేసుకోవాల్సిన అవసరం లేకుండానే మనకు అందుబాటులో నిల్వలు ఉన్నాయి'' అని చెప్పారు. వంటగ్యాస్ సరఫరాకే ప్రధమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

**17న భారత్‌కు రెండు చమురు నౌకలు**



ప్రపంచవ్యాప్తంగా చమురుకోసం ఎన్ని దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ భారత్‌కు ఢోకాలేదు. ఎందుకంటే ఇరాన్ కూడా భారత్ పట్ల సానుకూల దృష్టితో ఉంది. భారత్ నౌకలకు అనుమతి ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఉంది. శివాలిక్, నందాదేవి అనే రెండు చమురు నౌకలు పూర్తిగా ఎల్‌పిజి లోడుతో ఈనెల 17వ తేదీ నాటికి భారత్ తీరానికి చేరుకునే అవకాశాలు ఉన్నాయిన అధికారులు శుభవార్త చెప్పారు. ఈ నౌకలలో 92 వేల టన్నుల ఎల్‌పిజి ఉన్నట్లు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా చెప్పారు.

భారతదేశం దాదాపు 88 శాతం ముడి చమురును దిగుమతులు చేసుకుంటున్నది. 50 శాతం సహజవాయువు, 60 శాతం ఎల్‌పిజి మనకు డిమాండ్ ఉంది. అమెరికా,ఇజ్రాయెల్ దేశాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడి చేయడానికి ముందు, ఆ తర్వాత గల్ఫ్ పొరుగుదేశాలపై ఇరాన్ దాడులు చేశాక సగానికి సగం ముడి చమురు భారత్‌కు ముడి చమురు నుండే రావాల్సి ఉంది. 30 శాతం గ్యాస్ ఈ ప్రాంతం నుడే రావాలి. 90 శాతం ఎల్‌పిజి కూడా అక్కడ నుండే ప్రపంచానికి రావాలి. హోర్ముజ్ జల సంధి వద్ద వందల నౌకలు కదలకుండా ఆగిపోయాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ సైనికులు ఇరాన్‌కు చెందినవారు, వారంతా ఈ జల సంధి మీదుగా వాణిజ్య నౌకలు వెళ్ళకుండా అడ్డుకున్నారు. యుద్ధం పూర్తయ్యేవరకూ నౌకలు వెళ్ళడానికి వీల్లేదని ఆంక్షలు విధించారు. దీంతో ఈ సన్నిని మార్గం ద్వారా ప్రపంచ దేశాలకు ముడిచమురు, ఎల్‌పిజి సరఫరాలు నిలిచిపోయాయి. కానీ మనదేశం ఇతర దేశాల నుండి ఎలాగో అలా3 ముడి చమురు తెచ్చుకుంటోంది. కానీ ఇప్పుడు రష్యా నుండి కూడా మనకు సరఫరాలు రావడంలేదు. పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకరంగా ఉంది. కానీ మనదేశంలో వంటింటికి మాత్రం ఈ సమస్య లేదు. దేశీయ వంటింటి అవసరాలకు సరపడ గ్యాస్ సరఫరా చేసేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లూ చేసిందని సుజాతా శర్మ చెప్పారు.
యుద్ధం మొదలు కాకముందు దేశంలో ప్రతిరోజూ 50 లేదా 55 లక్షల మంది మాత్రమే వంట గ్యాస్ బుక్ చేసుకునేవారని చెప్పారు. కానీ అప్పుడూ ఇప్పుడూ సిలిండరు డెలివరీల సంఖ్య మాత్రం పెరగలేదని చెప్పారు. బుకింగ్‌లపై ఆంక్షలు వర్తిస్తాయని, 25 రోజులు గడువు ఉంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు ఈ సరఫరా వ్యవస్థలను చాలా జాగ్రత్తగా గమనిస్తాయన్నారు. వంట అవసరాలకోసం పిఎన్‌జి, సిఎన్‌జి వాహనాల కేటాయింపులు 100 శాతం కొనసాగుతాయన్నారు.

## పాక్ డ్రోన్ కోసం గాలింపు



**జమ్ము:** పాకిస్థాన్ డ్రోన్ అంతర్జాతీయ సరిహద్దును దాటి భారత భూభాగంలోకి ప్రవేశించింది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్ సాంబా జిల్లాలోని అనేక సరిహద్దు గ్రామాల్లో భద్రతా దళాలు భారీగా గాలింపు చర్యలు ప్రారంభించాయని అధికారులు తెలిపారు. రాంఘర్ సెక్టార్‌లోని కాంగ్రాల్, అబ్తాల్, బహదూర్‌పూర్ గ్రామాలపై శుక్రవారం రాత్రి కొన్ని నిమిషాల పాటు శత్రు దేశపు డ్రోన్ కదలికను గమనించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాన్ని కఠినమైన నిఘాలో ఉంచామని, సరిహద్దు అవతల నుండి ఆయుధాలు లేదా మాదకద్రవ్యాలు గాలిలో పడకుండా చూసుకోవడానికి తెల్లవారుజామున భారీ శోధన ఆపరేషన్ ప్రారంభించామని వారు తెలిపారు. గత రెండు రోజుల్లో ఇక్కడికి సమీపంలో ఉన్న ఆర్‌ఎస్ పురా సెక్టార్‌లోని సరిహద్దు గ్రామాలలో డ్రోన్‌ల ద్వారా సరుకులను జారవిడిచిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో రూ.20 కోట్లకు పైగా విలువైన 3.5 కిలోల హెరాయిన్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆర్‌ఎస్ పురా సెక్టార్‌లో తాజాగా స్వాధీనం చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానిత మాదకద్రవ్య స్మగ్లర్లను విచారణ కోసం శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.

### సురక్షితంగా మరో రెండు భారతీయ నౌకలూ

## హోర్ముజ్ జలసంధిని దాటేశాయ్



**న్యూఢిల్లీ :** గల్ఫ్ దేశాల నుంచి ఎల్‌పిజిని తీసుకెళుతున్న రెండు భారతీయ నౌకలు శనివారం తెల్లవారుజామున హోర్ముజ్ జలసంధిని దాటాయి. దీంతో యుద్ధంలో దెబ్బతిన్న ఇరుకైన షిప్పింగ్ లైన్ ద్వారా సురక్షితంగా ప్రయాణించిన భారతీయ నౌకల సంఖ్య మూడుకు చేరింది. భారత ప్రభుత్వం ఈ ప్రాంతంలోని ప్రభుత్వాలతో కలిసి వాటి సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి ప్రయత్నిస్తున్నందున జలసంధికి పశ్చిమవైపున ఉన్న మిగిలిన 22 నౌకలు సిద్ధంగా ఉన్నాయి. ఎల్‌పిజి క్యారియర్లు శివాలిక్, నందా ఇప్పుడు ముంద్రా, కాండ్లా ఓడరేవులకు వెళుతున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా మీడియా సమావేశంలో తెలిపారు. ఈ నౌకలు 92,700టన్నుల ఎల్‌పిజిని తీసుకెళుతున్నాయని శివాలిక్ మార్చి 16న ముంద్రాకు చేరుకునే అవకాశం ఉందని, నందాదేవి మరుసటి రోజైన మార్చి 17న కాండ్లా డాక్ వద్దకు చేరుకోవచ్చని తెలిపారు. భారత దౌత్యానికి ఒక సురక్షితమైన మార్గం ఒక ముఖ్యమైన మైలురాయిగా ఉండటమే కాకుండా షిప్పింగ్ పరిమితులు వంట గ్యాస్ సరఫరాలపై ప్రభావం చూపిన నేపథ్యంలో వారు తీసుకువెళుతున్న సరుకు కీలకమైనదిగా పరిగణించబడుతోంది. భారతదేశం తన ఎల్‌పిజి అవసరాలలో 60శాతం దిగుమతి చేసుకుంటోంది. 85 నుంచి 90శాతం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) వంటి గల్ఫ్ దేశాల నుంచి సరఫరా అవుతోంది. వారు హోర్ముజ్ జలసంధిని వినియోగదారులకు చమురు, గ్యాస్ రవాణా చేయడానికి రవాణాగా ఉపయోగిస్తున్నారు. మార్చి మొదటి వారం నుండి జలసంధి సమర్థవంతంగా మూసివేయబడింది. ఈ ప్రాంతంలో యుద్ధం మొదలైనప్పటి నుంచి జలసంధికి పశ్చిమాన చిక్కుకుపోయిన 24 నౌకల్లో ఈ రెండు నౌకలు ఉన్నాయి. ఇదిలాఉంటే మరో నలుగురు తూర్పు వైపున చిక్కుకుపోయారు. వాటిలో ఒకటి, భారతదేశం జెండాతో ఉన్న చమురు ట్యాంకర్ జగ్ ప్రకాష్, ఒమన్ నుంచి ఆఫ్రికాకు గ్యాసోలిన్ తీసుకువెళుతూ శుక్రవారం యుద్ధ ప్రభావిత జలసంధిని దాటింది. పశ్చిమ వైపున ఉన్న మిగిలిన 22 భారత జెండాతో కూడిన నౌకల్లో ఆరు ఎల్‌పిజి నౌకలు, ఒకటి ద్రవీకృత సహజవాయువు (ఎల్‌పిజి), నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒకటి రసాయన ఉత్పత్తులను తీసుకువెళుతోంది. మూడు కంటైనర్ నౌకలు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయని సిన్హా చెప్పారు. మిగిలిన వాటిల్లో ఒకటి డ్రెడ్జర్, మరొకటి ఖాళీది ఉన్నాయన్నారు. మరో మూడు డ్రై డాకుల్లో ఉన్నాయి. అమెరికాఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న ఇరుకైన సముద్ర తీరంలో వందలాది నౌకలు చిక్కుకుపోయాయి. మొత్తం 28 భారత జెండా నౌకలు చిక్కుకుపోయాయని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌బీర్ జైస్వాల్ విలేకరులకు వెల్లడించారు. మిగిలిన 22 నౌకల్లో (పశ్చిమ వైపు) 611మంది నావికులు ఉన్నారు అని ఆయన తెలిపారు. షిప్పింగ్ డిజి సహా భారత అధికారులు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరు నౌకలు ఇండియా ఓడరేవులకు చేరుకున్నాయని, వాటిని సురక్షితంగా లంగరు వేయగలిగామని ఆయన వివరించారు.పర్షియన్ గల్ఫ్‌లోని సముద్ర పరిస్థితిని ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు రణ్‌బీర్ జైస్వాల్ తెలిపారు.

### స్వప్రయోజనాల కోసం వ్యవసాయాన్ని

## త్యాగం చేసేందుకు సిద్ధమైన బిజెపి

### లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, తన సొంత ప్రయోజనాల కోసం భారతదేశ వ్యవసాయాన్ని త్యాగం చేయడానికి సిద్ధంగా ఉందని ఆరోపించారు. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రస్తుత ఎంఎస్‌పి విధానాన్ని మారుస్తుందా అనే దానిపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఇటీవల సభలో అడిగిన ప్రశ్నను ఫేస్‌బుక్ పోస్ట్‌లో పంచుకున్నారు. 'లోక్‌సభలో, నేను ప్రభుత్వానికి ఒక ప్రత్యక్ష ప్రశ్న అడిగాను: 2021లో రైతులకు సి2+50 శాతంతో లెక్కించిన చట్టబద్ధమైన ఎంఎస్‌పి వాగ్దానం ఇంకా ఎందుకు అమలు కాలేదు? 'ప్రత్యక్ష ప్రతిస్పందనను తప్పించుకుంటూ, ప్రభుత్వం తన ప్రస్తుత ఎంఎస్‌పి విధానాన్ని పునరుద్ఘాటించింది. 'జాతీయ ప్రాధాన్యతల పేరుతో, ఎటువంటి తార్కిక ఆధారం లేకుండా, ఎంఎస్‌పి బోనస్‌లను నిలిపివేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చినట్లు ప్రభుత్వం అంగీకరించింది' అని రాహుల్ గాంధీ హిందీలో తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వాణిజ్యేతర అడ్డంకులను తగ్గించడం గురించి మాట్లాడుతుందా అనేది మరొక క్లిష్టమైన ప్రశ్న అని ఆయన అన్నారు. 'ఇది ఎంఎస్‌పి యంత్రాంగం, ప్రభుత్వ సేకరణను అణగదొక్కే ఉద్దేశ్యాన్ని సూచిస్తుందా?' అని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ ప్రశ్న నుండి కూడా తప్పించుకుంటోందని ఆయన పేర్కొన్నారు. 'మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలను గౌరవించడానికి నిరాకరించడమే కాకుండా, తన సొంత ప్రయోజనాల కోసం భారత వ్యవసాయాన్ని త్యాగం చేయడానికి కూడా సిద్ధంగా ఉంది అని రాహుల్ తన పోస్ట్‌లో ఆరోపించారు. రైతుల హక్కులను, ఎంఎస్‌పిని కాపాడుకోవడానికి తాము పార్లమెంటు లోపల, వెలుపల తమ గొంతులను లేవనెత్తుతూనే ఉంటామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

### కాన్షీరామ్‌కు భారతరత్న ప్రతిపాదన..

## కాంగ్రెస్‌కు మాయవతి ప్రశ్నలు



**లక్నో :** కేంద్రంలో అధికారంలోకి వస్తే బిఎస్‌పి వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలనే ప్రతిపాదనపై బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలు బిఎస్‌పిని బలహీనపరిచేందుకు ఇతర రాజకీయ పార్టీలు, ముఖ్యంగా కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ మేరకు ఆమె శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. కేంద్రంలో అనేక సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ఎప్పుడూ బిఆర్ అంబేద్కర్‌కు తగిన గౌరవం ఇవ్వలేదని, ఆదివారం కాన్షీరామ్ జయంతిని జరుపుకోవాలని పార్టీ ఇప్పుడు ఎలా ప్రతిపాదించగలదో తెలుసుకోవాలని ఆమె అన్నారు. దళితుల దూత, రాజ్యాంగ ప్రధాన నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్‌కు కాంగ్రెస్ ఎప్పుడూ తగిన గౌరవం ఇవ్వలేదని, ఆయనకు భారతరత్న బిరుదును ఎప్పుడూ ఇవ్వలేదన్నారు. అదే పార్టీ ఇప్పుడు కాన్షీరామ్‌ను ఎలా గౌరవించగలదని ప్రశ్నించారు. లక్నోలో కాంగ్రెస్ నిర్వహించిన 'సంవిధాన్ సమ్మేళన్'లో కాన్షీరాంకు పార్టీ అధికారంలోకి వస్తే భారతరత్నను ప్రదానం చేస్తుందని పేర్కొంటూ ఒక ప్రతిపాదన ఆమోదించబడిన మరుసటి రోజున ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు, కాన్షీరాం మృతికి ఒక్క రోజు కూడా జాతీయ సంతాప దినం ప్రకటించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. అదేవిధంగా, ఉత్తరప్రదేశ్‌లో అప్పటి అధికారంలో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వం కూడా రాష్ట్ర సంతాప దినాన్ని ప్రకటించలేదు' అని ఆమె అన్నారు. దళిత సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకునే అనేక సంస్థలు, రాజకీయ పార్టీలు తరచుగా పెద్ద రాజకీయ పార్టీల చేతుల్లో పావులుగా పనిచేస్తూ కాన్షీరాం పేరును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడంలో నిరంతరం నిమగ్నమై ఉన్నాయని, అదే సమయంలో బిఎస్‌పిని బలహీనపరచడానికి ప్రయత్నిస్తున్నాయని ఆమె మండిపడ్డారు. ప్రస్తుతం, ఈ పార్టీలన్నీ బిఎస్‌పిని అణగదొక్కడానికి, బలహీనపరచడానికి వివిధ వ్యూహాలను ఉపయోగిస్తున్నాయన్నారు. అందువల్ల, అతని (కాన్షీరామ్) అనుచరులు, మద్దతుదారులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా కాంగ్రెస్ పట్ల, దాని దళిత వ్యతిరేక భావజాలం, మనస్తత్వం బిఎస్‌పిని ఏర్పాటు చేయాల్సిన అవసరం కలిగించిందని చెప్పారు. మార్చి 15న కాన్షీరామ్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని బిఎస్‌పి అధినేత పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ జీవించి ఉంటే, కాన్షీరామ్‌ను కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రిని చేసి ఉండేవారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. సంవిధన్ సమ్మేళన్‌లో మాట్లాడుతూ మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్, కాన్షీరామ్ తమ సూత్రాలపై ఎప్పుడూ రాజీ పడలేదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

## ఎలక్ట్రిక్ స్టవ్‌లకు మారిన రెస్టారెంట్లకు విద్యుత్ యూనిట్‌కు రూ.2 సబ్సిడీ

### తమిళనాడు ప్రభుత్వం ప్రకటన

### కేంద్రం ప్రకటించిన వాణిజ్య ఎల్‌పిజి వినియోగ పరిమితులు అమలులో ఉన్నంత వరకు వర్తింపు




**చెన్నై :** పశ్చిమాసియాలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ యుద్ధం ఫలితంగా ఇతర దేశాలతోపాటు భారత్‌లో కూడా కమర్షియల్ వంట గ్యాస్ కొరత ఏర్పడింది. దాంతో దేశవ్యాప్తంగా ఇప్పటికే పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లకు బదులుగా ఎలక్ట్రిక్ స్టవ్‌లకు మారే రెస్టారెంట్లు, హోటళ్ళు, టీ దుకాణాలకు విద్యుత్ యూనిట్‌కు రూ.2 సబ్సిడీని తమిళనాడు ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో వివాదం ప్రారంభమైనప్పటి నుండి ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తినుబండారాలకు వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల కొరత ఏర్పడిందని ప్రభుత్వం తెలిపింది. శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో, ఇండక్షన్ స్టవ్‌లను ఉపయోగించే హోటళ్ళు, టీ దుకాణాలు, క్లౌడ కిచెన్‌లు వినియోగించే అదనపు విద్యుత్‌కు యూనిట్‌కు రూ.2 సబ్సిడీని అందించాలని నిర్ణయించారు. కేంద్రం ప్రకటించిన వాణిజ్య ఎల్‌పిజి వినియోగ పరిమితులు అమలులో ఉన్నంత వరకు ఈ సబ్సిడీ అమలులో ఉంటుందని అదనపు ప్రధాన కార్యదర్శి జె. రాధాకృష్ణన్ అన్నారు. సెక్రటేరియట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ హోటళ్ళు, రెస్టారెంట్ల విద్యుత్ వినియోగం పెరిగిందని, ఇటీవలి రోజుల్లో సగటు కంటే దాదాపు 50 మెగావాట్లు ఎక్కువగా డిమాండ్ పెరిగిందని అన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు నుండి అనుమతి పొందిన తర్వాత రాష్ట్రంలో పనిచేస్తున్న 60,698 కర్మాగారాలను ప్రస్తావిస్తూ, తమిళనాడు విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కూడా అయిన రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఈ కర్మాగారాలు కిరోసిన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను ఉపయోగించినందుకు తమ వ్యాపారాన్ని నిర్వహించడానికి కాలుష్య నియంత్రణ బోర్డు నుండి అదనపు ధృవపత్రాలు అవసరం లేదని అన్నారు. 'ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకం గురించి వారు కాలుష్య నియంత్రణ మండలికి తెలియజేయాలి. ప్రభుత్వ ఆంక్షలు ముగిసే వరకు ఈ మినహాయింపు అమలులో ఉంటుంది' అని ఆయన అన్నారు. కేంద్రం ఆసుపత్రులు, విద్యా సంస్థలకు వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాకు ప్రాధాన్యత ఇచ్చిందని ఎత్తి చూపుతూ, వాణిజ్య సంస్థలకు ఎల్‌పిజి సిలిండర్ల క్రమబద్ధమైన కేటాయింపును పర్యవేక్షించడానికి ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల కొరతను ఎంఎస్‌ఎంఇలు తీర్చడంలో సహాయపడటానికి, నిరుద్యోగ యువత ఉపాధి కల్పన కార్యక్రమం కింద ఇండక్షన్ స్టవ్‌లు, హీటర్లు వంటి విద్యుత్ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం రుణాలు ప్రకటించినట్లు ఆయన చెప్పారు. ఈ పథకం కింద, ఎంఎస్‌ఎంఇలకు 25 శాతం సబ్సిడీ (రూ. 3.75 లక్షల వరకు) అందించబడుతుంది. తమిళనాడు మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి పథకం ద్వారా, రూ. 10 లక్షల వరకు తీసుకునే రుణాలపై, రూ. 2 లక్షల పరిమితికి లోబడి 25 శాతం రాయితీని అందిస్తామని ఆయన తెలిపారు.

## ఎన్‌డిఎ కూటమితో పొత్తు ప్రసక్తే లేదు: విజయ్



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ముఖ్యంగా దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగంపైనే అందిరి దృష్టి నెలకొంది. అన్నాడిఎంకె నేతృత్వంలోని ఎన్‌డిఎతో పొత్తు ఉంటుందని వార్తలు వస్తోన్న ఈ క్రమంలో విజయ్ పార్టీ క్లారిటీ ఇచ్చింది. ఎన్‌డిఎ కూటమితో పొత్తుకు ఎటువంటి ఆస్కారం లేదని స్పష్టం చేసింది. ఈ విషయమై జరుగుతున్న చర్చలు కేవలం ఊహాగానాలు మాత్రమే అని కొట్టిపారేసింది. టివికె జిల్లా కార్యదర్శులతో జరిగిన వర్చువల్ సమావేశంలో పార్టీ బలాబలాలు సహా పొత్తులపై చర్చ జరిగిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్ తెలిపారు. ఎన్‌డిఎతో పొత్తుకు అవకాశమే లేదన్న ఆయన సిద్ధాంతాల పరంగా బిజెపి తమకు శత్రువని పేర్కొన్నారు. ఎన్నికల్లో పొత్తు పెట్టుకొని పోటీ చేస్తే విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయని జిల్లా కార్యాదర్శులు, టివికె ప్రధాన కార్యదర్శికి తెలియజేసినట్లు తెలిసింది. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ, పార్టీ సభ్యులు అధికారిక ప్రకటనలనే నమ్మాలని కోరారు. అటు టివికెతో పొత్తు గురించి తమిళనాడు బిజెపి అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్‌ను ప్రశ్నించగా, ఆయన సూటిగా సమాధానం ఇవ్వలేదు. మీరు కూటమి గురించి ఆలోచిస్తున్నారని, తను మాత్రం తమిళనాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే దృష్టి ఉందని చెప్పారు. ముఖ్యంగా చట్టవ్యవస్థ వైఫల్యం, మహిళల భద్రతపై ఆందోళన చెందుతున్నాని అన్నారు. టివికె స్థాపన సమయంలో విజయ్ తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థి డిఎంకె అని, సిద్ధాంతపరమైన ప్రత్యర్థి బిజెపి అని స్పష్టం చేశారు. అయితే ఎన్‌డిఎ కూటమిలో చేరేందుకు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్యవర్తిత్వం చేసినట్లు వచ్చిన వార్తలు వచ్చాయి. దీంతో టివికె–ఎన్‌డిఎ కూటమి అవకాశంపై చర్చలు మళ్లీ తెరపైకి వచ్చాయి. టివికెను ఎన్‌డిఎలో చేర్చేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఆసక్తి చూపుతున్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో పార్టీ క్లారిటీ ఇవ్వడంతో పొత్తుపై స్పష్టత వచ్చింది.

## ఘర్షణ ప్రభావాలని తగ్గించేందుకు కృషి

### సిల్చార్ బహిరంగసభలో ప్రధాని మోదీ వెల్లడి



**సిల్చార్:** ప్రపంచ సంఘర్షణల ప్రభావాలను ప్రజలపై తగ్గించడానికి కేంద్రం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశంలో భయాందోళనలు సృష్టించడానికి ప్రయత్నిస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రూ. 23,550 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించిన తర్వాత అసోంలోని సిల్చార్‌లో జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ దశాబ్దాలుగా ఈశాన్య అభివృద్ధిని విస్మరించిందని, స్వాతంత్ర్య సమయంలో బరాక్ లోయ సముద్రానికి ప్రవేశాన్ని తగ్గించే సరిహద్దును గీయడానికి అనుమతించిందని ఆరోపించారు. 'ప్రపంచం యుద్ధాలను ఎదుర్కొంటున్నందున, దేశ ప్రజలపై వాటి ప్రభావాన్ని తగ్గించడమే మా ప్రయత్నం. కాంగ్రెస్ బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీ పాత్రను పోషించాలి. కానీ అది అలా చేయడంలో విఫలమైంది. ప్రజలలో భయాందోళనలు సృష్టించడానికి ప్రయత్నిస్తోంది' అని ఆయన ఆరోపించారు. వారికి అసోం లేదా దేశం పట్ల ఎటువంటి దృక్పథం లేదన్నారు. గత నెలలో ఢిల్లీలో జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కా లేకుండా నిరసన వ్యక్తం చేయడంపై మోదీ స్పందించారు. ఆ పార్టీ దేశాన్ని కించపరిచిందని ఆరోపించారు. 'ప్రపంచం మొత్తం ఎఐ పట్ల ఆసక్తి కలిగి ఉంది. ఢిల్లీలో జరిగిన విజయవంతమైన సమ్మిట్‌కు ప్రపంచ నాయకులు, టెక్ కంపెనీలు, వారి అధిపతులు హాజరయ్యారు. కానీ, కాంగ్రెస్ 'కప్డా ఫార్' (బట్టలు చింపివేయడం) ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా దేశాన్ని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించింది' అని ఆయన అన్నారు. ఈ అసభ్యకరమైన' నిరసనను దేశం మొత్తం ఖండించిందని, కానీ కాంగ్రెస్ రాజకుటుంబం తమను తాము తడుముకుంటోందన్నారు. 'కాంగ్రెస్ ఒక ఎన్నికల తర్వాత మరొక ఎన్నికలలో ఓడిపోతోంది. సమీప భవిష్యత్తులో, పార్టీ నష్టాల శతాబ్దాన్ని చవిచూస్తుంది. ఈ నిరాశ దేశానికి వ్యతిరేకంగా ఒక ఫ్రంట్ తెరిచేలా చేసింది. అయితే ఆ నాయకులు దేశాన్ని అప్రతిష్ట పాలు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఈశాన్య ప్రాంతాన్ని 'దిల్ (హృదయం),ఢిల్లీ' రెండింటి నుండి కాంగ్రెస్ దూరంగా ఉంచిందని, అభివృద్ధి ఈ ప్రాంత ప్రజలను చేరుకోకుండా, వారు హింస, వెనుకబాటుతనంలో మునిగిపోయారని మోదీ ఆరోపించారు. కాగా, ఈ కార్యక్రమంలో కాచర్ జిల్లాలోని సిల్చార్, మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య రూ. 22,864 కోట్లతో నిర్మించిన యాక్సెస్‌కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే కోసం జరిగిన శంకుస్థాపనలో ప్రధాని పాల్గొన్నారు.

## బిజెపి, టిఎంసి మధ్య ఘర్షణలు



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ర్యాలీ నిర్వహించారు. అయితే ర్యాలీకి అరగంట ముందు, సెంట్రల్ కోల్‌కతాలో టిఎంసి, బిజెపి మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఘర్షణలో ఒక పోలీసు అధికారి గాయపడ్డారని అధికారులు తెలిపారు. గిరీష్ పార్క్ ప్రాంతంలోని పశ్చిమ బెంగాల్ మంత్రి శశి పంజా నివాసంపై బిజెపి కార్యకర్తలు రాళ్లు రువ్వినట్లు ఆ పార్టీ కార్యకర్తలు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిజెపి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'పరివర్తన్ యాత్ర' ముగింపు సందర్భంగా ప్రధానమంత్రి సమావేశంలో పాల్గొనడానికి బిజెపి మద్దతుదారులు బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్ వైపు కవాతు చేస్తుండగా ర్యాలీ వేదిక నుండి 5 కి.మీ దూరంలో హింస జరిగింది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం రెండు పార్టీల మద్దతుదారులు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకుని నినాదాలు చేశారు. ఇది రద్దీగా ఉండే ప్రాంతంలో ఉద్రిక్తతను రేకెత్తించింది. బౌబజార్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి అధికారి బప్పాదిత్య నస్కర్ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నంలో గాయపడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి. బ్రిగేడ్ ర్యాలీకి గిరీష్ పార్క్ ప్రాంతం గుండా బిజెపి మద్దతుదారులు వెళుతుండగా పంజా నివాసంపై మొదట దాడి చేశారని పేర్కొన్నారు. బిజెపి మద్దతుదారులు తన నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని కిటికీ అద్దాలను ధ్వంసం చేశారని పంజా పేర్కొన్నారు. 'బిజెపి గూండాలు దాడి చేశారు. బ్రిగేడ్ ర్యాలీకి వెళ్తున్న బస్సుల్లో ఇటుకలు, గాజు సీసాలు, బాంబులు ఉన్నాయి. వారు గిరీష్ పార్క్ ప్రధాన రహదారిలోని నా ఇంటిపై దాడి చేశారు' అని మంత్రి ఆరోపించారు. 'బిజెపిని బహిష్కరించండి' అని రాసి ఉన్న పోస్టర్లను కాషాయ పార్టీ మద్దతుదారులు చించివేయడంతో సమస్యలు ప్రారంభమయ్యాయని ఆమె పేర్కొన్నారు. పోలీసులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చి, ఘర్షణ పడుతున్న సమూహాలను చెదరగొట్టారు. స్థానికంగా ఉద్రిక్తత పెరగడంతో, చాలా మంది దుకాణదారులు తమ దుకాణాలను స్వచ్ఛంగా మూసివేశారు.

## రష్యా నుండి అయిల్ కొనమని వైట్‌హౌస్ అడుక్కుంటోంది

### ట్రంప్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఇరాన్

**దుబాయ్:** భారత్ సహా ప్రపంచదేశాలన్నీ ఇప్పుడు రష్యా చమురు కొనుగోలు చేసేస్థాయికి తీసుకువచ్చారని ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి అబ్బాస్ ఆరాఘ్చీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను విమర్శించారు. రష్యా చమురు కొనుగోలు చేయడం భారత్ ఆపేసిందని అమెరికా బుకాయిస్తున్నప్పటికీ కూడా మాస్కో నుండి చమురు కొనుగోలు చేసుకోమని భారత్‌ను అమెరికా బ్రతిమిలాడుతోందని ఆయన అన్నారు. రెండు వారాలపాటు యుద్ధం కొనసాగిన తర్వాత ట్రంప్ ఈ విధంగా భారత్‌ను బ్రతిమిలాడుతున్నారన్నారు. ఇరాన్‌తో యుద్ధం మొదలైన తర్వాత ఈ విధంగా కొనుగోళ్ళు చేస్తే ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం కొంతమేరకైనా పరిష్కారం అవుతుందని ట్రంప్ భావిస్తున్నారన్నారు. ఈ మేరకు అబ్బాస్ ఆరాఘ్చీ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. 'రెండువారాలపాటు యుద్ధం జరిగింది, యుద్ధం ఇప్పుడు మూడోవారంలోకి ప్రవేశించింది, వైట్‌హౌస్ ఇప్పుడు అన్ని దేశాలూ అనివార్యంగా రష్యా నుండి చమురు కొనుగోలుచేసే స్థాయికి తీసుకువచ్చింది, రష్యా నుండి చమురు కొనుగోలు చేసుకోమని వైట్‌హౌస్ ఇప్పుడు ప్రపంచ దేశాలను అడుక్కుంటోంది, భారత్‌తో సహా అన్ని దేశాలను ఇప్పుడు వైట్‌హౌస్ అడుక్కుంటోంది'' అని విమర్శించారు. రష్యా నుండి చమురు కొనుగోళ్ళు ఆపేయమని అనేక నెలలపాటు అమెరికా ఒత్తిడి చేసిందని, దానికోసం ఎదురుచూసిందని, రష్యా నుండి భారత్ కొనుగోలు చేయడం లేదని అమెరికా బొంకులు పలికిందని అన్నారు. ఇప్పుడు యుద్ధం మొదలైన రెండు వారాల తర్వాత రష్యా నుండి చమురు కొనుగోలు చేయమని అన్ని దేశాలనూ అడుక్కుంటోందన్నారు. పశ్చిమాసియాలో యుద్ధంపై యూరప్ వైఖరి గురించి ఆయన మాట్లాడుతూ, ఇరాన్‌లో అమెరికా అధర్మయుద్ధం చేస్తోందని అన్నారు. ఈ అక్రమ యుద్ధానికి యూరప్ మద్దతు ఇచ్చినప్పటికీ, రష్యాకు వ్యతిరేకంగా ఇరాన్ తన మద్దతును కూడగట్టడంలో అమెరికాపై విజయం సాధిస్తుందన్నారు.గత నెలలో ఢిల్లీలో జరిగిన రష్యా చమురు కొనుగోలు చేయమని అడుగుతున్న వైట్‌హౌస్ వైఖరి ఎంతో హృదయవిదారకమైన విషమని అన్నారు. ఫిబ్రవరి 28న దాడుల గురించి మాట్లాడుతూ,కొత్త అణు ఒప్పందానికి ఒప్పుకోవాలని అనేక నెలలపాటు ఇరాన్‌పై ఒత్తిడి చేసిన తర్వాత ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా ఈ దాడులు చేసిందన్నారు. ఇరాన్ ప్రతిఘటించడంవల్ల యుద్ధం యావత్ గల్ఫ్ దేశాలకూ వ్యాపించిందని అబ్బాస్ అరాఘ్చీ చెప్పారు.

## రక్తదానం సామాజిక బాధ్యత

### ఇరిసెట్ డిజి శరద్ కుమార్ శ్రీవాస్తవ



**ప్రజాపక్షం / హైదరాబాద్:** రక్తదానం సామాజిక బాధ్యత అని ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్, టెలీకమ్యూనికేషన్స్ (ఇరిసెట్) డైరెక్టర్ జనరల్ శరద్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. తార్నాకలోని ఇరిసెట్‌లో శనివారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా బాధితులకు సహాయం అందుతుందన్నారు. స్వచ్ఛంద సేవా భావంతో రక్తదానం చేసిన వారిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఒక యూనిట్ రక్తం అనేక మంది ప్రాణాలను రక్షించగలదని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సంస్థ యొక్క సాంకేతిక ప్రగతితో పాటు మానవతా విలువలను ప్రతిబింబిస్తాయని తెలిపారు.ఈ రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, దక్షిణ మధ్య రైల్వే ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో వైద్య పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ శిబిరంలో సంస్థకు చెందిన అధికారులు, శిక్షణార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 60 మంది పాల్గొన్నారు. రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు.




# పాప్‌కార్న్

## అభిమాని సృష్టించిన గందరగోళం



జర్మనీలో జరిగిన ఒక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో విచిత్రమైన సంఘటన చోటుచేసుకుంది. జర్మన్ సాకర్ రెండో డివిజన్ లీగ్‌లో ఆడుతున్న ప్రెస్సెన్ మన్‌స్టర్, హెర్తా బెర్లిన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఓ వీరాభిమాని చేసిన పని గందరగోళానికి దారితీసింది. వివరాల్లోకి వెళితే, మ్యాచ్ ప్రథమార్థంలో ఒక ఫౌల్ జరిగినప్పుడు రిఫరీ ఆ సంఘటనను వీడియో అసిస్టెంట్ రిఫరీ (వీఏఆర్) మానిటర్‌లో చూసి నిర్ణయం తీసుకోవాలని అనుకున్నాడు. కానీ, ఆ మానిటర్ పనిచేయకపోవడంతో, సాంకేతిక సిబ్బందిని పిలిపించారు. మానిటర్ ప్లగ్‌ను తీసివేయడంతో అది పనిచేయలేదని నిర్ధారించారు. దీనితో ఆ పనికి పాల్పడింది ఎవరనే ప్రశ్న తలెత్తింది. సిసి కెమెరాలను పరిశీలించిన అనంతరం, ముసుగు వేసుకున్న ఓ సాకర్ అభిమాని మైదానంలోకి ప్రవేశించి, వివిఆర్ సాంకేతిక పరికరాల విద్యుత్ కనెక్షన్‌ను తొలగించినట్లు స్పష్టమైంది. ఈ చర్య కారణంగా మైదానంలో కొద్దిసేపు ఆటకు అంతరాయం కలిగింది. వివిఆర్ గదిలో ఉన్న వీడియో రిఫరీ కార్డిన్ ఫోలోమ్స్ కొలోన్ నగరంలోని మానిటరింగ్ సెంటర్ నుంచి వీడియో క్లిప్పింగ్‌ను పరిశీలించి నిర్ణయం ప్రకటించింది. ఆమె నిర్ణయం ప్రకారం హెర్తా బెర్లిన్‌కు పెనాల్టీ లభించింది. ఆ జట్టు ఆ అవకాశాన్ని గోల్‌గా మార్చింది. మ్యాచ్ చివరలో మరో గోల్ చేసి 2–1 తేడాతో విజయం సాధించింది. కాగా, వివిఆర్ వ్యవస్థను మొదటిగా పెద్ద లీగ్‌లలో ప్రవేశపెట్టినప్పుడు అది న్యాయమైన నిర్ణయాలకు సహాయపడుతుందని భావించారు. కానీ కాలక్రమేణా నిర్ణయాలు ఆలస్యం అవుతాయనే విమర్శలు, అది ఆటల ఉత్సాహాన్ని తగ్గిస్తుందనే అభిప్రాయాలు పెరిగాయి. తాజా ఘటన మరోసారి చర్చకు కారణమైంది.

## తుఫాన్లకు కొత్త పేర్లు..



బ్రిటన్‌లో తుఫాన్లకు పేర్లు పెట్టే ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం ఆసక్తికరమైన చర్చకు దారితీస్తున్నది. ఇటీవల ప్రజలు సూచించిన తుఫాన్ పేర్లలో 'ఎలాన్ గస్ట్', డేమ్ జూడిడెంచ్ వంటి వినోదాత్మక పేర్లు ఉన్నాయి. ఈ పేర్లు ఎలాన్ మస్క్, జూడీ డెంచ్ పేర్లను సూచించేవిగా ఉన్నాయని స్పష్టమవుతున్నది. బ్రిటన్ వాతావరణ సంస్థ 'మెట్ ఆఫీస్' 2015 నుంచి ప్రజలకు తుఫాన్లకు పేర్లు సూచించే అవకాశం కల్పించింది. ప్రతి సంవత్సరం వేలాదిమంది ప్రజలు తమ సూచనలను పంపుతారు. అయితే, అందులో కేవలం సుమారు 20 పేర్లను మాత్రమే అధికారిక జాబితాలోకి తీసుకుంటారు. కాగా, ప్రజలు పంపిన సూచనల్లో చాలా వినోదాత్మకమైన పేర్లు కూడా ఉన్నాయి. ఉదాహరణకు స్టార్మీ మెక్‌స్టార్మ్‌ఫేస్, కేర్ స్టార్మర్, డేవిడ్ బ్లోవీ, స్టార్మ్ ప్రిన్స్ ఆండ్రూ, బ్రూస్ స్ప్రింగ్ స్టార్మ్, ఫ్లఫీ షీప్ ఆఫ్ రైన్, స్టార్మ్ జీ వంటి పేర్లు కూడా ప్రతిపాదిత జాబితాలో ఉన్నాయి. అయితే ఈ పేర్లు అధికారికంగా ఉపయోగించరు. ఎందుకంటే ప్రజలకు ప్రమాద హెచ్చరికలను స్పష్టంగా తెలియజేయడమే తుఫాన్లకు పేర్లు పెట్టడం వెనుక ప్రధాన ఉద్దేశం. కాబట్టి సరదాగా ఉండే పేర్లు ఉపయోగిస్తే ప్రమాద తీవ్రతను ప్రజలు తక్కువగా భావించే అవకాశం ఉందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. సమాచార హక్కు చట్టం (ఎఫ్ఓఐ) ద్వారా పొందిన వివరాల ప్రకారం 2025–26 సీజన్ కోసం 50,000 కంటే ఎక్కువ పేర్లు ప్రజలు సూచించారు. చివరకు ఎంపికైన అధికారిక పేర్ల జాబితాలో అమీ, బ్రామ్, చంద్ర, డేవ్, ఎడ్డీ, ఫినో న్యుయేలా, గెరార్డ్, హన్నా, ఇస్లా, జన్నా, కాసియా, లిలిత్, మార్టీ, నికో, ఆస్కార్, పాట్రిక్, రూబీ, స్టీవీ, థగ్, వైలెట్, ఉబ్బా ఉన్నాయి. ఈ జాబితాను యునైటెడ్ కింగ్‌డమ్‌తోపాటు, ఐర్లాండ్, నెదర్లాండ్స్ దేశాల వాతావరణ సంస్థలు కలిసి నిర్ణయిస్తాయి. సాధారణంగా ఒక తుఫాను మధ్యస్థ (అంబర్ అలర్ట్) లేదా తీవ్రమైన (రెడ్ అలర్ట్) ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే దానికి అధికారిక పేరు ఇస్తారు. ఈ విధానం ప్రజలకు హెచ్చరికలను స్పష్టంగా తెలియజేయడంలో సహాయపడుతుంది.

## మేఘాలను 'లైట్' తీసుకోవద్దు!



ఆకాశంలో కనిపించే మేఘాలు చాలా తేలికగా, గాలిలా తేలుతూ ఉన్నట్లు మనకు అనిపిస్తాయి. కానీ వాస్తవానికి ఒక మేఘం బరువు చాలా ఎక్కువగా ఉంటుంది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం ఒక సాధారణ మేఘం బరువు సుమారు ఒక మిలియన్ టన్నులు (10 లక్షల టన్నులు) వరకు ఉండవచ్చు. ఇది విన్నప్పుడు చాలా ఆశ్చర్యకరంగా అనిపిస్తుంది. అంతటి బరువు ఉన్నదే అయితే అది ఎలా గాల్లో తేలుతూ ఉంటుంది అనే ప్రశ్న సహజంగా వస్తుంది. మేఘం అంటే వాస్తవానికి నీటి ఆవిరి చల్లబడుతూ చిన్న చిన్న నీటి బిందువులు లేదా మంచు కణాలుగా మారి గాల్లో సమూహంగా ఉండే స్థితి. ఒక సాధారణ మేఘం పరిమాణం సుమారు ఒక ఘన కిలోమీటరు వరకు ఉండవచ్చు. అంటే ఒక కిలోమీటరు పొడవు, వెడల్పు, ఎత్తు ఉన్న గాలి ప్రాంతంలో ఈ నీటి బిందువులు వ్యాపించి ఉంటాయి. మేఘంలోని నీటి సాంద్రత (డెన్సిటీ) సుమారు 1.003 కిలోగ్రాములు ప్రతి ఘనమీటరుగా ఉంటుంది. ఇది చుట్టూ ఉన్న గాలి సాంద్రతతో పోలిస్తే దాదాపు 0.4 శాతం తక్కువ. ఈ చిన్న తేడా చాలా ముఖ్యమైనది. ఒక వస్తువు చుట్టూ ఉన్న గాలి కంటే తక్కువ సాంద్రత కలిగి ఉంటే అది తేలిపోతుంది. ఇదే సూత్రం గాలిలో ఎగిరే బెలూన్లు లేదా హాట్ ఎయిర్ బెలూన్లకు కూడా వర్తిస్తుంది. మేఘం గాల్లో తేలడానికి మరో కారణం కూడా ఉంది. మేఘం అనేది ఒక గట్టి వస్తువు కాదు. అది అనేక కోట్ల సూక్ష్మ నీటి బిందువులు గాలిలో తేలుతూ ఉండే సమూహం మాత్రమే. గాలి పైకి ఎగిరే ప్రవాహాలు (అప్‌డ్రాఫ్ట్స్) ఈ బిందువులను కింద పడకుండా నిలబెట్టడంలో సహాయపడతాయి. కాబట్టి మేఘం మొత్తం బరువు లక్షల టన్నులుగా ఉన్నప్పటికీ, అది విస్తరించి ఉన్న నిర్మాణం కావడం, సాంద్రత తక్కువగా ఉండటం, గాలి ప్రవాహాల సహాయం ఉండటం వల్ల ఆకాశంలో తేలుతూ కనిపిస్తుంది. ఇది ప్రకృతిలోని ఒక ఆసక్తికరమైన భౌతిక శాస్త్ర సూత్రానికి ఉదాహరణ.

— బిఎస్ఎస్ మైత్రేయి

# అమెరికాలో ట్రంప్ 'సర్'

ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్‌ఐఆర్–సర్) భావనను భారత్ నుంచి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంగ్రహించారో లేక ట్రంప్ నుంచి నరేంద్రమోదీ ప్రభుత్వం అరువుతెచ్చుకుందో గాని ప్రస్తుతం ఇద్దరూ ఒకే బాటలో ప్రయాణించటం ఆశ్చర్యకరమైన కాకతాళీయత. భారత్‌లో ఎన్నికల కమిషన్ గత సంవత్సరం బీహార్‌లో మొదలుపెట్టి త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో 'సర్' నిర్వహిస్తున్న తీరు పెద్ద రాజకీయ వివాదంగా కొనసాగుతూ, అది ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ అభిశంసనకు ప్రతిపక్షాలు పార్లమెంటు ఉభయసభల్లో నోటీసు ఇచ్చేంతవరకు వెళ్లింది. 'సర్' నిర్వహించిన రాష్ట్రాల్లో మహిళలు, మైనారిటీలు, ఎస్‌సి, ఎస్‌టి ఓట్లు పదుల లక్షల సంఖ్యలో తొలగించటంపై ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. జ్ఞానేశ్‌కుమార్ బిజెపి పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తూ, ఓటరుగా గుర్తింపుకు భారత పౌరులనుంచి కోరుతున్న డాక్యుమెంట్లు (పత్రాలు) ఇందుకు సాధనంగా ఉపయోగపడుతున్నాయి. సుప్రీంకోర్టు జోక్యం ప్రజలకు కొద్దిపాటి సౌలభ్యం కలిగించింది. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితానుంచి తొలగించబడిన 60 లక్షలమంది ఓటర్ల ఫిర్యాదులను పరిష్కరించటానికి సుప్రీంకోర్టు 500మంది న్యాయాధికారులను నియమించటం, పరిహారం – నిర్ణీత సమయం కారణంగా పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, ఒడిసా రాష్ట్రాలనుంచి సైతం న్యాయాధికారులను బెంగాల్ రప్పించటం ఒక చరిత్ర.

ఓటర్ల జాబితాల ప్రక్షాళన ద్వారా బిజెపి అధికారం పటిష్టపవుతుంది, విస్తరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఊహిస్తుండవచ్చు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్‌లో రిపబ్లికన్‌ల అధికారం నిలుపుకోవటమేగాక, 'రానున్న చాలాకాలంపాటు రిపబ్లికన్‌లకు తిరుగులేకుండా చేయటానికి 'సర్' నిర్వహణ సహాయకారి అవుతుందని భావిస్తున్నారు. అమెరికాది అధ్యక్ష తరహా పాలనా వ్యవస్థ అయినందున రాష్ట్రాలకు సొంత ఎన్నికల చట్టాలుంటాయి. అందువలన అమెరికా ఎన్నికల వ్యవస్థ రూల్స్‌లో మార్పులను ట్రంప్ తలపెట్టారు. ప్రతి ఓటరూ తన పౌరసత్వం గూర్చి డాక్యుమెంటరీ రుజువు (డ్రైవర్ లైసెన్స్‌కు అదనంగా చెల్లుబాటులో ఉన్న అమెరికన్ పాస్‌పోర్ట్, లేదా అమెరికా పౌరునిగా జనన సర్టిఫికేట్ లేదా నాచురలైజేషన్ సర్టిఫికేట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసి, చెల్లుబాటులో ఉన్న ఫోటో ఐడి కార్డు) ఓటరు రిజిస్ట్రేషన్‌కు తప్పనిసరి చేశారు. 'సేఫ్‌గార్డ్ అమెరికన్ ఓటర్ ఎలిజిబిలిటి యాక్ట్'ను ఫిబ్రవరిలో ప్రతినిధుల సభ ఆమోదించగా సెనేట్‌లో పెండింగ్‌లో పడిపోయింది. దీన్ని ఆమోదించేవరకు తాను మరి దేనిపైనా సంతకం చేయబోనని ట్రంప్ రిపబ్లికన్‌లకు స్పష్టం చేశారట!

2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి కనీస మెజారిటీ సాధించటంలో విఫలమైన తదుపరి 'సర్' తెరపైకి వచ్చింది. అమెరికా ఇరాన్‌తో యుద్ధంపై ట్రంప్‌కు ప్రజల తోడ్పాటు 40 శాతానికి దిగజారిన నేపథ్యంలో ఆయన 'సర్' చట్టానికి ఒత్తిడి చేస్తున్నారు. కొన్ని సారూప్యతలున్నాయి. చట్టాలను పాటించకుండా, చొరబాటుదారులను ఓటర్ల జాబితాలనుంచి తొలగించి, వారిని వెనక్కు పంపుతామని మోదీ–అమిత్ షా ద్వయం శపథం చేస్తున్నారు. జనన ధృవీకరణ పత్రాలు లేనివారు, వివాహంతో ఇంటిపేరు మారిన మహిళలు, రెండు దశాబ్దాలనాటి సర్ జాబితాలతో సరిపోలని పేర్లు, పాత అడ్రసులో లేరన్న పేరుతో, తల్లిదండ్రులు–సంతానం మధ్య వయోభేదం తక్కువగా ఉందన్న పేరుతో ఇక్కడ ఒక్కో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో పేర్లు తొలగించారు. అక్కడ కూడా (అమెరికా)డాక్యుమెంట్లు ప్రవేశపెట్టటంవల్ల పదుల లక్షలమంది ఓటు హక్కు కోల్పోతారని, మైనారిటీల కమ్యూనిటీల సభ్యులు ఎక్కువగా ఓటర్ల జాబితానుంచి తొలగించబడతారని ఓటింగ్ హక్కు కాంపెయినర్‌లు, పౌర సమాజ సంస్థలు వివిధ అధ్యయనాలు ఉదహరించి మరీ వాదిస్తున్నారు. జనన, నాచురలైజేషన్ సర్టిఫికేట్, పాస్ట్‌పోర్టు డిమాండ్ చేయటంవల్ల అర్హులైన ప్రతి 10మందిలో ఒకరు ఓటరుగా రిజిస్ట్రేషన్ అవకాశం కోల్పోతారని ఒక సర్వే చెబుతోంది. 6కోట్ల 90లక్షలమంది అమెరికన్ మహిళలు, 40లక్షలమంది పురుషులకు ప్రస్తుత లీగల్ పేరుతో సరిపోలే జనన సర్టిఫికేట్‌లు లేవని ఒక అంచనా. మహిళల్లో 84శాతంమంది వివాహానంతరం ఇంటిపేరు మార్చుకున్నారట!

రిపబ్లికన్‌లకు సెనేట్‌లో 53–47మెజారిటీ, ప్రతినిధుల సభలో 219–213 మెజారిటీ ఉంది. అయితే సెనేట్‌లో చట్టం ఆమోదం పొందటానికి 60ఓట్లు కావాలి. అది అసాధ్యంగా కనిపిస్తున్నందున ఫిలిబస్టర్ (కనీస ఓటుతో చర్చ ముగించటం) ప్రయోగించి కనీస మెజారిటీతో చట్టం ఆమోదాన్ని ట్రంప్ కోరుతున్నారు. ఫెడరలైజ్డ్ ఎన్నికల వ్యవస్థను 'జాతీయం చేయజూస్తున్న' ట్రంప్ చర్యను అనుమతించబోమని డెమొక్రాట్లు పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుత చట్టంలో గందరగోళం ఏమీలేదు. అమెరికన్ పౌరులు మాత్రమే ఓటరుగా రిజిస్టర్ అవుతారు, ఓటు చేస్తారు. అత్యధిక రాష్ట్రాల్లో పౌరసత్వం రుజువుకు డాక్యుమెట్లు అవసరం లేదు. వ్యక్తి గుర్తింపు, నివాసం, వయస్సు రుజువు చూపాలి. అందువల్ల ఓటర్ రిజిస్ట్రేషన్‌ను మోటారు వాహన లావాదేవీల ద్వారా ప్రాసెస్ చేస్తారు. ట్రంప్ కొత్త విధానం పౌరసత్వానికి డాక్యుమెంటరీ రుజువు, ఓటు వేయటానికి గుర్తింపు కార్డు డిమాండ్ చేస్తున్నది. అధికారం నిలుపుకోవటానికి పచ్చి మితవాదుల విపరీతాలకు ఈ చర్యలు నిదర్శనం. ●

# నేపాల్ కొత్త ప్రభుత్వానికి సమస్యలు, సవాళ్లు



బాలేంద్ర షా

**టి.ఎన్.అశోక్**

నేపాల్ రాజకీయాలు దశాబ్దాలుగా ఎన్నడూ ఆగని రాట్నం చక్రంలా పనిచేస్తున్నాయి. ప్రభుత్వాలు ఏర్పడ్డాయి, కూలిపోయాయి. కూటములు ఏర్పడ్డాయి, ముక్కలైనాయి. అవే నాయకుల పేర్లు మంత్రివర్గాల్లో రీసైకిల్ అవుతున్నాయి. ఓటర్లు నిరాశ చెందారు. యువతలో అసంతృప్తి పెరిగింది. అత్యంత ఆశావహులైన పౌరులు మూటముల్లె సర్దుకుని గల్ఫ్‌కు, మలేషియాకు, భవిష్యత్ బాగుంటుందని భావించిన ఏ చోటకైనా వెళ్లిపోయారు. ఆ చక్రానికి ఇప్పుడు పగుళ్లు ఏర్పడ్డాయి. నాలుగేళ్ల వయస్సు కూడా లేని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పి), రాజకీయ విశ్లేషకులు నేపాల్‌లో అసాధ్యమనుకుని భావించిన దానిని సాధ్యం చేసింది. అది స్థిరపడిన పాలనావ్యవస్థను తునాతునకలు చేసింది. 2008లో రాచరిక వ్యవస్థ రద్దు చేయబడిన అనంతరం అత్యంత పర్యవసాన ఎన్నికల్లో ఆర్‌ఎస్‌పి ప్రముఖ నాయకులను ఓడించి మరుగు నుంచి ఆధిపత్యంలోకి వచ్చింది. నేపాల్‌లో అత్యంత అనుభవజ్ఞులైన కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరైన మాజీ ప్రధానమంత్రి కెపి. శర్మ ఓలి సహా ప్రముఖ నాయకులు ఓటమి పొందారు. నేపాల్ కేవలం ప్రభుత్వాలను మార్పు చేయలేదు, అది శకాలు మారుస్తున్నది. నేపాల్ పాలకవర్గాలను అనేక సంవత్సరాలపాటు కెమెరా ముందు జవాబుదారీతనం కోరిన టెలివిజన్ జర్నలిస్టు రబి లామిచ్చానె 2022లో ఆర్‌ఎస్‌పిని ఏర్పాటు చేశాడు. ఎవరు పరిపాలించాలనే అంశాన్ని భావజాలం కాదు సమర్థత నిర్ణయించాలనేది అతని సాధారణమైన సిద్ధాంతం. రాచరిక వ్యవస్థ అనంతర రాజకీయాలను మావోయిస్టులు, కమ్యూనిస్టులు, మధ్యేమార్గ కాంగ్రెస్‌వాదులు శాసించారు. వారందరూ 20వ శతాబ్దం విప్లవోద్యమాలకు రూపుదిద్దినవారే. ఆర్‌ఎస్‌పి మరో ముఖ్యనాయకుడు బాలేంద్ర 'బాలెన్' షా – సివిల్ ఇంజనీర్, గాయకుడు, కాఠ్మండు మాజీ మేయర్. భిన్నమైన రాజకీయ అథారిటీని పుణికిపుచ్చుకున్నారు. పట్టణవాసి, విద్యావంతుడు, సోషల్ మీడియాలో చురుకైన వ్యక్తి, అవినీతి మచ్చలేదు – అది పాత వ్యవస్థలోని మూలాలకు సైతం చాపకింద నీరులా వ్యాప్తి చెందింది. లామిచ్చానె, షా కలిసి మరో అద్భుతమైన వ్యక్తి సుడాన్ గురాంగ్‌ను తమవైపు చేరదీశారు. 2025లో దేశాన్ని కుదిపివేసిన జన్–జడ్‌ను ఆర్గనైజ్ చేయటానికి సహాయపడిన వ్యక్తి గురాంగ్, మరో ముఖ్యుడు ఫిలింమేకర్–రాజకీయవేత్త ఆశింషా. వీధి బ్యారికేడ్‌ల ద్వారా కాకుండా, వెండితెర ద్వారా తయారైన తరానికి అతడి నేపథ్యం ప్రతిబింబం. అసంతృప్తితో రగులుతూ, ఇంటర్నెట్ ద్వారా సంబంధం ఏర్పరచుకున్న యువతరం, ఆర్థికంగా నిరాశ నిస్పృహతో ఉన్న ప్రజలు, వారిగోడు పట్టించుకోకుండా సోషల్ మీడియాను నిషేధించిన బధిర ప్రభుత్వం, 2025 ఉద్యమం వారి రాజకీయ అధిరోహణను వేగిరపరిచింది. ప్రభుత్వం వెనక్కు తగ్గింది–ఆర్‌ఎస్‌పి ముందుకు తోసుకువచ్చింది. తమ దేశం ఎందుకు పనిచేయటంలేదని ప్రశ్నించుకున్న యువతరం ఆర్‌ఎస్‌పిలో తమ ఆశల్ని చూచుకున్నారు.

నేపాల్‌లో వచ్చిన మలుపు ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలంటే ఒక్కసారి చరిత్రలోకి వెళ్లాలి. రాచరిక వ్యవస్థ కూలిపోయిన నాటి నుంచీ నేపాల్ చారిత్రకంగా రాచరిక వ్యవస్థ వ్యతిరేక ప్రజాస్వామ్య ఉద్యమంతో సంబంధమున్న మధ్యేమార్గ పార్టీ నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు లెఫ్ట్‌లో పరస్పరం పోటీపడుతున్న ఓలి యుఎంఎల్, పుష్ప కమాల్ దహాల్ మావోయిస్టు సెంటర్ మధ్య అటుఇటు ఊగిసలాడింది. ప్రచండగా పిలవబడే దహాల్ ఎన్నికల రాజకీయాల్లో ప్రవేశించక మునుపు దశాబ్దంపాటు సాయుధ పోరాటం నడిపారు. వీరు ఆషామాషీ ప్రత్యర్థులు కారు. 2015లో రాజ్యాంగాన్ని రచించింది వీరే. ఆధునిక దక్షిణాసియా చరిత్రలో అత్యంత కల్లోలిత పరివర్తనల్లో కొన్నింటిగుండా నేపాల్‌ను నడిపించింది వీరే. అయితే ప్రతిష్టంభనకు కారకులైనారు. అవకాశాలు వెతుక్కుంటూ విదేశాలకు వెళ్లిన పదుల లక్షల మంది నేపాలీయులు పంపే ధనంపైనే నేపాల్ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా ఆధారపడింది. అవినీతి విశృంఖలం, కంటికి కనిపిస్తుంది కూడా. మౌలిక వసతులు కల్పన వెనకపట్టుపట్టింది. రాజకీయ వాగ్దానాలు, వాస్తవిక జీవనానికి మధ్య అగాధం పెరిగింది. ఆర్‌ఎస్‌పి ఎన్నికల ప్రణాళిక ఈ నిస్పృహకు ఇలా జవాబు చెప్పింది : 12లక్షల కొత్త ఉద్యోగాలు, తలసరి ఆదాయం రెట్టింపు, డిజిటల్ పరిపాలన విస్తరణ, ఆశాపూరితమైన మౌలికవసతుల ప్రాజెక్టులు. ఈ లక్ష్యాలు నెరవేర్చబడతాయా – అది వేరే ప్రశ్న. రాజకీయ ప్రాధాన్యత ఏమంటే – వారు చెప్పారు, ప్రజలు నమ్మారు. నేపాల్ కొత్త నాయకులకు అంతర్గత ఆర్థిక సంక్షోభమేగాక మరో వారసత్వ సంక్షోభం కూడా వచ్చింది. అదేమంటే చాలా సున్నితమైన భౌగోళిక రాజకీయ స్థితి. దక్షిణాన ఇండియా, ఉత్తరాన చైనా – రెండు భిన్న దృక్పథాలు కలిగిన అతిపెద్ద దేశాల మధ్యలో భూపరివేష్టితమైన చిన్నదేశం నేపాల్. రాచరిక వ్యవస్థ అనంతరం రాజకీయపక్షాలు ఆ రెండు దేశాల మధ్య తులనాత్మకంగా ఉండటానికి తంటాలుపడ్డాయి. ఆర్‌ఎస్‌పి మరింత ఆశావాదంతో కూడిన వాగ్దానం చేసింది. నేపాల్‌ను బఫర్ రాజ్యంగా తీర్చిదిద్దుతామని చెప్పింది. నేపాల్‌కున్న ప్రాధాన్యతల్లా రెండు పెద్ద రాజ్యాల్లో దేనితోను అంటకాగకపోవటం, రెండింటి మధ్య వంతెనగా వ్యవహరించటం.



చైనా బెల్ట్ అండ్ రోడ్ చొరవ రహదారులు, సొరంగమార్గాలు, రైలుమార్గ సాధ్యాసాధ్యాల అధ్యయనాల రూపంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టింది. భారత్ నేపాల్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా, సముద్రాన్ని చేరుకునే మార్గంగా ఉంది. ఏ ఒక్క దేశం చేతిలో ఆటబొమ్మ కాకుండా ఇరుదేశాల నుంచి గరిష్ట లబ్ధి సాధించటం ఆర్‌ఎస్‌పి ముందున్న సవాలు. నూతన ప్రభుత్వం భావజాలంతో కూడిన విదేశాంగ విధానం కాకుండా ఆచరణాత్మక విధానానికి ప్రాధాన్యత ఇస్తుందని సూచనలు తెలియజేస్తున్నాయి. బీజింగ్, న్యూఢిల్లీ రెండూ జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. నేపాల్ అదృష్టాన్ని నిజంగా పరివర్తన చెందించగలిగిన అవకాశం కొత్త ప్రభుత్వానికి ఒక్క రంగంలో ఉంది. అది జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి. రాజకీయ అస్థిరత వల్ల ఇన్నాళ్లూ ఈ రంగంలోకి పెట్టుబడులు రాలేదు. భారత్‌కు ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లో విద్యుచ్ఛక్తి లోటు ఉంది. బంగ్లాదేశ్ విద్యుత్ దిగుమతికి ప్రాథమిక ఒప్పందాలు చేసుకుంది. విద్యుత్ ఎగుమతికి నేపాల్ ట్రాన్స్‌మిషన్ మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోగలిగితే అది దాని ఆర్థిక వ్యవస్థకు పరివర్తనాత్మకం అవుతుంది. నికర ఎగుమతిదారుగా ఆర్థికంగా లబ్ధిపొందగలదు. ఉద్యమాలు ఎన్నికల్లో గెలిచిన ఉదంతాలు, పరిపాలనలో కుప్పకూలిన ఉదంతాలు చరిత్రలో చాలా ఉన్నాయి. ఆర్‌ఎస్‌పి నాయకులకు ఆకర్షణ ఉంది. ప్రజలు వారిని విశ్వసించి ఓటువేశారు. అయితే జాతీయస్థాయిలో వారికి పరిపాలనా అనుభవం లేదు. ప్రజల అంచనాలు అంబరాన్నంటాయి. ఏ పొరపాటు జరిగినా అది ప్రజాతీర్పుకు ద్రోహంగా పరిగణించబడే ప్రమాదం ఉంది. మరో సమస్య రాచరిక వ్యవస్థను లాంఛనంగా పునరుద్ధరించే అంశం. 2008లో ఆ వ్యవస్థ రద్దయి నేపాల్ రిపబ్లిక్‌గా అవతరించినప్పటికీ కొన్ని విభాగాల్లో ఆ అభిమానాలు వ్యక్తమవుతూ వున్నాయి. ఈ ఎన్నికల్లో ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుదారులు అలంకారప్రాయంగా రాచరికవ్యవస్థ పునరుద్ధరణను ప్రచారంలో పెట్టారు. కాని ఆర్‌ఎస్‌పి నాయకత్వం అటువంటి వాగ్దానం చేయలేదు. కొత్త తరహా రాజకీయంతో అధికారంలోకి వచ్చిన ఆర్‌ఎస్‌పి ప్రజల ఆశలను నెరవేర్చగలదా? ఒక పేద దేశంలో వ్యవహారిక ప్రజాస్వామ్యం ఏమి సాధించగలదో పొరుగువారే కాదు, ప్రపంచం చూస్తుంటుంది. ఇది ఆర్‌ఎస్‌పికి నిజమైన పరీక్ష.

# ఈసారి బడ్జెట్ కాంగ్రెస్‌కు పరీక్ష!

**రాజధాని సందడి**

**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

సోమవారం నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దాదాపు 19 ఏళ్ళ తరువాత శాసనసభ, శాసనమండలి ఒకే ప్రాంగణంలో జరగడం ఈసారి సమావేశాల ప్రత్యేకత. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి టిడిపి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు 1985లో రద్దు చేసిన శాసనమండలిని, 2007లో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పునరుద్ధరించబడింది. ఆ తరువాత 2014లో రాష్ట్ర పునర్విభజన జరిగి తెలంగాణ శాసనమండలి ఏర్పాటైంది. మండలి పునరుద్ధరణ జరిగిన దాదాపు రెండు దశాబ్దాలు శాసనసభ భవన ప్రధాన ప్రాంగణానికి దూరంగా జూబ్లీ హాల్ వద్ద ప్రాంగణంలో శాసన మండలిని నిర్వహిస్తూ వస్తున్నారు. తొలుత జూబ్లీ హాల్‌లో, ఆ తరువాత దాని వెనుక సమావేశమందిరంలో సమావేశాలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పట్టుదల కారణంగా శాసనసభ ప్రాంగణంలోకే శాసనమండలి కూడా తరలివస్తుంది. దీని కోసం పాత శాసనసభ సమావేశ వారసత్వ కట్టడాన్ని చెక్కుచెదరకుండా పునరుద్ధరించి శాసనమండలికి కేటాయించటం విశేషం.

దీంతో శాసనసమండలి, శాసనసభ సమావేశాలు ఒకే ప్రాంగణంలో జరగడంతో పాటు, శాసనమండలి సమావేశాలకు ఈ సారి ప్రాధాన్యత పెరిగే అవకాశం కనిపిస్తుంది. గతంలో ప్రధాన భవంతికి దూరంగా ఉన్నందున ముఖ్యమంత్రులు, మంత్రులు అక్కడికి వెళ్ళడం శాసనసభతో పోలిస్తే తక్కువే. దీంతో పాటు మీడియా కవరేజ్ కూడా అంతంత మాత్రంగా ఉండేది. ఇక ఒకే దగ్గర ఎగువ, దిగువ సభలు ఉండడంతో ఆ లోటు తీరే అవకాశం ఉంది. ఉభయ సభల మధ్యలో ఉన్న ప్రాంతాన్ని ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు కూర్చొని, బైటి నుంచి వచ్చే వారితో మాట్లాడేవిధంగా, సెంట్రల్‌హాల్ క్యాంటిన్ తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పథకాలు రచిస్తోంది. దీనికి తోడు ఆదర్శనగర్‌లోని శాసనసభ్యుల క్వార్టర్స్‌లో ఢిల్లీ తరహా కాన్స్‌టిట్యూషన్ క్లబ్‌ను నిర్మాణానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది ప్రారంభమయ్యే అవకాశం ఉంది. భారత రాజ్యాంగానికి ఉన్న ప్రాధాన్యతను, రాజ్యాంగ పరిషత్ చర్చలను ప్రజలకు అందుబాటులో ఉంచటంతో పాటు, మేధోపరమైన, విధానపరమైన మథనానికి వేదికగా చేయాలని ప్రభుత్వం తలపోస్తుంది.

ఇక బడ్జెట్ సమావేశాలలో మార్చి 20న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ – 2025–26ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టబోతున్న మూడవ పూర్తి స్థాయి బడ్జెట్. అదే సమయంలో ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలను చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రెండు బడ్జెట్‌లలో గత ప్రభుత్వ అప్పుల వారసత్వంతో సతమతమవుతూ బడ్జెట్ బండిని జాగ్రత్తగా కదిలించారు. కొన్ని ముఖ్యపథకాలను కూడా అమలు చేశారు. అందులో మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ళు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచటం వంటివి కీలకమైనవి. రైతు భరోసా పేరుతో రైతు ఆర్థిక సహాయాన్ని రూ.12వేలకు పెంచినప్పటికీ, ఒక విడత ఇవ్వలేకపోగా, తాజాగా మరో విడత బకాయి పడటం కొంత రైతుల్లో అసహనానికి కారణమవుతోంది. యువత కోసం అనేక ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌లు వేసి సుమారు 71 వేల పోస్టులు భర్తీ చేసినప్పటికీ, రెండు లక్షల ఉద్యోగాల వాగ్దానం, జాబ్ క్యాలెండర్ హామీ అమలు కావాల్సి ఉంది. దీనికితోడు గత జూన్ 2 నుంచి యువత స్వయం ఉపాధికి సంబంధించి రాజీవ్ యువ వికాసం పేరుతో రూ.3 లక్షల వరకు సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు స్వీకరించినా, పూర్తి స్థాయిలో అమలు కాలేదు. తాజాగా త్వరలో విద్యార్థినులకు ఎలక్ట్రానిక్ వాహనాలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉద్యోగుల వైద్య పథకం కొంత ఊరటనిచ్చినప్పటికీ, పిఆర్‌సి విషయంలో,రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బకాయిల విషయాలలో కొంత అసంతృప్తి ఉద్యోగులలో నెలకొంది. ఆర్‌టిసి ఉద్యోగులకు సంబంధించి పలు హామీలు నెరవేర్చాల్సి ఉంది. ముఖ్యంగా గుర్తింపు ఎన్నిక, బకాయిల చెల్లింపు వంటివి ఉన్నాయి. వీటన్నిటికీ ప్రధాన కారణంగా గత ప్రభుత్వం నుంచి వచ్చిన అప్పులతో ప్రభుత్వం చేయి కదలని పరిస్థితి. దీనిని దాదాపు రెండున్నరేళ్ళ ప్రభుత్వం అర్థం చేసుకునే కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ నుంచి మున్సిపల్ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో ఓటర్లు పట్టం కట్టారు.

గతం కంటే మెరుగైన ఫలితాలను ఇచ్చారు. ఇక నుంచి ప్రజలు ప్రస్తుత ప్రభుత్వం హామీలపై ఆశగా ఎదురు చూస్తారనటంలో సందేహం లేదు. అన్నిటికంటే ముఖ్యంగా ఐదేళ్ళలో గుడిసె రహిత తెలంగాణ చేస్తామన్న హామీపై దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పటికే అనేక మంది నిరుపేదలు హైదరాబాద్, వరంగల్ తదితర నగరాలు, పలు పట్టణాలలో ప్రభుత్వానికి చెందిన వివిధ రకాల భూములలో గత ప్రభుత్వ కాలంలోనే గుడిసెలు వేసుకొని ఉన్నారు. వాటిలో అర్హమైన వారికి పట్టాలు ఇచ్చే ప్రక్రియ వేగిరపరిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది.

ప్రస్తుత పథకాల కొనసాగింపు, కొత్తవాటి అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక వనరులు పెంచుకోవడమే మార్గం. ఇప్పటి వరకు రుణాల రీ –షెడ్యూలింగ్ ద్వారా రుణం కట్టే గడువును పెంచుకోగలిగింది. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి వచ్చే ఆర్థిక వనరులను గరిష్ఠంగా వినియోగించుకుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి రూ.2.84లక్షల కోట్ల లక్షిత బడ్జెట్‌లో 72.87 శాతం సాధించి,రూ.2.07 లక్షల కోట్లు నిధులు సమకూర్చుకోగలిగింది. రుణాల స్వీకరణ, పాత రుణాల వడ్డీ చెల్లింపు విషయంలో మెరుగుగానే వ్యవహరిస్తుంది. మిగిలిన మూడు నెలలో మిగతా మొత్తాన్ని సాధించేందుకు చేరువలో ఉండే అవకాశం ఉంది. అయితే, ఇచ్చిన హామీలకు ఇది సరిపోదు. అందుకే ఆర్థిక ఊతం కోసం డిసెంబర్ మాసంలో 'తెలంగాణ విజన్ 2047' డాక్యుమెంట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ, దానికి ఆచరణాత్మక పునాదులు ప్రస్తుత బడ్జెట్‌లో కనిపించాల్సిన అనివార్యత నెలకొంది.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



రోడ్లు భవనాల శాఖ మంత్రి
కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం అని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలో హయత్ నగర్ తొర్రూరు చౌరస్తా నుండి జీ స్కూల్ వరకు రూ.10 కోట్లతో నిర్మించే రోడ్ విస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమ కోసం ఎల్లవేళ కృషి చేస్తుందని అన్నారు. మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ మాట్లాడుతు ఎల్‌బినగర్ ఎమ్మెల్యే మూసీ అభివృద్ధి చైర్మన్‌గా ప్రజలకు ఏమిలాభం చేసారో చెప్పాలని ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎండిబి శాఖ ఇఎన్సీ మోహన్ నాయక్ , నేషనల్ హైవే సీఈ ధర్మా రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు జక్కిడి ప్రభాకర్ రెడ్డి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి చెన్నగోని రవీందర్ గౌడ్ జక్కిడి సత్య తేజ్ రెడ్డి బుడ్డ సత్యనారాయణ అశోక్ గౌడ్, డివిజన్ల అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, దేవాలయ కమిటీల డైరెక్టర్లు, సేసంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తరగతి గదిలో వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలి

గచ్చిబౌలిలో పదవ తరగతి పరీక్షా కేంద్రం తనిఖీలో
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం మొదటిరోజు గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్నీ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అ ధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు ప్రథమ చికిత్స మందులు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు తగు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలలోని వసతులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు.

## ముస్లింల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/హయత్ నగర్:** తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల సంక్షేమం, అభివృద్ధి రేవంత్ రెడ్డి ప్రభుత్వంతోనే సాధ్యం అని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా మన్సూరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రంజాన్ తోఫాను ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని ముస్లింలకు జక్కిడి శివ చరణ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు తెలంగాణలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేద ముస్లింలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధముగా అన్ని చర్యలు తీసుకుంటునట్టు తెలిపారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ఈరిగి రమేష్, శ్యామ్యూల్ రెడ్డి, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, యరల రామ్ రెడ్డి జక్కిడి సత్య తేజ్ రెడ్డి శివంత్ రెడ్డి,సతీష్ రెడ్డి మున్నా జానీ విట్టల్ రెడ్డి, సంజు గౌడ్ జకీర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హోప్ ఫౌండేషన్ సేవలు భేష్

కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిరియాల రాఘవ్ రావు



**ప్రజాపక్షం/మియాపూర్:** హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు భేష్ అని, సమాజాన్ని తనవంతుగా కొంత సేవ చేయాలనే మానవత దృక్పథంతో అన్న దానంతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిరియాల రాఘవ్ రావు అన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన 175వ వారం అన్న ప్రసాద కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిరియాల రాఘవ్ రావు, యువనాయకులు మిరియాల ప్రీతమ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి హోప్ చైర్మన్ కొండ విజయ్ కుమార్‌తో కలిసి ప్రజలకు వడ్డించారు. ఈ సందర్భంగా రాఘవ్ రావు మాట్లాడుతూ... ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి భోజనాలు చేయడం చేయాలా అరుదుగా జరుగుతున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా హోప్ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకొని వారికి ఏలోటు లేకుండా చేసుకోవటం గొప్ప విషయమని తెలిపారు. అనేక సేవకార్యక్రమలు చేస్తు న్న హోప్ ఫౌండేషన్ చర్మన్ కొండ విజయ్ కుమార్ తో పాటు సభ్యులను అభినందించారు...ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వ్యవసాయ ఉత్పాదకతోనే సుస్థిరాభివృద్ధి

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ప్రొ.శ్రీనివాస మూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెరుగైన వ్యవసాయ ఉత్పాదకతో సుస్థిరాభివృద్ధి సాధ్యమని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుస్థిర అభివృద్ధికి వ్యాపార పరివర్తన' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. యూనివర్సిటీ మినీ ఆడిటోరియంలో శనివారం జరిగిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ వ్యాపారాలు తమ ప్రధాన కార్యకలాపాలలో స్థిరత్వాన్ని ఏకీకృతం చేయడానికి వ్యూహాత్మక విధానాల అవసరమని అన్నారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, ఆరోగ్య సౌకర్యాల ప్రాముఖ్యత, నాణ్యమైన విద్యను అందిస్తూ, సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకడమి క్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్ప చక్రపాణి మాట్లాడుతూ రెండు రోజులుగా జ రిగిన ఈ సదస్సులో వాణిజ్య, వ్యాపారవృద్ధికి, సుస్థిర అభివృద్ధికి సంబంధించి జరిగిన చర్చ భవిష్యత్ పరిశోధనలకు దారి చూపనుందని వెల్లడించారు. ఈ సదస్సులో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయా కృష్ణా రెడ్డి, డా.కె.విక్టర్ బాబు, ప్రొఫెసర్ ఐ.ఆనంద్ పవార్ తదితరులు పాల్గొన్నారు.




## అన్యాయంగా సస్పెండ్ చేశారు.. ఆత్మహత్య చేసుకుంటున్న

సంచలనం రేపిన కానిస్టేబుల్ వీడియో



**ప్రజాపక్షం/హైద రాబాద్:** నగర పోలీసు వ్యవస్థలో సంచలనానికి దారితీసే ఘటన వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విజి సజ్జనార్ పై ఒక కానిస్టేబుల్ తీవ్ర ఆరోపణలు చేస్తూ సెల్ఫ్ వీడియో విడుదల చేయడం కలకలం రేపుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ వీడియోలో కానిస్టేబుల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ కనిపించాడు. తనపై అకారణంగా సస్పెన్షన్ విధించారని, వాస్తవాలు తెలుసుకోకుండా తనను బలిపశువుగా మార్చారని పేర్కొన్నాడు. ఉన్నతాధికారుల వేధింపుల వల్లే తాను ఈ నిర్ణయం తీసుకుంటున్నానని తన సెల్ఫీ వీడియోలో చెప్పాడు. అంతేకాకుండా "మీ వేధింపుల వల్లే నేను ఆత్మహత్యకు పాల్పడుతున్నాను" అంటూ నగర పోలీస్ కమిషనర్‌పై నేరుగా ఆరోపణలు చేశాడు. అలాగే తన ఆత్మహత్యకు సిఐ సత్యనారాయణ, ఎస్‌బి కానిస్టేబుల్ సాయిసింగ్‌లే కారణమని తెలిపాడు.వీడియోలో అతని శరీరంపై రక్తం కనిపించడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఈ ఘటన హైదరాబాద్ పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. వీడియో బయటకు రావడంతో ఈ విషయం పై అధికారులు స్పందించే అవకాశం ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. కానిస్టేబుల్ పరిస్థితి ఏమిటి, అతను ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడు అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## పరీక్షలు ముగిసే వరకు ఇబ్బందులుండొద్దు

పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హరిచందన దాసరి
తొలి రోజు పరీక్షకు 73610మంది హాజరు



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** పదవ తరగతి పరీక్ష లు ముగిసే వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. జూబ్లిహిల్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 362 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వేసవి దృష్ట్యా త్రాగునీరు, వైద్యసదుపాయాలు, మెడిసిన్స్ వంటివి అందుబాటులో ఉంచామన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు, మౌళిక వసతులు కల్పించామని తెలిపారు. జిల్లాలో తొలిరోజు పరీక్షకు మొత్తం 74383 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 73610 మంది హాజరయ్యారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జూబ్లీహిల్స్ పరీక్షా కేంద్రంలో మొత్తం 234 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా మొత్తం మంది హాజరయ్యారని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఆమెకు తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్ని వసతులను ఆమె పరిశీలించారు.

## ఏప్రిల్ 5న ధన్‌రాజ్ జువెలర్స్ ఫెస్టివ్ లక్కీ డ్రా




**ప్రజాపక్షం /హైదరాబాద్:** ధన్‌రాజ్ జువెలర్స్ కొనుగోలుదారులను ఆకట్టుకొనేలా పండుగ సీజన్‌లో 'ఫెస్టివ్ లక్కీ డ్రా–2026' ను ప్రకటించింది. లక్కీ డ్రా ద్వారా కస్టమర్లకు రూ.30 లక్షల వరకు విలువైన బహుమతులు గెలుచుకొనే అవకాశం కల్పిస్తున్నట్టు ధనరాజ్ జైన్ జువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ధురువ్ రంకా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ శాలిబండలోని ఉన్న ధన్‌రాజ్ జువెలర్స్ షోరూమ్‌లో కొనుగోలు చేసే కస్టమర్లు ఫెస్టివ్ లక్కీ డ్రాలో ఏప్రిల్ 4వ తేదీ వరకు పాల్గొనవచ్చని, 5న హైదరాబాద్ చంపాపేటలోని ఎంవైఆర్ గార్డెన్స్‌లో లక్కీ డ్రా తీస్తారని వివరించారు. విజేతలకు మారుతి సుజుకి ఎర్టిగా కారు, ఐదు అపాచీ బైక్‌లు, ఎల్‌జి వాషింగ్ మెషిన్లు, ఎల్‌జి టెలివిజన్లు, ఫ్రిజ్‌లు, వన్ ప్లస్ నార్డ్ స్మార్ట్‌ఫోన్లు అందజేస్తామని వివరించారు.

## రంగారెడ్డి జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు 99.31 శాతం నమోదు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకూ జరిగాయి. పరీక్షలు సజావుగా సాగడానికి జిల్లా కలెక్టర్ సలహాలు సూచనలతో వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందరా రావ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.శనివారం ప్రారంభమైన పరీక్షలు ఏప్రిల్ 16తో ముగుస్తాయి.పరీక్షల నిర్వహణ కోసం 255 కేంద్రాలు ఏర్పాటు చేశారు.పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు రంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలలో రెగ్యులర్ విద్యార్థులు 52851 నమోదు చేసుకోగా 52487 మంది విద్యార్థులు హాజరయ్యారని,364 విద్యార్థులు ఆబ్సెంట్ అవ్వగా 99.31 శాతం నమోదు అయినట్లు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందరా రావ్ తెలిపారు.అదేవిధంగా ప్రైవేటుగా రాసే విద్యార్థులు 102 మంది నమోదు చేసుకోగా 80 మంది హాజరైనట్లు, 22 మంది ఆబ్సెంట్ కాగా 78.43 శాతం నమోదు అయినట్లు డిఇఒ పేర్కొన్నారు.విద్యార్థులు పరీక్ష కేంద్రాలను తెలియకపోతే తెలుసుకునేందుకు వీలుగా హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ ను ముద్రించడం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.సిసి కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలను తెరవడం జరిగిందని తెలిపారు.పరీక్షా కేంద్రావద్ద పటిష్టమైన నిఘా వ్యవస్థ,సిసి కెమెరాల పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలు పేదలు సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం టంగుటూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళిక ప్రగతిలో భాగంగా శనివారం మెగా వైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రామ సర్పంచ్ చరిత కృష్ణారెడ్డిలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఇట్టి ఉచిత వైద్య శిబిరంలో 233 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 12 మంది రక్తనమోనాలను సేకరించి వికారాబాద్ టి హబ్‌కు పంపించడం జరిగిందని డాక్టర్ రేవతి రెడ్డి తెలిపారు. 13 మందిని మెరుగైన వైద్యం పరీక్షల కోసం ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరిగిందని చెప్పారు. క్యాంపుకు వచ్చిన గర్భిణీలకు అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహించామన్నారు. మహిళలకు గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి పాప్ సెమీర్ పరీక్ష కోసం రక్త నమోనాలను సేకరించి ఏరియా హాస్పిటల్ వనస్థలిపురంకు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్.సంఘవి, డాక్టర్. సాయి కిరణ్, డాక్టర్. వైశాలి, డాక్టర్. నజీబ్, టంగుటూరు డాక్టర్ శ్రీనివాస్, శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి, టంగుటూరు గ్రామ ఉపసర్పంచ్ అనంతయ్య, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### నూతన సర్పంచ్‌లు తమ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి : కాలే యాదయ్య

నూతనంగా ఎన్నికైన సర్పంచులు తమ తమ గ్రామాల అభివృద్ధి కోసం బాగా కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం శంకర్ పల్లి మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించునున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో మౌలిక సదుపాయాలకు బాగా కృషి చేయాలని చెప్పారు. వేసవికాలం ఉన్నందున ప్రజలకు త్రాగునీటి సౌకర్యానికి ఎలాంటి అసౌకర్యం కలవకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి, పిల్లిగుండ్ల గ్రామ సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి, ఇరుక్కుంట తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, పిలిగుండ్ల మాజీ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, పొద్దుటూరు మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి తావు లేకుండా సేవలందించాలి : మల్‌రెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవలు అందించాలని అధికారులకు ఇబ్రహీంప ట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. శనివారం ఆదిభట్ల సర్కిల్ తొర్రూ రు డివిజన్ పరిధి మునగనూరులో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రిజిస్ట్రేషన్ కార్యాలయంతో మునగనూరు,తొర్రూరు, రాగన్నగూడ, తుర్కయంజాల్, మన్నెగూడ చుట్టుపక్కల గ్రామా ల ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం వనస్థలిపురం వెళ్ళల్సిన అవసరం ఇకపై ఉండదాని తెలిపారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభంగా అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్నీ ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఈ కార్యాలయం ప్రారంభంతో సమయం, ఖర్చు రెండూ తగ్గి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం ముంగనూరుకు రాకుండ అడ్డుకుందేందుకు కొందరు కుట్రలు చేసిన పట్టుపట్టి ప్రజలుకోసం మునగనూరుకు తీసుకువచ్చామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు అన్ని సౌకర్యాలు కలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి,సబ్ రిజిస్టర్ ఎన్.విజయ్,నాయకులు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్,కొషికే ఐలయ్య వేముల అమరేందర్ రెడ్డి,గుత్త వెంకట్ రెడ్డి,వంగేటి గోపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరతలేదు

- ప్రజలు ఆందోళన చెందవద్దు..
- హాస్టల్స్, హాస్పిటల్స్‌లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం
- సిలిండర్లను బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా వ్యవహరిస్తాం : అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి
- జిల్లా కలెక్టర్ చైర్మన్, డిస్టిక్‌సివిల్‌సప్లై ఆఫీసర్ కన్వీనర్‌గా 12 మంది సభ్యులతో కమిటీ






**ప్రజాపక్షం/రంగారెడ్డి :** జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లకు సంబంధించి ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి అన్నారు. శనివారం సరూర్ నగ ర్ తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాలో గ్యాస్ సరఫరా పై పోలీసు సివిల్ సప్లై, రవాణా, విద్యా, ఆరోగ్య సంక్షే మ శాఖల తోపాటు ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులను అధికారులతో అడిగి తెలుసుకొని దిశా నిర్దేశం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లకు సంబంధించి జిల్లాలో ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాల ని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళు, గురుకులాలు, పాఠశాలల్లో గ్యాస్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించా రు. ప్రతి హాస్టలు, పాఠశాల, గురుకులాలను సందర్శిం చి పరిస్థితిని తెలుసుకోవాలని చెప్పారు. అదేవిధంగా అ త్యవసర పరిస్థితుల సమయంలో హాస్పిటల్లో అవసరమ య్యే గ్యాస్‌కు సంబంధించి వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ జరపాలన్నారు. అదేవిధంగా ఆస్పత్రులకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందుల సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వైద్య శాఖ అధికారులు ప్రత్యేకంగా మానిటరింగ్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. లలితా దేవికి సూచించారు. జిల్లాలో ఎవరైనా గ్యాస్ సిలిండర్లను కృత్రిమ కొరత సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఈ అంశంపై ప్ర త్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.సిలిండర్ లను బ్లాక్‌లో విక్రయించకుండా పోలీస్ అధికారులు నిరంతరం నిఘా పెట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరా పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్ డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీసర్ కన్వీనర్ గా 12 మంది అధికారులతో కలిసి డిస్టిక్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సూపరిండెంట్ ఆఫ్ పోలీస్,అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ,డిస్టిక్ ట్రాన్స్ స్పోర్ట్స్ ఆఫీసర్, డిఇఒ, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి డెవలప్మెంట్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఆఫీసర్ డిస్టిక్, డిఎం అండ్ హెచ్‌ఒ ,సేల్స్ మేనేజర్ హెచ్‌పి సిఎల్, బిపిసిఎల్, ఎల్‌పిజి డీలర్స్ సభ్యులుగా వ్యవహరిస్తారని అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి వివరించారు.ఎప్పటికప్పుడు మానిటరింగ్ కమిటీ గ్యాస్ సరఫరా ఇబ్బందులపై పర్యవేక్షణ జరుపుతుందన్నారు. జిల్లా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లను కమర్షియల్‌గా వాడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

గ్యాస్ సరఫరా పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు యధావిధిగా విధిగా ఎప్పటిలాగానే గ్యాస్ సరఫరా జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం సరూర్‌నగర్‌లోని ఐశ్వ ర్య గ్యాస్ ఏజెన్సీ, వనస్థలిపురంలోని శ్రీనివాస్ గ్యాస్ ఏజెన్సీల గోదాములను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గ్యాస్ సరఫరా చేయాలని ఏజెన్సీ వారికి సూచించారు. ఈ సమావేశంలో కం దుకూరు ఆర్‌డిఒ జగదీశ్వర్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, జిల్లా వైద్యాధికారి లలితా దేవి, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, రామేశ్వరీ దేవి, ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు వివిధ శాఖల అధికాలు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య నివారణపై ప్రత్యేక దృష్టి

### ఎంసి పల్లి చైర్మన్ జాం రవి

ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో మూడుచింతలపల్లి మున్సిపాలిటీ దూసుకెళ్తుంది. మున్సిపల్ చైర్మన్ జాం రవి తమ పాలకవర్గం, అధికారులతో కలిసి ప్రణాళికలు రూపొందించి మున్సిపల్‌లోని అన్ని వార్డులను కలుపుకుని పారిశుద్ధ్య నివారణపై ప్రత్యేక దృష్టి సారించి వీధులను, రోడ్లను శుభ్రం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని అద్రాస్‌పల్లి 22,23 వార్డుల్లో ప్రజల భాగస్వామ్యంతో చెత్త చెదారం లేకుండా అన్ని కాలనీల రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం చైర్మన్ జాం రవి మాట్లాడుతూ మున్సిపల్‌లోని అన్ని వార్డులను తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించుటకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్, కౌన్సిలర్లు ఆది అజయ్‌కుమార్, పులి ప్రభాకర్, నీరజ్‌గౌడ్, నవీన్, మేనేజర్ ఉష, శానిటరి ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## దవాఖాన భవనం విస్తరణకు శంకుస్థాపన

ప్రజాపక్షం/చర్లపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బస్తీ దవాఖానాను విస్తరిస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. డాక్టర్ ఎఎస్ రావు నగర్ బస్తీ దవాఖాన భవనం విస్తరణ పనుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్ష్మారెడ్డి విచ్చేసి శంకుస్థాపన చేశారు. విస్తరణ పనులు త్వరితగతిన పూర్తిచేసి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్ బోస్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, డాక్టర్ సత్యవతి, కె. ఈశ్వరయ్య, డాక్టర్ కృష్ణారావు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

**ముస్లింలకు రంజాన్ తోఫాలు :** రంజాన్ పవిత్ర మాసం సామరస్యానికి, శాంతికి ప్రతీకని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని డిఎఇ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమా



నికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను అందించారు. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు ఆచరిస్తూ ఆధ్యాత్మికంగా సాగే ఈ పవిత్ర కాలంలో వారికి ప్రభుత్వం అందిస్తున్న తోఫా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రంజాన్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు ముజీబుద్దీన్,నాగారం కాంగ్రెస్



పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్‌లు హాజరై కానుకలను అందజేశారు.ఇందులో మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి,పంగ హరిబాబు,నాయకులు గూడూరు అశోక్ గౌడ్,కొండల్‌రెడ్డి,సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా కార్మికులకు సన్మానం

### మున్సిపల్ చైర్ పర్సన్ కమలం శిరీషా కృష్ణారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట:'ప్రజాపాలన ప్రగతి–ప్రణాళిక'లో భాగంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అలియాబాద్ మున్సిపల్ మహిళా కార్మికులను మున్సిపల్ చైర్ పర్సన్ కమలం శిరీషా కృష్ణారెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించింది. అనంతరం మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న సుమారు 48 మంది కార్మికులకు టిఫిన్ బాక్సులతో పాటు వాటర్ బాటిల్స్ ను కానుకగా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎండలో కష్టపడుతున్నారని వారి దాహం తీర్చుకోవడానికి మంచినీటి బాటిల్స్‌ను, భోజనం చేయడానికి టిఫిన్ బాక్సులను పంపిణీ చేశామని చెప్పారు. పారిశుద్ధ్య నివారణలో కార్మికులు ముందు వరుసలో ఉండాలని మున్సిపాలిటీకి మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. అలాగే మున్సిపల్ విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఐ వేణు, విజయ్‌కుమార్, సిబ్బంది అనిల్‌రెడ్డి, నరోత్తం, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

### నర్సరీని శుభ్రం చేసిన మున్సిపల్ చైర్ పర్సన్

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటీ మురహరిపల్లిలో మున్సిపల్ చైర్ పర్సన్ కమలం శిరీషా కృష్ణారెడ్డి నర్సరీని శనివారంసందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో మొక్కల మధ్యలో ఉన్న చెత్తను శుభ్రంచేసి మొక్కలకు నీళ్లు పోశారు. అనంతరం ఆమె



మాట్లాడుతూ మొక్కలను కాపాడుకుంటే అవి మనకు మంచి ఆక్సిజన్ ఇస్తాయని చెప్పారు. రోడ్ల వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరు తమ ఇండ్ల వద్ద మొక్కలు నాటాలని సూచించారు.

# ప్రపంచ ప్రసిద్ధ తత్వవేత్త కారల్ మార్క్స్

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్ బోస్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: కారల్ మార్క్స్ ప్రపంచానికి సమానత్వ సిద్ధాంతాన్ని అందించిన మహా మేధావి, ప్రపంచ ప్రసిద్ధ తత్వవేత్త, ఆర్థిక వేత్త, సామాజిక వేత్త అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దామోదర్‌రెడ్డిలు కొనియాడారు. కారల్ మార్క్స్ 143వ వర్ధంతి సందర్భంగా ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖర రెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టాల కొలిమిలో కాలిన జీవితం అయినా శ్రామిక శ్రమ జీవుల జన చైతన్యమే లక్ష్యంగా కమ్యూనిస్టు సిద్ధాంతాల రూపకల్పన చేసిన పితామహుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఉప్పల్ నియోజకవర్గ నాయకులు వికాస్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ నాయకులు విజయ్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట సిపిఐ కార్యాలయంలో సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కారల్ మార్క్స్ 143వ వర్ధంతి కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ కారల్ మార్క్స్ తత్వవేత్త, ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞు డు అని కొనియాడారు. అంతరాలు లేని సమ సమాజ నిర్మాణంకోసం శ్రమ దోపిడీని వ్యతిరేకించి సమాజ సరిహద్దుల వరకు తరిమి కొట్టడం కోసం తపించిన మహోన్నత వ్యక్తి అన్నారు. కమ్యూనిస్టు మ్యానిఫెస్టో రూపొందించి 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి! అంటూ నినాదం ఇచ్చిన వ్యక్తి ఆయన అన్నారు. ఈ ప్రపంచం నుండి భౌతికంగా ఆయన దూరమై నా ఆయన రేకెత్తించిన సిద్ధాం తం మనందరిని ఎల్లప్పుడు తట్టి లేపుతూనే ఉంటుందన్నారు.



ఈ కార్యక్రమంలో దళిత హక్కుల సాధన నాయకులు మేకల నాగేష్, సిపిఐ నిజాంపేట డివిజన్ కార్యదర్శి పొన్నకంటి దస్తగిరి, పి.కవిత, కెవిపిఎస్ నాయకులు బాలు, మహేష్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రప్రభుత్వం అమలుపరుస్తున్న లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి

### ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి శివబాబు



ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తు శామీర్‌పేట డివిజన్ జిహెచ్‌ఎంసి కార్మికులు శనివారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) రాష్ట్ర సహాయ కార్యదర్శి శివబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి23న చలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని చేపట్టామని ఈ కార్యక్రమానికి మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు 8 గంటల పని దినములతో పాటు రూ.26 వేలు కనీస వేతనం చెల్లించాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మొరుగు శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికులకు పని గంటల భారం పడుతుందని ఆవేదన చెందారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోని యెడల ఆమరణ నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పోచయ్య, యాదగిరి, కిట్టు, నాగరాజు, కమలమ్మ, సుగుణ, భారతి, యాదమ్మ, కవిత, మౌనిక, కలమ్మ, సంతోష తదితరులు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనుల స్థల పరిశీలన

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : పలు అభివృద్ధి పనులకోసం ఎంపి ఈటల రాజేందర్ నిధుల నుండి మంజూరు చేసిన స్థల పరిశీలన చేపట్టారు. మూడు బోర్‌బావులు ఏర్పాటు కోసం మొత్తం రూ.12లక్షలు మంజూరు చేయగా, జగద్గిరి నగర్ బస్తీలో రూ.4లక్షలతో ఒక బోర్‌బావి, మైసమ్మ నగర్ ఏ బ్లాక్‌లో రూ.4లక్షల, బి బ్లాక్‌లో రూ.4లక్షలతో మరో రెండు బోర్‌బావులు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా ఆర్‌జీకే కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.4లక్షలు మంజూరు చేయగా, ఆ పనులు చేపట్టే స్థలాలను శనివారం జెకె శేఖర్ యాదవ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ వెంకట్, బస్తీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జగన్ ముదిరాజ్, జగద్గిరి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, మైసమ్మ నగర్ ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, అధ్యక్షులు బ్రహ్మచారి, శ్రీకాంత్ యాదవ్, నాని, పిల్లి ఆంజనేయులు, పాపిరెడ్డి, ప్రమోద్, ఆర్‌జికె కాలనీ వాసులు శ్రీనివాస్‌చారి, రాఘవయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు వెంటనే గ్యాస్ సిలెండర్లు ఇవ్వాలి : తోట రంగయ్య

ప్రజాపక్షం/ఘట్‌కేసర్: తీవ్ర ఎండలు కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పశ్చిమాసియా యుద్ధం వలన మన రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడటం వల్ల సాధారణ ప్రజలతో పాటు ముఖ్యంగా వయోవృద్ధులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వృద్ధులకు వెంటనే గ్యాస్ సిలెండర్లు ఇవ్వాలని సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోట రంగయ్య అన్నారు. వృద్ధుల ఆరోగ్య సమస్యలు శారీరక బలహీనతల కారణంగా గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లడం చాలా కష్టసాధ్యంగా మారిందని ఈ నేపథ్యంలో గ్యాస్ సరఫరా సంస్థలు సంబంధిత అధికారులు వయోవృద్ధులను ప్రత్యేకంగా గుర్తించి వారికి గ్యాస్ సిలిండర్లను ప్రాధాన్యత ఆధారంగా వెంటనే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వృద్ధులకు ఇంటివద్దనే గ్యాస్ సరఫరా జరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అత్యవసరం వృద్ధుల ఆరోగ్య భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీ లు తక్షణ చర్యలు తీసుకొని గ్యాస్ కొరత సమస్యను పరిష్కరించాలని శనివారం ఈశ్వర ఏజెన్సీ మేనేజర్‌కు డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోట రంగయ్య వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, తదితరులు పాల్గొన్నారు.



## జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు

### జయభేరిలో అనుమతిలేని భారీ షెడ్లు

### పార్క్ స్థలం ఆక్రమించి బహుళ అంతస్తుల భవనం



ప్రజాపక్షం/దుండిగల్ : కొంపల్లి సర్కిల్ పరిధిలోని జయభేరి పార్క్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పార్క్ కు ఆనుకొని 1500 గజాల్లో ఓ భారీ షెడ్డుతోపాటు 20కి పైగా అనుమతిలేని షట్టర్స్ నిర్మిస్తున్నారు. అదే విధంగా శివాలయం దగ్గర అనుమతిలేని షట్టర్స్, జయభేరి పార్క్ స్థలం కబ్జాచేసి భారీ బహుళ అంతస్తు నిర్మిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తుండడంతోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవలే దూలపల్లి ఇండస్ట్రియల్ పరిధిలో పదుల సంఖ్య ల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుండడంతో, స్థానికుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేశారు. ఒకేచోట ఆరు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఒక్క నిర్మాణాన్ని మాత్రమే పై పై కూల్చివేతల చేపట్టి వెనుతిరగడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. సేంట్ మార్టిన్ కాలేజి దగ్గర నిబంధనలకు విరుద్ధంగా రెండు భారీ షెడ్లు నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తుండడంతో స్థానికుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి.

**నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం : కొంపల్లి డిప్యూటీ కమీషనర్**

కొంపల్లి సర్కిల్ పరిధిలోనీ దూలపల్లి స్టీల్ సిటీ, అపర్ణ, జయాబేరి పార్క్, న్యూ స్టీల్ సిటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని కొంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ఎన్.కృషారెడ్డి అన్నారు. న్యూ స్టీల్ సిటీ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని నిర్మాణాలను తొలగిస్తామని ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని అనుమతులు లేని నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు.



## మార్కెట్ యార్డులో సిసి కెమెరాలు ఏర్పాటు

### చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్

ప్రజాపక్షం/వికారాబాద్ : వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడానికి ,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చపల శ్రీనివాస్ ముదిరాజ్ ,శనివారం మార్కెట్ యార్డులో గ్రేస్ వ్యాపారస్తులు ఏజెంట్ కమిషన్ ఏజేంట్ ల విజ్ఞప్తి మేరకు రైతులు వివిద ప్రాంతలనుండి వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు వస్తున్న సందర్భంలో నిల్వ ఉంచిన ధాన్యనికి రక్షణ ఉండేందు వీలుగా 40 సీసీ కేమెరాలు ఏర్పాటు చేస్తున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ ఫాసియొద్దీన్ ,గ్రీన్ మార్కెట్ కమిషన్ ఏజెంట్ అధ్యక్షులు ,కౌన్సిలర్ చిగుళ్లపల్లి,రమేష్ కుమార్, సాయి కుమార్,రాజు, పురుషోత్తం,తదితరులు పాల్గొన్నా రు.

## చదివిన పాఠశాలలోనే పరీక్ష సెంటర్ ఏర్పాటు

- తల్లిదండ్రుల ఆందోళన
- ఎస్ఎస్‌సి బోర్డు తప్పిదమే
- పరీక్షా కేంద్రాన్ని అధీనంలో తీసుకొన్న అధికారులు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : నిబంధనలకు విరుద్ధంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండల పరిధిలోని ఏరా ప్రయివేట్ పాఠశాలలో పదో తరగతి చదివే 81 మంది విద్యార్థులకు అదే పాఠశాల పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేయటం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ విషయం బయటకు పొక్కగానే పలువురు తల్లిదండ్రులు, బిఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. పాఠశాల యాజమాన్యంతో కుమ్ముక్కైన ఎస్ఎస్‌సి బోర్డు అధికారులు, విద్యా శాఖ అధికారులు కావాలనే ఆ పాఠశా ల విద్యార్థులకు అదే పాఠశాలలో పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేసారని విమర్శించారు. దీంతో అప్రమత్తమైన విద్యా శాఖాధికారులు ఆ సెంటర్‌కు చేరుకొని తప్పిదా న్ని సరిదిద్దే చర్యలు చేపట్టారు. దీనిలోని భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి ఆదేశాల మేరకు సదరు పరీక్షా కేంద్రాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకొని అక్కడే ఫ్లయింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లను ఇతరులను నియమించారు. ప్రభుత్వపాఠశాలకు చెందిన 15 మంది ఉపాధ్యాయులు, రెవెన్యూ శాఖకు చెందిన నలుగురు. వైద్య శాఖకు చెందిన ఒక్కరిని మొత్తంగా 20 మందిని ప్రత్యేకంగా నియమించారు. ఎస్ఎస్‌సి బోర్డు తప్పిదం వల్లే ఈ తప్పిదం జరిగిందని, అయినప్పటికి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాటు చేసామని, ఎలాంటి మాల్ ప్రాక్టిస్‌కు తావు లేదని తెలిపారు. డిఇఒ విజయకుమారి మాట్లాడుతూ జంబ్లింగ్ విధానంలో అప్పుడప్పుడు ఇలాంటివి జరుగుతూనే ఉంటాయని, పాఠశాలను పూర్తిగా తమ అధీనంలోకి తీసుకొని ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలోనే పరీక్షలు సజావుగా జరిపిస్తామని, విద్యార్థులు కానీ వారి తల్లిదండ్రులు కానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.




**117 మంది గైరాజరు :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో శనివారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిసాయి. 48,862 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 117 మంది గైరాజరు కాగా 99.76 శాతం మేరకు 48,745 మంది హాజరై పరీక్షలు రాసారు. ప్రయివేట్ విద్యార్థుల విషయానికి వస్తే 85 మందికి గాను 19 మంది గైరాజయ్యారు. ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ లాంటివి చోటు చేసుకోలేదని అధికారులు తెలిపారు. జిల్లాలోని 14 మండలాల్లో 237 పరీక్షా కేంద్రాల ను ఏర్పాటు చేసి అన్ని సెంటర్ల వద్ద 144సెక్షన్ విధించి సజావుగా పరీక్షలు జరిగే వీలుగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసారు. ఆయా సెంటర్లలో విద్యార్థులకు తాగు నీరు, ఫాన్లు, కూర్చొనేందుకు బల్లలు, టాయిలెట్లు ఏర్పాట్లు చేయటంతో పాటు సిసిటివి కెమెరాలు అమర్చారు. వేసవి తీవ్రత కారణంగా ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు సైతం అందుబాటులో ఉండే ఏర్పాట్లు చేసారు.




### ఈ-వేస్ట్ కలెక్షన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా

## ఎంఎంసి కాప్రా సర్కిల్ పరిధిలో 5 సేకరణా కేంద్రాలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ పరిధిలోని ఈ వేస్ట్ కలెక్షన్‌లో భాగంగా ఐదు సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసామని డిప్యూటీ కమిషనర్ శ్రీహరి తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన–పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు చేపటి న ఈ స్పెషల్ డ్రైవ్‌కోసం సైనిక్‌పురి వార్డు కార్యాలయం, ఎఎస్రావ్ నగర్, కుషాయిగూడ, ఈసి నగర్ కమ్యూనిటి హాలు, కాప్రా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలు మైకుల ద్వారా ఇళ్లల్లో పనికి రాకుండా ఉండే మొబైల్ ఫోన్లు, చార్జర్లు, వైర్లు, లాంటి వస్తువులను అందచేయాలని చెబుతూ వివిధ ప్రాంతాల్లో ఆయా కాలనీ,బస్తీ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసామన్నారు. పర్యావరణాన్ని, భూగర్భ జలాలకు ఆటంకం కలిగించే ఈ వేస్ట్ వస్తువులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించి సేకరణ కేంద్రాల్లో కానీ, ప్రత్యేక వాహనాల్లో కానీ అందచేయాలని ఆయన కోరారు. ఈ విధంగా అందచేసే ఈ వేస్ట్ వస్తువులకు తాము సేకరణకు నిర్ణయించిన రెకో ఏజన్సీ నిర్దేశించిన విధంగా కొంత డబ్బులు సైతం ఇస్తారన్నారు. ఆదివారం సైతం కొనసాగే ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. శనివారం జరిగిన స్పెషల్ డ్రైవ్‌లో సాలిడ్ మేనేజ్‌మెంట్ డిఇ రవి, సానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్ సుధీర్, రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఎలు వసంతలక్ష్మి , అంజలి, తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్ష/పూదూర్ : పరిగి నియోజకవర్గంలోని పూదూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి షాదీముబారక్‌కు సంబంధించిన 52 చెక్కులను లబ్దిదారులకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. అంతకు ముందు బీజాపూర్ నేషనల్ హైవే రోడ్డు నుండి పూదూర్ మండల కేంద్రలో నిర్మించిన నూతన మట్టి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల కొరత లేదు : కలెక్టర్



ప్రజాపక్షం/వికారాబాద్: జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. గృహావసరాలకు, విద్యాలయాలు, ఆసుపత్రులకు ఎల్‌పిజి సరఫరాలో ఎలాంటి లోటు లేదని, ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర సరఫరా చేసేందుకు పగడ్బందీగా చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా , మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా నిల్వ చేసినా, బ్లాక్ మార్కెటింగ్ చేసినా అట్టి వ్యక్తులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు.

## హెచ్ఐవి రక్తంతో యువతిపై దాడి

ప్రజాపక్షం/ఘట్‌కేసర్: పెళ్లికి నిరాకరించిందని వరుసకు మేనబావ అయిన ఓ నిందితుడు బలవంతంగా హెచ్ఐవి రక్తం ఎక్కించిన దారుణ ఘటన పోచారం ఐటి కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించింది. సిఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం పోచారం డివిజన్ అన్నోజిగూడ రాజీవ్‌గృహకల్ప కాలనికి చెందిన కె.మనోహర్ (25) నగరంలోని ఓ ట్రాన్స్‌ఫోర్డ్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంటాడు. పోచారం పోలీసుస్టేషన్ పరిధికి చెందిన సమీప బంధువైన యువతితో గత సెప్టెంబర్‌లో వివాహం నిశ్చయమైంది. తరువాత మనోహర్‌కు ఎయిడ్స్ వ్యాధి ఉందని యువతి కుటుంబానికి తెలిసింది. దీంతో వారు పెళ్లిని నిరాకరించారు. ఈ విషయమై కక్ష్య పెంచుకున్న మనోహర్ యువతిని పెళ్లి చేసుకోవాలని పలుమార్లు ఒత్తిడి చేశారు. కాగా ఈ నెల 11న తల్లిదండ్రులు లేని సమయంలో యువతి ఇంటికి వెళ్లిన మనోహర్ మరోసారి పెళ్లి విషయమై వాగ్వివాదానికి దిగాడు. యువతి పెళ్లి చేసుకోనని నిరాకరించి సూటిగా చెప్పడంతో ఆవేశంతో మనోహర్ వెంట తెచ్చుకున్న ఎయిడ్స్ సోకిన రక్తంతో ఉన్న ఇంజెక్షన్‌ను యువతికి బలవంతంగా ఎక్కించి పరారయ్యాడు. మరుసటి రోజు యువతికి జ్వరం వచ్చి బాధపడుతుండగా ఆమె తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించారు. చేతిపై ఇంజెక్షన్ ఘాట్లు ఉండటంతో వైద్యులు ఏమి జరిగిందని ప్రశ్నించగా జరిగిన విషయం చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి పోచారం ఐటి కారిడార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. మనోహర్ తల్లిదండ్రులకు ఎయిడ్స్ వ్యాధి ఉన్నట్లు అదే వ్యాధితోనే తండ్రి మృతి చెందినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితున్ని శనివారం రిమాండ్‌కు తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

## కెసిఆర్‌ని కలిసిన కాసాని వీరేశ్



ప్రజాపక్షం/నిజాంపేట్ : తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుని తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ కలిశారు. కెసిఆర్‌ని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కాసాని వీరేశ్ పలు సమస్యలపై కెసిఆర్‌తో చర్చించారు.

రోజర్ బిన్నీ, రాహుల్ ద్రావిడ్, మిథాలీ రాజ్‌కు

# లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు




**ముంబై:** 2026 టీ20 వరల్డ్‌కప్ గెలిచిన సూర్యకుమార్ నేతృత్వంలోని భారత బృందాన్ని బిసిసిఐ సన్మానించనున్నది. ఆదివారం జరిగే నమన్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో సన్మాన కార్యక్రమం ఉండనున్నది. ఇటీవల బిసిసిఐ టోర్నీల్లో అయిదు టైటిళ్లు గెలిచిన భారత జట్లను నమన్ అవార్డులతో సన్మానించనున్నారు. ఈ విషయాన్ని శనివారం బిసిసిఐ ప్రకటించింది. మార్చి 8వ తేదీన జరిగిన ఫైనల్లో సూర్య కుమార్ నేతృత్వంలోని భారత జట్టు టీ20 వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. సూర్య బృందంతో పాటు 2025లో వన్డే వరల్డ్‌కప్ గెలిచిన మహిళల జట్టు, అంధుల చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన మహిళల జట్టు, 2026 అండర్ 19 వరల్డ్‌కప్ గెలిచిన జట్టు, 2025 మహిళ అండర్19 వరల్డ్‌కప్ బృందాలను కూడా సత్కరించనున్నారు. అనేక మంది క్రికెటర్లకు వ్యక్తిగత అవార్డులను కూడా ఇవ్వనున్నారు. టెస్టు, వన్డే కెప్టెన్ గిల్‌కు పాలీ ఉమ్రిగర్ అవార్డును ఇవ్వనున్నారు. మహిళల్లో బెస్ట్ ఇంటర్నేషనల్ క్రికెటర్ అవార్డును స్మృతీ మంధానాకు ఇవ్వనున్నారు. మాజీ క్రికెటర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రావిడ్‌కు .. కల్నల్ సికే నాయుడు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును అందజేయనున్నారు. ఇక బిసిసిఐ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ అందుకోనున్నారు. 1983లో వన్డే వరల్డ్‌కప్ గెలిచిన భారత జట్టులో రోజర్ బిన్నీ సభ్యుడిగా ఉన్నారు. ఆ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసుకున్నారు. అయితే 2022 నుంచి 2025 వరకు రోజర్ బిన్నీ కోచ్, సెలెక్టర్, బిసిసిఐ అధ్యక్షుడిగా చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 24వేల రన్స్ చేసిన క్రికెటర్‌గా ద్రావిడ్‌కు గుర్తింపు ఉన్నది. 2024 టీ20 వరల్డ్‌కప్ గెలిచిన సమయంలో భారత జట్టు కోచ్‌గా ద్రావిడ్ ఉన్నారు. బెస్ట్ ఉమెన్ డొమెస్టిక్ క్రికెటర్ కేటగిరీలో జగన్మోహన్ దాల్మియా అవార్డును ఇరా జాదవ్‌కు ఇవ్వనున్నారు. సీనియర్ డొమెస్టిక్ వన్డే ఫార్మాట్‌లో బెస్ట్ ఉమెన్ క్రికెటర్ అవార్డు షఫాలీ వర్మను వరించనున్నది. బెస్ట్ ఆల్‌రౌండర్‌కు ఇచ్చే లాలా అమర్‌నాథ్ అవార్డును ఆయుష్ మాత్రేకు ఇవ్వనున్నారు. రంజీల్లో బెస్ట్ ఆల్‌రౌండర్ అవార్డు విదర్భ ప్లేయర్ హర్ష్ దూబేకు వెళ్లనున్నది.

పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఊహించని షాక్ తగిలింది. గత సీజన్‌లో ఢిల్లీ మెంటర్‌గా సేవలందించిన కెవిన్ పీటర్సన్ బైబై చెప్పేశాడు. తాను

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటర్‌గా కెవిన్ పీటర్సన్ రాజీనామా..!

ఢిల్లీ మెంటర్‌గా వైదొలుగుతున్నట్టు శనివారం వెల్లడించాడు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్. ఫ్రాంఛైజీ ఆశించినట్టుగా తాను ఈసారి పూర్తి సమయం కేటాయించలేనని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పీటర్సన్ వెల్లడించాడు. ఐపిఎల్ షెడ్యూల్ ప్రకటనతో కొంచా లనుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ మెంటర్ కెవిన్ పీటర్సన్ సేవల్ని కోల్పోనుంది. ఈసారి ఎలాగైనా కప్ కొట్టాలనుకున్న ఢిల్లీకి షాకిస్తూ అతడు బాధ్యతల నుంచి వైదొలిగాడు. అయితే.. మెంటర్‌గా ఉండటం కంటే కామెంటేటర్‌గా వ్యవహరించడమే మంచిదని భావిస్తున్నట్టు చెప్పాడీ వెటరన్. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడీయన. 'ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌లో నేను ఢిల్లీ క్యాపిటల్స్ మెంటర్‌గా ఉండలేను. మెంటర్‌గా పూర్తి బాధ్యతగా పని చేసేందుకు అవసరమైన సమయాన్ని నేను కేటాయించలేను. కొత్త సీజన్‌లో ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నా. మెంటర్‌గా కొనసాగకున్నా.. నన్ను మీరు కామెంటరీ బాక్స్‌లో చూడొచ్చు. ప్రపంచంలోని టీ20 లీగ్స్‌లో ఐపిఎల్ ఉత్తమమైనది. సో.. మీ అందర్నీ త్వరలోనే చూసేందుకు నేను ఎదురుచూస్తున్నా' అని పీటర్సన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.

# ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఐదేళ్లు

**భావోద్వేగ పోస్టు పెట్టిన సూర్యకుమార్**

**ముంబై:** అంతర్జాతీయ క్రికెట్‌లోకి సూర్యకుమార్ యాదవ్ అడుగుపెట్టి అయిదేళ్లూ పూర్తి అయ్యింది. ఈ నేపథ్యంలో ఓ భావోద్వేగ పోస్టు పెట్టాడు టీమిండియా కెప్టెన్. తాజాగా ముగిసిన టీ20 వరల్డ్‌కప్‌కు భారత సారధిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. కెప్టెన్‌గా వరల్డ్‌కప్‌ను అందుకున్న సూర్య తన పోస్టులో భారత జెర్సీని ధరించడం గొప్ప ఫీలింగ్‌గా భావిస్తున్నట్లు చెప్పాడు. ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేనన్నాడు. తన ఎక్స్ అకౌంట్‌లో సూర్య ఓ వీడియోను షేర్ చేశాడు. అయిదేళ్ల క్రితం ఓ కల నిజమైందని, భారత జెర్సీని ధరించడం మాటల్లో వర్ణించలేనని, టీమిండియాకు ఎన్నో జ్ఞాపకాలు కలిగించినట్లు తన వీడియో పోస్టులో తెలిపాడు.




సూర్యకుమార్ 2021, మార్చి 14వ తేదీన అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఎంటరయ్యాడు. అప్పుడు అతని వయసు 30 ఏళ్ల 181 రోజులు. అహ్మదాబాద్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌తో అతను అరంగేట్రం చేశాడు. అయితే అదే వేదికపై సూర్య తాజాగా టీ20 వరల్డ్‌కప్‌ను అందుకున్నారు. సూర్య తన టీ20 కెరీర్‌లో ఇప్పటి వరకు 113 మ్యాచ్‌లు ఆడి, వాటిల్లో 3272 రన్స్ చేశాడు. దీంట్లో నాలుగు సెంచరీలు, 25 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. టీ20 ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు సాధించిన మూడవ బ్యాటర్‌గా నిలిచాడు. అతనికంటే ముందు రోహిత్ శర్మ (4231), విరాట్ కోహ్లీ(4188) ఉన్నారు. 2021 జూలై 18వ తేదీన వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. కొలంబోలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో అతను వన్డే కెరీర్ ప్రారంభించాడు. ఆ తర్వాత 2023లో నాగపూర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో టెస్టు అరంగేట్రం చేశాడు. 2022లో ఐసీసీ మెన్స్ టీ20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు అందుకున్నాడు. తాజాగా ముగిసిన వరల్డ్‌కప్‌లో అతను 242 రన్స్ స్కోరు చేశాడు. బార్బడోస్‌లో టీ20 వరల్డ్‌కప్ గెలిచిన రోహిత్ జట్టులో సూర్య సభ్యుడిగా ఉన్నాడు.




**ఈ వారం స్టాక్ మార్కెట్లు**

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 74,563.92 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 78,918.90 పాయింట్లు. నష్టం 4,354.98 పాయింట్లు).
**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 23,151.10 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 24,450.45 పాయింట్లు. నష్టం 1,299.35 పాయింట్లు).



# తగ్గిన బంగారం, వెండి ధరలు

**బులియన్ మార్కెట్**

10 గ్రాముల బంగారం ధరలు..
24 క్యారెట్లు: రూ. 1,63,200
22 క్యారెట్లు: రూ. 1,47,300
18 క్యారెట్లు: రూ. 1,19,740.

ఢిల్లీలో బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. ముఖ్యంగా అమెరికా డాలర్ బలపడటం, ప్రపంచ ద్రవ్య విధానాలపై అనిశ్చితి పెరగడం వల్ల ఈ పతనం చోటుచేసుకుంది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వివరాల ప్రకారం కిలో వెండి ధర సుమారు రూ.11,000 తగ్గి రూ.2,65,500 వద్దకు చేరింది. అంటే దాదాపు 4 శాతం వరకు పడిపోయింది. ఇదే సమయంలో బంగారం ధర కూడా తగ్గింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర 10 గ్రాములకు రూ.2,000 తగ్గి రూ.1,63,200కు చేరింది. నిపుణుల ప్రకారం ఈ ధరల పతనానికి ప్రధాన కారణం బలపడుతున్న అమెరికా డాలర్. డాలర్ బలంగా ఉన్నప్పుడు సాధారణంగా బంగారం వంటి విలువైన లోహాలపై ఒత్తిడి పెరుగుతుంది. అలాగే అమెరికాలో వడ్డీ రేట్లపై అనిశ్చితి కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను త్వరగా తగ్గించే అవకాశం తక్కువగా ఉందనే సంకేతాలు పెట్టుబడిదారులను అప్రమత్తం చేస్తున్నాయి. ఇక మరోవైపు పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. దీనివల్ల ద్రవ్యోల్బణ భయాలు పెరిగాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించాల్సి వస్తున్నది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా వెండి ధర ఔన్సుకు సుమారు 83 డాలర్ల వద్ద ఉండగా, బంగారం ధర సుమారు 5,088 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. భవిష్యత్తులో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గితే, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, రిటైల్ పెట్టుబడులు పెరగడం వల్ల బంగారం ధరలకు మద్దతు లభించే అవకాశం ఉంది.

# మార్కెట్ విలువ ఆవిరి..



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం భారత స్టాక్ మార్కెట్లపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఈ యుద్ధం ప్రారంభమైన తర్వాత నుంచి పెట్టుబడిదారులు భారీగా నష్టపోయారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం దాదాపు రూ. 33.68 లక్షల కోట్లు మార్కెట్ విలువ పతనమైంది. ఈ పరిస్థితి కారణంగా భారత స్టాక్ మార్కెట్ సూచిక సెన్సెక్స్ ఈ నెలలోనే 8 శాతం కంటే ఎక్కువ పడిపోయింది. ఫిబ్రవరి 27 తర్వాత నుంచి సెన్సెక్స్ సుమారు 6,700 పాయింట్లకు పైగా పతనం కావడం మార్కెట్‌లో నెలకొన్న ఆందోళనకు నిదర్శనం. దీంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ భారీగా తగ్గింది. ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడిదారులు మార్కెట్ నుంచి నిధులు ఉపసంహరించుకోవడం, అలాగే అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు వంటి కారణాలవల్ల మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు ఎక్కువగా పడిపోయాయి.

**హోర్ముజ్ జలసంధిని దిగ్బంధనం చేసిన ఇరాన్, ఆ ప్రాంతం మీదుగా భారత తకంతో ఉన్న ఓడలకు ఎలాంటి ఆటంకం కలిగించబోమని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. భారత పతాకంతో ఉన్న 28 ఓడలు శనివారం నాటికి సురక్షితంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్టు కేంద్ర సీనియర్ అధికారుల భోగట్టా.**

## ఇంధన సంక్షోభం

పశ్చిమాసియాలో ఉధృతంగా సాగుతున్న ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. ముఖ్యంగా ఇంధన రంగం తీవ్ర సంక్షోభానికి గురవుతోంది. గల్ఫ్ ప్రాంతంలో పెరిగిన ఉద్రిక్తతల కారణంగా చమురు రవాణా మార్గాలు ప్రమాదకరంగా మారడంతో గల్ఫ్ దేశాల నుంచి చమురు సరఫరా కొంత మేర నిలిచిపోయింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర ఒక్కసారిగా పెరిగింది. యుద్ధానికి ముందు బ్యారెల్‌కు సుమారు 70 డాలర్లుగా ఉన్న ధర, ఇప్పుడు దాదాపు 100 డాలర్లకు చేరింది. ఈ పరిస్థితి కారణంగా ఆసియా దేశాలు గల్ఫ్ దేశాలపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయంగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని వల్ల రష్యాకు అనూహ్యమైన ఆర్థిక లాభాలు లభిస్తున్నాయి. మరోవైపు భారత దేశంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి సంస్థలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగినా దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచకపోవడం వల్ల ఈ కంపెనీలకు రోజుకు సుమారు రూ. 2,000 కోట్ల వరకు నష్టం వాటిల్లుతున్నట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. అంచనాల ప్రకారం డీజిల్‌పై రోజుకు సుమారు రూ.1,650 కోట్లు, పెట్రోల్‌పై సుమారు రూ. 350 కోట్లు నష్టం నమోదవుతోంది. పెరిగిన ముడి చమురు ధరలు, ప్రమాద ప్రాంతాల్లో పెరిగిన రవాణా ఖర్చులు, ట్యాంకర్ అద్దెలు, బీమా ప్రీమియంల పెరుగుదల, అంతర్జాతీయ మార్కెట్‌లో అస్థిరత తదితర అంశాలు ఈ భారీ నష్టాలకు కారణమవుతున్నాయి. ప్రస్తుతం రష్యా నుంచి భారత్ ఎక్కువగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నది.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

బెట్టింగ్ యాప్స్‌కు వ్యతిరేకంగా

# యువత పోరాడాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయా దేవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బెట్టింగ్ యాప్స్‌కు వ్యతిరేకంగా యువత పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయా దేవి పిలుపునిచ్చారు.ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సీ గ్రౌండ్స్‌లో ఈనెల 12నుంచి 17వరకు నిర్వహిస్తున్న భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్(బిపిఎల్) టోర్నీ మూడవ రోజు పోటీలను శనివారం ఆమె ప్రారంభించా రు. ఈ సందర్భంగాఛాయా దేవి మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రభావంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. క్రీడలు యువతను ఆరోగ్యకరమైన జీవన విధానానికి, క్రమశిక్షణకు, సమాజానికి ఉపయోగపడే మార్గంలో నడిపిస్తాయని అన్నారు. అయితే ప్రస్తుతం కొన్ని ఆన్‌లైన్ బెట్టిం గ్ యాప్స్ యువతను మోసం చేస్తూ, త్వరగా డబ్బు సంపాదించాలనే తప్పుడు ఆశలు చూపిస్తూ వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్రికెట్ వంటి క్రీడలను ప్రోత్సహించే పేరుతో బెట్టింగ్ సంస్కృతి పెంచడం సమాజానికి ప్రమాదకరం అని పేర్కొన్నారు. యువత ఈ మోసపూరిత యా ప్స్‌కు దూరంగా ఉండాలని, తమ సమయాన్ని క్రీడలు, విద్య, సామాజిక బాధ్యతల కోసం వినియోగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కూడా ఇలాంటి బె ట్టింగ్ యాప్స్‌పై కఠిన చర్యలు తీసుకొని యువతను రక్షించాలని వారు డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా ఫోరమ్ రాష్ట్ర నాయకురాలు ప్రేమ్ పావని, ఎఐటియూసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమ తం యాదగిరి, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్, సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్,జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్,భగత్ సింగ్, మహేష్,ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్, భాను లతో పాటు 10 టీమ్‌ల క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆయాల వేతనాలు ఇవ్వని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమళ్ళ సమ్మయ్య

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మెట్టుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న సుమారు 300 మంది ఆయాల కు 2024 జూలై నెల వేతనాలు ఇప్పటికీ వారి బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమళ్ళ సమ్మయ్య తెలిపారు.ఈ విషయంపై పలుమార్లు సిడిపిఒ, డిడబ్ల్యుఒ అధికారులను సంప్రదించినప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎలాంటి స్పందన ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే ఆయాల వేతనాలు నిలిపివేయడం ఎంతవర కు సమంజసం అని ప్రశ్నించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరి పి, దీనికి బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పు నరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభు త్వం వెంటనే జోక్యం చేసుకుని బకాయి ఉన్న ఆయాల వేతనాలను విడుద ల చేసి, వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శకుడు కారల్ మార్క్స్

సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/కరీంనగర్ :** ప్రపంచ కార్మి క వర్గానికి మార్గదర్శకుడు, మహా తత్వవేత్త కారల్ మార్క్స్ అని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్క్స్ 143వ జయంతిని శనివారం సుగుణ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన ప్ర తిపాదించిన సమానత్వ భావాలు శ్రమ జీవుల హక్కుల కోసం చేసిన సిద్ధాంత పోరాటం ప్రపంచ వ్యాప్తంగా కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. సమాజంలో అసమానతలను తొలగించి సమాన హక్కులు సాధించాలన్న లక్ష్యంతో ఆయన చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని చెప్పారు. ప్రస్తుత కాలంలో కూడా మార్క్స్ ఆలోచనలు సమాజ మార్పుకు మార్గం చూపుతున్నాయని, కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడితేనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, బెజవా డ వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాలవిశ్వనాథం, కల్లూరివెంకటేశ్వరరావుతో పాటు, వాసిరెడ్డి మురళీ, సరెడ్డి పుల్లారెడ్డి, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



### దోపిడీ రహిత సమాజం కోసం పరితపించిన వ్యక్తి కారల్ మార్క్స్ : చాడ

ధనిక, పేద అనే తేడా లేని దోపిడి రహిత సమాజం కోసం తన జీవితమంతా పరితపించిన వ్యక్తి కారల్ మార్క్స్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి అన్నారు. శనివారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బద్దం ఎల్లారెడ్డి భవన్ లో కారల్ మార్క్స్ 143వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ, తన జీవితం మొ త్తం ప్రజల సంతోషానికి అంకితం చేసిన గొప్ప దార్శనికుడు కారల్ మార్క్స్ అని గుర్తు చేశారు. సమాజ పోకడలను అధ్యయనం చేసి 1847లోనే కమ్యూనిస్టు ప్రణాళికను రాసి కార్మిక వర్గానికి వెలుగు బాటలు వేసాడన్నారు. సమాజంలోని సం పద ఫలాలు సమానంగా అందరికీ దక్కాలని, శ్రమ దోపిడి లేని, వర్గ రహిత సమాజం కోసం కృషి చేశాడన్నారు. ప్రపంచ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ అన్నారు. ప్రపంచంలో నేటికి మార్క్స్ సిద్ధాంతాన్ని విమర్శించలేరని, విమర్శించడమంటే సూర్యునిపై ఉమ్మినట్లుగా ఉంటుందని అన్నారు. మార్క్సిజం అజేయమైందని, ప్రతి ఒక్కరు ఆచరించి సమసమాజ స్థాపన కోసం ప్రజలంతా ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి, సురేంద ర్ రెడ్డి, గూడెం లక్ష్మి, టేకుమళ్ళ సమ్మయ్య, నాగె ల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉమ్మెంత ల రవీందర్ రెడ్డి, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పై డిపల్లి రాజు, బీర్ల పద్మ, కొట్టే అంజలి, సిపిఐ జి ల్లా, నగర నాయకులు నగునూరు రమేష్, బాకం సంపత్, కసిబొజుల సంతోష్ చారి, కూన రవి ఎలిశెట్టి భారతి, కేమ్సారం నర్సింహులు, ఓర్సు కొమురయ్య, తదితర నాయకులు ఉన్నారు.



ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు దశలవారీగా

# ఉద్యమాలకు సిద్ధం కావాలి

వామపక్ష పార్టీల తీర్మానం

**ప్రజాపక్షం/ వరంగల్ :** అజంజాహి మిల్లు కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు దశలవారీగా ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా, సిపిఎం పార్టీ నాయకులు సింగారపు బాబు రత్నమాల, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, నున్న అప్పారావు, ఎంసిపిఐ జిల్లా సహా కార్యదర్శి నర్ర ప్రతాప్, ఎంవిఆర్ఎస్ యూనియన్ కార్యదర్శి ఆర్యకృష్ణలు పిలుపునిచ్చారు. 318 మంది కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే మిల్లు స్థలంలో ఇంటి నిర్మాణానికి సంబంధించిన 200 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం శివనగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో వామపక్ష పార్టీల జాయింట్ సమావేశం ఎన్‌విఆర్ఎస్ యూనియన్ అధ్యక్షుడు ఇనుముల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల కాలంగా మిల్లు కార్మికుల ఇంటి స్థలాల విషయంలో పాలకవర్గాల తోటి నిరంతరం యుద్ధం చేయాల్సివస్తుందని అజంజాహి మిల్లు కార్మికులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయడంలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని, వెంటనే నిర్లక్ష్య వైఖరిని విడనాడి కార్మికుల ప్రయోజనాల కోసం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 200గజాల స్థలాన్ని కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా 16వ తారీకు నుంచి జరగబోతున్న అసెంబ్లీలో మిల్లు కార్మికుల విషయాన్ని ఏజెండా మీదకి తీసుకురావడానికి స్థానిక ప్రజాప్రతినిధులను కలవాలని కార్మికుల గోడును వెల్లబోసుకోవాలని వాపక్ష పార్టీలు తీర్మానం చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర సెంటర్‌లో ఉన్నటువంటి ప్రతిపక్షపార్టీలను వామపక్ష పార్టీల నాయకులను కలిసి బిల్లు కార్మికుల విషయాన్ని చర్చించాలని దీనికి ఒక కాయరూపం దాల్చాలని అన్నారు. అందుకు అజం జహి కార్మిక వర్గం కూడా ఈ పోరాటంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరూరి కుమార్, దండు లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.




# పేదలకు భూదాన్, ప్రభుత్వ భూములు

• ఎన్నికల హామీలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నెరవేర్చాలి • సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** భూమి లేని నిరుపేదలకు ఇంటి స్థలాలకై భూధన్, ప్రభుత్వ భూములకు పంచాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ డిమాండ్ చేశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామారెడ్డి భవన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గం జిల్లా కౌన్సిల్ సమావేశం కొండికంటి పద్మావతి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎం.బాలనరసింహ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అసమర్థత పాలన కారణంగా యుద్ధం పేరుతో వంటగ్యాస్‌తో పాటు అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. ఐక్యరాజ్యసమితి ఒడంబడికలను కాలరాస్తూ సామ్రాజ్యవాద దేశాలైన అమెరికా ఇజ్రాయిల్ దేశాధినేతలు తమ స్వార్ధ పూరితంగా ఇరాన్‌పై యుద్ధం ప్రకటించి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో పాటు విధ్వంసానికి తెర తీశారన్నారు. యుద్ధంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహిస్తూ ట్రంపు కుట్రలకు నైతిక మద్దతు ఇస్తున్నారన్నారు. యుద్ధోన్మాదాని, సామ్రాజ్యవాదం వ్యతిరేకిస్తూ ధరల పెరుగుదలపై ఈ నెల 16న రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ పోరుబాట కార్యక్రమం చేపట్టిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే చూస్తూ సహించేది లేదన్నారు. ఎల్‌పిజి గ్యాస్ కొరతపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఎల్‌పిజి గ్యాస్ బ్లాక్ మాఫియాపై చర్యలు తీసుకుని ప్రజలకు వంట గ్యాస్ అందించాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, భాగీకృష్ణ యాదవ్, అల్వాల్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోటకదిర నరసింహ, శ్రీనివాస్, ఖలీం, భార్గవి, కె.లక్ష్మ ణ్, ఎస్.దేవానంద్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.





## రైతులు ఆధునిక సాంకేతికతకు చేరువ కావాలి: బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారానే రైతులకు గిట్టుబాటు ధర, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని పాత గుట్ట రోడ్డు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మన కృషి అగ్రి డ్రోన్ సెంటర్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్రి డ్రోన్ల వినియోగం వల్ల రైతులకు సమయం, శ్రమతో పాటు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పంటలపై పురుగు మందుల పిచికారీ, ఎరువుల వినియోగం వంటి పనులను తక్కువ సమయంలో సమర్థవంతంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. అనంతరం కేంద్ర నిర్వాహకులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాణి భరత్ గౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బూడిద మధు, టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి, నాయకులు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ బుకింగ్ పేరుతో సైబర్ మోసాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్యాస్ సిలిండర్ బుకింగ్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ సూచించారు. నకిలీ వాట్సాప్, ఎస్ఎంఎస్ లింకులు, తక్షణ డెలివరీ ఆశ చూపి అడ్వాన్స్ డబ్బులు అడగడం, కెవైసి అప్‌డేట్ పేరుతో ఓటిపి అడగడం వంటివి మోసపూరిత చర్యలని నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని కానీ తెలియని లింకులను క్లిక్ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్యాస్ కొరత ఉందని, వెంటనే బుక్ చేసుకోకుంటే సిలిండర్ రాదని వచ్చే సందేశాలు లేదా వాట్సాప్ లింక్‌లను నమ్మవద్దని ఇవి వ్యక్తిగత వివరాలను, డబ్బులను దొంగిలించేందుకు పన్నే వ్యూహాలని గ్రహించాలన్నారు. అదేవిధంగా గ్యాస్ సిలిండర్ డెలివరీ ముందు ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ పేమెంట్ చేయమని కోరితే అది మోసమని గ్రహించాలని, ఓటిపి, యుపిఐ పిన్ షేర్ చేయవద్దన్నారు. కెవైసి అప్‌డేట్ లేదా సబ్సిడీ పేరుతో ఎవరైనా ఫోన్ చేసి ఓటిపి, బ్యాంక్ వివరాలు అడిగితే అస్సలు చెప్పకూడదన్నారు. గ్యాస్ సిలిండర్‌ను అధికారిక మొబైల్ యాప్‌లు, ఏజెన్సీ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని కోరారు. ఒకవేళ మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఆన్‌లైన్ ద్వారా కూడా రిపోర్ట్ చేయవచ్చన్నారు.

## బుద్ధవనం సందర్శించిన నాగార్జున యూనివర్సిటీ బౌద్ధ స్కాలర్లు



**ప్రజాపక్షం/నందికొండ :** నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని శనివారం నాగార్జున విశ్వవిద్యాలయం బౌద్ధ అధ్యయన విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న బౌద్ధ స్కాలర్లు సందర్శించారు.నాగార్జునసాగర్ పర్యటనలో భాగంగా మయన్మార్ సహా ఇతర దేశాలకు చెందిన బౌద్ధ స్కాలర్లు నాగార్జునకొండను కూడా సందర్శించారు.బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరిత వనంలో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి వందనం సమర్పించారు. అనంతరం బుద్ధ చరిత వనం, జాతక వనం, ధ్యాన వనం, స్తూప వనాలను సందర్శించారు.మహాస్థూపం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలియజేసే లఘు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం మహాస్థూపం ధ్యాన మందిరంలో ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం బౌద్ధ అధ్యయన విభాగం పూర్వ విద్యార్థి, బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, ప్రశాంత్,బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, బుద్ధ భూమి బౌద్ధ మాసపత్రిక అధ్యక్షుడు,సంపాదకుడు సీతారామయ్య,స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/రామన్నపేట :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ గౌరవ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు వారి సూచనలమేరకు రామన్నపేటలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో ఈనెల 28న నిర్వహించబడనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా సమన్వయ సమావేశం గౌరవప్రదంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి యాదాద్రి భువనగిరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ గౌరవ కార్యదర్శి వి.మాధవి లత, మండల న్యాయ సేవా సమితి, రామన్నపేట గౌరవ చైర్పర్సన్ , సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్.శిరీష, రెండవ తరగతి మేజిస్ట్రేట్ కోర్టు రామన్నపేట న్యాయమూర్తి డి.సత్తయ్య పాల్గొన్నారు. అదేవిధంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపిపి నిజాముద్దీన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎస్.శ్రవణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ.మజీద్, బార్ సభ్యులు, అలాగే ప్యానల్ అడ్వకేట్లు ఎం.వెంకట్ రెడ్డి, బి.డేవిడ్ సమావేశంలో పాల్గొన్నారు. పోలీస్ విభాగం నుంచి సర్కిల్ ఇన్స్పెక్టర్ రామన్నపేట ఎన్.వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ మోత్కూర్ సి.వెంకటేశ్వర్లు, వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ వి.యుగేందర్, అడ్డగూడూరు సబ్ ఇన్స్పెక్టర్ కె.వెంకట్ రెడ్డి, రామన్నపేట ఏఎస్ఐ సురేందర్, అలాగే ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రామన్నపేట శివకృష్ణ కూడా హాజరయ్యారు. ఈ సమావేశంలో 28న నిర్వహించబడనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించే విధానాలపై విస్తృతంగా చర్చించారు.

## మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్


**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్ లో భాగంగా మైనర్లు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ నిరంతర వాహనాల తనిఖీలు, వాహనాల జరిమానాలు, ఎన్ఫోర్స్మెంట్ నిర్వహణ అనేది ప్రజల భద్రత రోడ్డు ప్రమాదాల నివారణ కోసమేనన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. మైనర్లు అజాగ్రత్తగా వాహనాలు నడుపుతూ వారు ప్రమాదంలలో పడడమే కాకుండా ఎదుటివారిని కూడా ప్రమాదంలో పడేస్తారన్నారు.

# అంతుచిక్కని మరణాలు..
# ఆసుపత్రికి వెళ్లి శవమై వచ్చే!

మల్టీస్పెషాలిటీ ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణాలు

మరణాలకు హార్ట్ ఎటాక్ ఒకే కారణమా...వైద్యుల వివరణపై అనుమానాలు

కరోనా కాలం నుంచి పెరిగిన ఆకస్మిక మరణాలు



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఇటీవలి కాలంలో అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్లిన పలువురు రోగులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. తల నొప్పి, జ్వరం, తల తిరుగుడు, శరీర నొప్పులు, కాళ్ల వాపు వంటి చిన్న లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరిన కొంత మంది రోగులు చికిత్స పొందుతున్న సమయంలోనే మరణిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందదనే భావనతో పలువురు కుటుంబాలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నాయి. అయితే అక్కడ లక్షల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ చివరకు రోగుల ప్రాణాలు కాపాడలేకపోతున్నాయని బాధిత కుటుంబాలు చెబుతున్నాయి.ముఖ్యంగా రోగులు ఏ సమస్యతో ఆసుపత్రిలో చేరినా చివరకు ‘హార్ట్ ఎటాక్’ కారణంగా మరణించారని వైద్యులు చెబుతున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోగికి పెద్దఎత్తున పరీక్షలు నిర్వహించి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ అసలు సమస్యను గుర్తించడంలో వైద్యులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో రోగిని వెంట ఉన్న కుటుంబ సభ్యులకు కూడా చూపించకుండా కేవలం ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నారని బంధువులు అంటున్నారు. అత్యవసర వైద్యం పేరుతో రోగిని ఆసుపత్రిలో చేర్చి లక్షల రూపాయలు ఖర్చు చేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.నల్లగొండతో పాటు మిర్యాలగూడ,దేవరకొండ వంటి పట్టణాల్లో ప్రైవేట్ ఆసుపత్రుల సంఖ్య పెరిగినా ప్రజలకు సరైన వైద్యం అందుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తమ మనిషి ప్రాణాలు కాపాడాలని ఆశతో కుటుంబాలు తమకు ఉన్న ఆస్తులు అమ్ముకొని, అప్పులు చేసి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ చివరకు నిరాశే మిగులుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా పెద్ద ఆసుపత్రులు ఏర్పడుతున్నప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని అంటున్నారు. ముఖ్యంగా పట్టణంలోని ఐకాన్ మల్టీ స్పెషాలిటీ ప్రైవేట్ ఆసుపత్రిలో గుండె సంబంధిత చికిత్సల సమయంలో కూడా అనూహ్య మరణాలు చోటుచేసుకున్నాయని కొన్ని కుటుంబాలు పేర్కొంటున్నాయి.గుండె జబ్బు తీవ్రంగా ఉందని స్టంట్ వేయాలని, అవసరం లేని ఆపరేషన్లు చేయిస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరోనా కాలం తర్వాత ఆరోగ్య సమస్యలు,ఆకస్మిక మరణాలు పెరిగినట్లు పలువురు చెబుతున్నారు. ఇటీవల వరుసగా జరుగుతున్న ఈ ఘటనలపై వైద్య నిపుణులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఆసుపత్రి ఎదుట బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఇప్పటివరకు పెద్దగా స్పందించలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆరోగ్య శాఖ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

# మూసీ ప్రక్షాళనతో నల్లగొండ ప్రజలకు ఉపశమనం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కాలుష్య సమస్యకు ముగింపు దిశగా అడుగులు

మహిళలు ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడాలి



**ప్రజాపక్షం/నల్లగొండ :** మూసీనది కాలుష్య సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లాలో భూగర్భ జలాలు కలుషితమవడం వల్ల లక్షలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రాధాన్యంగా మూసీ శుద్ధి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని సెట్విన్ శిక్షణ సంస్థలో కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసిన 116 మంది మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేసిన అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మూసీ ప్రక్షాళన పనులను రెండు దశల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశలో 21కిలోమీటర్లు,రెండవ దశలో మరో 21 కిలోమీటర్ల మేర పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సుమారు 30 లక్షల మంది ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ఈమంచి కార్యక్రమానికి ఎవరూ అడ్డుపడవద్దని ప్రతిపక్షాలను మంత్రి కోరారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలని అన్నారు.ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడేందుకు మహిళలు నైపుణ్యాభివృద్ధి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నల్గొండలో ఏర్పాటు చేసిన సెట్విన్ శిక్షణ సంస్థ ద్వారా అనేక కోర్సుల్లో మహిళలకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 27 కోర్సుల్లో సుమారు 1250 మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి,సెట్విన్ ప్రిన్సిపల్ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజలపై పెనుభారం

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధ్వజం




**ప్రజాపక్షం/యాదాద్రి :** యుద్ధాల పేరుతో ప్రజలపై ఆర్థిక భారం మోపే విధానాలను మానుకోవాలని, వంట గ్యాస్ ధరలను తగ్గించి సామాన్యులకు అందుబాటులో ఉంచాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శనివారం భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పెరబోయిన మహేందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత్‌అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అమెరికా విధించిన సుంకాలపై కేంద్రం మెతక వైఖరి ప్రదర్శించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఈ ఒప్పందం వల్ల స్వదేశీ పరిశ్రమలు దెబ్బతింటాయని, ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఆలేరు మండలం కొలనుపాకలో అర్హులైన పేదలకు తక్షణమే ఇండ్ల స్థలాలు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యూరియా యాప్' విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. యాప్‌పై సరైన అవగాహన లేకపోవడంతో ఎరువులు పొందేందుకు రైతులు కష్టాలు పడుతున్నారని, వెంటనే ఈ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే పారదర్శకంగా యూరియా పంపిణీ చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సిపిఐ అధిక స్థానాల్లో పోటీ చేసి విజయం సాధించేలా పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడ చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, ఏశాల అశోక్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# ‘రాబరీ’ కేసులో దొంగల ముఠా అరెస్ట్



రూ.13.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పి కె. నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాబరీ కేసులో నలుగురు సభ్యుల ముఠాను సూర్యాపేట జిల్లా సిసిఎస్, ఆత్మకూర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.13.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాతో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన కంచుకొమ్ముల సంతోష్, కంచుకొమ్ముల గణేష్, కంచుకొమ్ముల సాయికిరణ్, షేక్ నస్రీన్ (సూర్యాపేట)లు ఒక ముఠాగా ఏర్పడి ఆటోలను దొంగలించి అదే ఆటోలో ప్రయాణం చేస్తూ ఒంటరిగా ప్రయాణిస్తున్న వృద్ధ మహిళలనే లక్ష్యంగా చేసుకొని వారిని బెదిరించి ఆభరణాలు దొంగలించడం, అదే ఆటో తిరుగుతూ రాత్రివేళ తాళాలు వేసిన ఇండ్లలో దొంగతనం చేయడం వీరి పద్ధతని తెలిపారు. ఈనెల 6వ తేదీన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కోటినాయక్ తండ శివారులో ఒక వృద్ధురాలిని ఆటోలో ఎక్కించుకొని కొంత దూరము తీసుకువెళ్లి ఆమెను చంపుతామని బెదిరించి ఆమె నోరు మూసి ఆమె మెడలో ఉన్న వెండి గొలుసు దొంగలించుకొని వెళ్ళారు. దీనిపై సంబంధిత బాధితురాలు 10వ తేదీన ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా రాబరీ దొంగతనం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసు ధర్యాప్తులో భాగంగా జిల్లా సిసిఎస్ పోలీసులు, ఆత్మకూర్(ఎస్) పోలీసులు నేరానికి పాల్పడ్డ వారిని టెక్నాలజీ ద్వారా గుర్తించి కదలికలను గమనిస్తూ శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఆత్మకూర్ మండల పరిధిలోని ఎనుభాముల గ్రామ స్టేజీ వద్ద పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు అనుమానిత వ్యక్తులు ఒక టిఎస్ 29 టి 1190 ఆటోలో నెమ్మికల్ వైపు వెళ్తున్నారు. వీరిని ఆపి తనిఖీ చేసి అదుపులోకి తీసుకొని వారిని విచారించగా గతములో మునగాల, సూర్యాపేట టౌన్, కోదాడ టౌన్, తిప్పర్తి, పిడుగురాళ్ల, మేళ్లచెరువు, హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో బంగారం ఆభరణములు, వెండి ఆభరణములు, వెండి వస్తువులు, ఆటోలు, మోటర్ సైకిల్, సెల్‌ఫోన్ దొంగతనము చేసినట్లు అంగీకరించినట్లు వివరించారు. వారి వద్ద నుండి రూ.3లక్షల విలువైన 18 గ్రాముల బంగారం, రూ.5లక్షల విలువైన 1.5 కేజీల వెండి, రూ.4లక్షల విలువైన 3 ఆటోలు, రూ.50 వేల విలువైన ట్యాబ్, రూ. 30వేల విలువైన ల్యాప్‌టాప్, 1 బైకు, 1 టివి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నామన్నారు. నింధితులు కంచుకొమ్ముల సంతోష్, సాయికిరణ్‌లు స్వంత అన్నదమ్ములు, గణేష్ వీరి బాబాయి కొడుకు, షేక్ నస్రీన్ కంచుకొమ్ముల సంతోష్ యొక్క భార్య వీరితో పాటు నస్రీన్ తమ్ముడు బాల నేరస్థుడు ఉన్నాడని తెలిపారు. ఈ కేసు చేధనలో పనిచేసిన సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సూర్యాపేట రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ శ్రీకాంత్, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణ, టెక్నికల్ టీం ఆర్ఎస్ఐ రాజశేఖర్, సిసిఎస్, ఆత్మకూర్(ఎస్) పోలీసు సిబ్బందిని ఎస్పి అభినందించారు.

## వ్యాపార ప్రకటనల బోర్డుల తొలగింపు

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణంలోని ప్రధాన రహదారులపై వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్న బోర్డులను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం పట్టణంలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాల ముందు ఏర్పాటు చేసిన బోర్డులను మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. రోడ్డుపైకి పొడుచుకుని ఉన్న ప్రకటన బోర్డులు, స్టాండ్ బోర్డులు వాహనదారులకు మరియు పాదచారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని గుర్తించిన అధికారులు వాటిని తొలగించే చర్యలు ప్రారంభించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా ఉన్న బోర్డులను వెంటనే తొలగించాలని సిబ్బందికి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు ప్రజల ప్రయాణ సౌలభ్యం కోసం ఉన్నవని, వ్యాపార ప్రకటనల కోసం రోడ్డు ప్రదేశాన్ని ఆక్రమించడం సరికాదని అన్నారు. దుకాణ యజమానులు రహదారికి అడ్డంగా బోర్డులు ఏర్పాటు చేయకుండా మున్సిపల్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌకర్యం దృష్ట్యా అధికారులు చేపడుతున్న చర్యలకు వ్యాపారులు సహకరించాలని కోరారు. మున్సిపల్ సిబ్బందికి పట్టణాన్ని శుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచేలా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ బి.జగన్ మోహన్, శానిటేషన్ సూపర్వైజర్లు పి.ప్రసాద్, ఏ.శివ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

నల్లగొండ ,మునుగోడు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు నిర్వహించబడనున్నాయి.జిల్లాలో మొత్తం 106 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షలను నిర్వహిస్తున్నారు.ఈ ఏడాది జిల్లాలో మొత్తం 19,653 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకోగా,అందులో 19,619 మంది విద్యార్థులు హాజరయ్యారు.34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో హాజరు శాతం 99.83 శాతంగా నమోదైంది.ఇదిలా ఉండగా,ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా పదవ తరగతి పరీక్షలను సవ్యంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కేంద్రంలోని సైంట్ ఆల్ఫాన్స్ పాఠశాల,మండలం దోమలపల్లి జెడ్పీహెచ్ఎస్,మునుగోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు.విద్యార్థులను ప్రధాన గేట్ వద్ద పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. ప్రశ్నపత్రాలు,జవాబు పత్రాల డిపాజిట్‌ను పోలీస్ భద్రతతో నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జీరాక్స్ కేంద్రాలు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 2025/26 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులముల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ పథకములు నెలకొల్పుటకు ఆర్థిక సహాయం కొరకు అర్హులైన షెడ్యూల్ కులముల వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యాచరణ ప్రణాళిక ద్వారా రూ.50 వేల నుండి రూ.1లక్ష వరకు 90 శాతం సబ్సిడీ, రూ.1,00,001 నుండి రూ.2లక్షల వరకు 80 శాతం, రూ.2,00,001 నుండి రూ.4లక్షల వరకు 70 శాతం, రూ.4,00,001 నుండి పై విలువ చేసే యూనిట్లకు 60 శాతం సబ్సిడీ (గరిష్టంగా 5లక్షలు), నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలకు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. మిగిలిన శాతం బ్యాంక్ లోన్ ద్వారా పొందవల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు వ్యవసాయేతర పథకాలకు సంబంధించిన యూనిట్ల స్థాపన కోసం 21 నుండి 50 సంవత్సరాల వయస్సు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 2160 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. వయస్సు 1845 సంవత్సరాలు, వేతన ఉపాధి కార్యక్రమాల కోసం 1835 వయస్సు ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతా ల్లో రూ.2లక్షల లోపు ఉన్నవారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాసుబుక్, సదరన్ ధృవీకరణ పత్రం (వికలాంగులకు), పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో (1) ఆన్‌లైన్ నమోదులో అవసరముంటుందన్నారు.



## అక్రమ సిలిండర్లు.. కేసు నమోదు

**ప్రజాపక్షం/వంగూరు :** శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి వంగూరు గేటు సమీపంలోని యోగి దాబాలో అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్లను, కమర్షియల్ సిలిండర్లుగా అక్రమంగా వాడుకుంటున్న దాబా ఓనర్ నరేందర్ రెడ్డిపై సివిల్ సప్లై అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పుట్ట మహేష్ పేర్కొన్నారు.

## శరవేగంగా కొనసాగుతున్న కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా మెరుగుదల, గృహ జ్యోతి పథకం కింద పేదలకు ఉచిత విద్యుత్, వ్యవసాయ గృహావసరాలకు కొత్త కనెక్షన్లు అందించడానికి ఇప్పటి వరకూ రూ.231.50 కోట్ల ను ఖర్చు చేసామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జడ్చర్ల తిమ్మాజీపేట 132 కేవీ డబుల్ సర్క్యూట్ లైన్ నిర్మాణాన్ని రూ.19.20 కోట్లతో ప్రస్తుతం పూర్తి చేయించామని దీంతో నియోజకవర్గంలో ఓల్టేజీ సమస్య పూర్తిగా తీరిపోతుందని వివరించారు. జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యుత్ సమస్యలను అధిగమించడానికి అవసరమైన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని శనివారం మీడియాకు విడుదల చేసి ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి తెలిపారు. మొత్తం మీద కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జడ్చర్ల నియోజకవర్గంలో విద్యుత్ వెలుగుల కోసం ఇప్పటి వరకూ రూ.213.50 కోట్లను ఖర్చు చేయడం జరిగిందని, ఇది పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధుల కంటే చాలా ఎక్కువ అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వివరించారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు తోడేటి భారతి రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మహిళా మనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలు పురుషులకు సమానంగా ముందుకు వెళ్తున్నారని ప్రతి మారుమూల గ్రామం నుండి ప్రతి మహిళ కూడా తన కాల మీద తను నిలబడి తన కుటుంబాన్ని కూడా నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు నూకల పద్మరెడ్డి, లావణ్య రెడ్డి, శ్రీలత రెడ్డి, పావని రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయ, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మనసా రెడ్డి, జి.లక్ష్మి , మమతా రెడ్డి, ప్రతిభ రెడ్డి, శ్వేతారెడ్డి, జ్యోతిరెడ్డి, స్వాతిరెడ్డి, శైలజరెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో వాహన సదుపాయం

**ప్రజాపక్షం/ధన్వాడ:** ధన్వాడ మండలం గున్ముక్ల గ్రామానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర నాయకుడు ప్రవీణ్ రెడ్డి తన స్వంత ఖర్చుతో గున్ముక్ల మంత్రోనిపల్లి, ఎంనోనిపల్లి గ్రామాలకు చెందిన పదవతరగతి విద్యార్థులకు ధన్వాడ పరీక్ష కేంద్రానికి సరైన సమయానికి చేర్చడానికి రెండు వాహనాలను సమాకూర్చారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ గున్ముక్ల గ్రామం నుంచి ధన్వాడ పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి సరైన రవాణా సౌకర్యం లేనందువల్ల గత నాలుగు సంవత్సరాల మాదిరిగా ఈ సంవత్సరం కూడా రవాణా సౌకర్యం కల్పించానని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సూచన మేరకు బాలురు మరియు బాలికలకు వేరువేరుగా వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఈ సదుపాయాన్ని కల్పిస్తున్న ప్రవీణ్ రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## ఘనంగా స్కూల్ వార్షికోత్సవం

**ప్రజాపక్షం/ఐజ :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామంలో గెలాక్సీ స్కూల్ నందు ఏర్పాటు చేసిన 8వ వార్షిక మహోత్సవానికి పార్టీకి ముఖ్య అతిథిగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డిఎండి తాహెర్ ప్రసంగించారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అన్ని రకాలైన వసతులతో చిన్న తాండ్రపాడు లాంటి చిన్న గ్రామంలో విశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో గెలాక్సీ స్కూల్‌ను నిర్మించి అక్కడి విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ప్రణాళికలు అందిస్తున్న స్కూల్ యాజమాన్యానికి కె.వినోద్ కుమార్, ప్రిన్సిపల్ కె.దీపిక రవీంద్ర ధీరకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న తాండ్రపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వరమ్మ అదే స్కూల్లో ఉపాధ్యాయునిగా చేసి ప్రస్తుతం అదే గ్రామానికి సర్పంచ్‌గా అయినందుకు అక్కడి ప్రజలు విద్యార్థులు ప్రత్యేకించి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ రవీంద్ర ధీర, వివిధ పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్న ఈ కార్యక్రమం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది.

## పది పరీక్షలు ప్రారంభం



**ప్రజాపక్షం/అమరచింత:** పదవతరగతి వార్షిక పరీక్షలు అమరచింత మండలంలో శనివారం ప్రారంభమయ్యాయని విద్యాధికారి కృష్ణవేణి తెలిపారు. అమరచింత మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎస్ఎస్‌సి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఈమె తెలిపారు. అమరచింతలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులు, డిఎంఆర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 106 మంది విద్యార్థులు పరీక్షలను రాసేటట్లు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మండల పరిధిలోని ఈర్లదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 36 విద్యార్థులు, నాగల్ కడుమూర్ ప్రభుత్వ పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు, మస్తీపూర్ నుంచి 34 మంది విద్యార్థులు, కేజీబీవీ నుంచి 44 మంది విద్యార్థినీలు, అమరచింత ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ నుంచి 68 మంది విద్యార్థులు, బాలికల పాఠశాల నుంచి 60 మంది విద్యార్థినీలు, విజేత మోడల్ స్కూల్ నుంచి 40 మంది విద్యార్థులు హాజరై పరీక్షలను రాశారని తెలిపారు. మొత్తం విద్యార్థులు 296 మంది విద్యార్థులు హాజరై మొదటి రోజు తెలుగు పరీక్షలు, వ్రాశారు. ఇందులో ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 218 మంది విద్యార్థులు, తెలుగు మీడియం నుంచి 78 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి తెలిపారు.

# తెగిన కాలువ ద్వారా సాగునీరా?

అధికారులపై మంత్రి జూపల్లి ఆగ్రహం



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల పరిధిలోని నాగర్లబండ తాండ సమీపంలో ఏడు సంవత్సరాలు క్రితం తెగిపోయిన భీమా కాల్వను శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. 2019 జూలై నెలలో భీమా 16వ కేజీ హై లెవెల్ బ్రిడ్జి వద్ద తెగిపోయిన భీమా కాల్వ ఇప్పటికీ పునరుద్ధరించబడపోయినా, ఈ కాల్వ ద్వారా 6 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు అధికారుల రికార్డుల్లో చూపించడంపై రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెగిపోయిన కాల్వ ద్వారా ఎలా సాగునీరు అందుతుందని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా భీమా ఎస్‌సి చంద్రశేఖర్ సీఈ నాగేంద్రతో కలిసి కాల్వ పరిస్థితిని మంత్రి పరిశీలించారు. శ్రీరంగాపూర్ రంగ సముద్రం నుంచి భీమా కాల్వ పనులను సుమారు రూ.70 కోట్ల అగ్రిమెంట్‌తో ఆర్ఎన్ఆర్ కనెక్షన్స్ కంపెనీకి అప్పగించినట్లు వివరించారు. మొత్తం 76 కిలోమీటర్ల కాల్వ పనులు పూర్తి చేయాల్సిన ఉండగా ఇప్పటివరకు కేవలం 62.5 కిలోమీటర్లు మాత్రమే పూర్తి అయ్యాయని తెలిపారు. అయినప్పటికీ కాంట్రాక్టర్‌కు 98 శాతం నిధుల విడుదల చేయడం ఎలా జరిగిందని మంత్రి అధికారులకు ప్రశ్నించారు. భీమా కాల్వ ద్వారా మొత్తం 21 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఉండగా ప్రస్తుతం కేవలం 16 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని పేర్కొన్నారు. ఇంకా సుమారు 5వేల ఎకరాలకు సాగునీరు అందకపోవడం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు రైతులు మంత్రికి తమ సమస్యలను వివరించారు. ఏడు సంవత్సరాలుగా కాల్వ తెగిపోయి ఉండటంతో పలుమార్లు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనులపై ప్రత్యేక నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు**

ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శనివారం మండలంలోని నాగర్ల బండ తండాలో గ్రామస్తులతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రైతులు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని తన కృషి ఫలితంగా రైతులకు ఉచిత విద్యుత్ అందుతున్నదని మంత్రి పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, బొల్లారం సర్పంచ్ గొంది సుదర్శన్ రెడ్డి, తూముకుంట సర్పంచ్ పలుస రామన్ గౌడ్, నాగర్ల బండ తండా సర్పంచ్ గోపాల్ నాయక్, కొండూరు సర్పంచ్ ధర్మ తేజ్, ఉప సర్పంచ్ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, గోపాల్ నాయుడు చిన్నారెడ్డి, ధనుంజయుడు, భీమా అధికారులు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు మార్క్స్ సిద్ధాంతమే సరైన మార్గం




సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** మానవ మనుగడకు కారల్ మార్క్స్ సిద్ధాంతమే సరైన మార్గం అని సిపీఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు తెలిపారు. కార్ల్ మార్క్స్ 143 వర్థంతి సందర్భంగా శనివారం గద్వాలలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు మాట్లాడుతూ కారల్ మార్క్స్ ప్రపంచంలో మానవాళి మనుగడకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయం అని తెలియజేశారన్నారు. కమ్యూనిజం దోపిడీని అవినీతిని, దౌర్జన్యాన్ని, వివక్షతని, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పేరు కృష్ణ, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు నారాయణ, రంగస్వామి, శేషన్న, తిరుమలేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# సిలిండర్ల సరఫరాకు పకడ్బందీ చర్యలు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి




**ప్రజాపక్షం/నారాయణపేట్:** నారాయణపేట్ జిల్లాలో గృహ అవసరాలకు, విద్యాలయాలు, ఆసుపత్రులకు అవరమైన ఎల్‌పిజి సిలిండర్ల సమస్య లేదని, అవసరమైన మేర సరఫరా చేసేందుకు పగడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సిలిండర్లకు కొరత లేదని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణింద్ర రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి గ్యాస్ ఏజెన్సీల డీలర్‌లు, గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్‌లు పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎల్‌పిజి డీలర్‌ల దగ్గర బుకింగ్ స్టాక్, సరఫరాపై ప్రతిరోజు రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని ఈ సందర్భంగా జిల్లాలో ఎల్‌పిజి డీలర్‌ల దగ్గర బుకింగ్ స్టాక్, సరఫరాపై ప్రతి రోజు రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని ఈ సందర్భంగా సమావేశంలో ఆయిల్ కంపెనీల సెల్స్ అధికారులు వివరించారు. జిల్లాలో గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ వాణిజ్య అవసరాలకు వినియోగించిన స్టాక్ నిల్వ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ నిర్దేశించిన పరిణామంలో గ్యాస్ సరఫరా చేయాలని, తూనికల కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అక్రమంగా సిలిండర్లు ఏర్పాటు చేసుకుంటే వాటిని సీజ్ చేయడం జరుగుతుందని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నారాయణపేట్‌లోని హోటళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించి 14 గృహ ఎల్పిజి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వాటిని భద్రంగా ఉంచడానికి గురు కృప భరత్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు ఆయన తెలిపారు. హోటల్ ఇతర వ్యాపార సముదాయాలతో అక్రమంగా సిలిండర్లను వాడుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బాల్ రాజ్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సైదులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ రషీద్, డీలర్లు భీమయ్య గౌడ్, శాంత్ కుమార్, అశోక్, ఉదయ దత్తత్రేయ భాస్కర్, శ్రీనివాస్, శాంతయ్య, ఆయిల్ కార్పొరేన్ సేల్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లాలో పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా సజావుగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం పదవతరగతి పరీక్షలు ప్రారంభం కాగా జిల్లా కేంద్రంలో ఎంజిరోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవతరగతి పరీక్షా కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులకు బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షా సరళిని పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలైన తాగునీరు, ప్రథమ చికిత్స మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో వెంటిలేషన్ తదితర ఏర్పాట్లు ఉండాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాట్లకు అవకాశం లేకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. తొలుత వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నాపత్రం డిస్ట్రిబ్యూషన్ తనిఖీ చేసి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ వెంట డిఈఓ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.



## పెళ్లికానుకగా రూ.10 వేల ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/వెల్దండ:** మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న సర్పంచ్ గున్నేళ్ల శ్రీనివాస్ మరోసారి తన మాట నిలబెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు శనివారం నూతన వధూవరులు సంధ్య శ్రీశైలం దంపతులకు పెళ్లికానుకగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు తన వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గూళ్ల జంగయ్య, రాస్కే జంగయ్య, చెట్ల శ్రీశైలం, కే.రామకృష్ణ, గంగాధరి రమేష్, మదర్ మల్లయ్య, సురేష్ రెడ్డి, పాండు, మల్లయ్య, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు రాక అయోమయంలో ప్రాణదాతలు

ఆవేదనలో 108 అంబులెన్స్ సిబ్బంది




**ప్రజాపక్షం/రేవల్లి:** ప్రాణాపాయ పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పగలు రాత్రి తేడా లేకుండా సేవలందిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది శనివారం తమ కుటుంబాల పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతినెల రావాల్సిన జీతాలు సకాలంలో అందకపోవడం వల్ల వారి జీవతం కష్టాల్లో మునిగిపోయింది. ఇప్పటికే అరకొరగా వచ్చే జీతాలు కూడా సమయానికి అందకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 108 సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు కాపాడే సేవ చేస్తున్న వారే తమ కుటుంబాలను పోషించలేని పరిస్థితికి చేరుకోవడం బాధాకారం ప్రతినేల 10వ తేదీ లోపు జీతాలు అందకపోవడం వల్ల ఇంటి అద్దెల చెల్లించడం, పిల్లల స్కూల్ ఫీజులు ఇవ్వడం, నెలవారీ ఈఎంఐలు తీర్చడం చాలా కష్టంగా మారింది. కొంత మంది సిబ్బంది అయితే రోజువారీ ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ఎప్పుడూ ముందుండే 108 సిబ్బంది శనివారం తమ సమస్యలతో నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి రావాల్సిన బకాయిలను విడుదల చేసి, ప్రతి నెల నిధులను సకాలంలో విడుదల చేసి జీతాలు సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని 108 సిబ్బంది వేడుకుంటున్నారు.

## నీటి సమస్యలపై ప్రత్యేక చర్యలు



**ప్రజాపక్షం/చెరుకూరు:** గ్రామంలో ఎండాకాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచు బచ్చల కూర శ్రీనివాసులు తెలిపారు. శనివారం చెరుకూరు గ్రామంలో సాయిరాం బోర్ బావిలో నూతన మోటార్‌ను దింపించి ప్రజలకు నిరంతర నీటి సరఫరా కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామ ప్రజలకు నీటి కొరత లేకుండా చూడటం గ్రామ పంచాయితీ బాధ్యతగా భావిస్తూ ఈ చర్యలు చేపట్టినట్లు సర్పంచు తెలిపారు. ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలోని బోర్లు, నీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైన మరమ్మత్తులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు కొండల్, వార్డు మెంబర్ లాలయ్య, గ్రామ పంచాయితీ సెక్రెటరీ హరిణి, పంచాయితీ సిబ్బంది, గ్రామస్తులు గుదే మల్లయ్య, సందీప్, చెన్నయ్య, గుదే వెంకటయ్య, సాయి, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం చేసే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ సునితరెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి:** రైతులు కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వ రైస్ మిల్లులకు అప్పగించిన తరువాత దానిపై ఏవిధమైన అక్రమాలు, నిర్లక్ష్యం లేదా దుర్వినియోగం జరిగిన తీవ్రంగా పరిగణిస్తామని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. శనివారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి జిల్లా పరిధిలోని సిఎంఆర్ వడ్డీ పెండింగ్ కేసులపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగులో ఉన్న సిఎంఆర్ వడ్డీ కేసులను వేగవంతంగా విచారించి త్వరితగతిన పూరిత చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ విధానాలను ఉల్లంఘిస్తూ రైతుల ధాన్యాన్ని దుర్వినియోగం చేసే రైస్ మిల్లులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దుర్వినియోగం చేయడం, నిల్వలు దాచిపెట్టడం లేదా ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా ఆలస్యం చేయడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని రైతులు కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించబడిన తర్వాత దానిని దుర్వినియోగం చేయడం లేదా నిల్వలు దాచిపెట్టడం వంటి చర్యలు చాలా తీవ్రమైన నేరాలు ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేసే రైస్ మిల్లర్లపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకంజ ఉండదు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ సమయానికి బియ్యం అప్పగించడం రైస్ మిల్లుల బాధ్యత. నిబంధనలు ఉల్లంగిస్తూ రైతుల ధాన్యాన్ని దుర్వినియోగం చేసే వారికి చట్టం ముందు తప్పించుకునే అవకాశం ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమాదేశంలో వనపర్తి డీఎస్పీ, వెంకటేశ్వరరావు, డిసిఆర్బీ డివిస్పీ, బాలాజీ, వనపర్తి సీఐ, రత్నం, కొత్తకోట, సీఐ రాంబాబు, జిల్లాలోని ఎస్సైలు ఉన్నారు.

## హక్కులపై పూర్తి అవగాహన ఉండాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** వినియోగదారులు తమ హక్కుల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఈనెల 15 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆసరా) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన గోవపత్రికలను శనివారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్తీ ఆహారం, నకిలీ ఉత్పత్తులు, అన్యాయ వ్యాపార విధానాల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, అసరా జిల్లా అధ్యక్షుడు రంగు భరత్, సంస్థ కార్యదర్శి మహేష్ ఉపాధ్యక్షులు జగదీష్ పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు

పర్యవేక్షించిన డిఐజి ఎల్.ఎస్.చౌహాన్



**ప్రజాపక్షం/గద్వాల్ :** గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కుమారుడి వివాహ మహోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు శనివారం గద్వాలలో పర్యటించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించింది. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ఉదయం నుంచే హెలిపాడ్ నుండి కళ్యాణ వేదిక వరకు ఉన్న మార్గమంతా పోలీసులు కట్టుదిట్టంగా భద్రతా బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద అదనపు పోలీస్ సిబ్బందిని మోహరించడంతో పాటు, కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేశారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం సమయంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా గద్వాలకు చేరుకోగా, కలెక్టరేట్ సమీపంలోని హెలిపాడ్ వద్ద జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్, జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ముఖ్యమంత్రిని ఘనంగా స్వాగతించారు. డీఐజీ పర్యవేక్షణలో, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర పోలీస్ బందోబస్తు కారణంగా ముఖ్యమంత్రి పర్యటన ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా, ప్రశాంతంగా కొనసాగింది.

## పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా చూడాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాగా జిల్లా కేంద్రంలోని లిటిల్ స్టార్, బ్రిలియంట్ హైస్కూల్‌లోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్ళి పరీక్షా సరళిని పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలైన తాగునీరు, ప్రథమ చికిత్స మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మూత్ర శాలలు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో వెంటిలేషన్ తదితర ఏర్పాట్లు ఉండాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాట్లకు అవకాశం లేకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజాపక్షం
Telugu National Daily

మహబూబ్‌నగర్
ఆదివారం
15-03-2026
www.prajapaksham.in

‘ దర్శకుడు రాహి అనిల్ బర్వే మన్ పిశాచ్ పేరుతో రూపొందించిన సైకాలజికల్ హారర్ డ్రామాని 80 నిమిషాల నిడివితో రూపొందించి త్వరలోనే యూట్యూబ్‌లో విడుదల చేయబోతున్నాడు. మన్ పిశాచ్ మొత్తం 60 పేజీల స్క్రిప్ట్. చేత్తో గీసిన స్టోరీ బోర్డులు, ఐఫోన్‌లో తీసుకున్న వీడియో రికార్డింగ్స్, ఫోటోషాప్, జనరేటివ్ ఏఐ, ఆఫ్టర్ ఎఫెక్ట్స్ వాడి దీన్ని పూర్తి చేశారు. కేవలం ఇద్దరు ఆర్టిస్టులు మాత్రమే ఉంటారు. ’

# రీల్

## ‘బ్యాండ్ మేళం’కు యు/ఏ సర్టిఫికెట్




‘కోర్ట్’ చిత్రంతో మెప్పించిన హర్ష్ రోషన్, శ్రీదేవీ జంట మళ్లీ ‘బ్యాండ్ మేళం’ అంటూ ఆడియెన్స్ ముందుకు వస్తున్నారు. రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కించారు. బ్యాండ మేళం’ టీజర్, ట్రైలర్, మాస్ పెప్పీ సాంగ్ ‘తిప్పు కుంటు న్నావ్’, మంచి మెలోడీ సాంగ్ ‘పల్లెలోని సందల్లన్ని మీవే’ వంటివి ఆడియెన్స్‌లో సినిమా పట్ల అంచనాల్ని పెంచేసింది. యూత్ ఆడియెన్స్‌లో ఇప్పటికే మంచి బజ్‌ను క్రియేట్ చేసుకున్న ఈ చిత్రం శ్రీరామ నవమి సందర్భంగా మార్చి 26న ఈ సినిమాని విడుదల చేస్తున్నట్టు నిర్మాత కోన వెంకట్ తెలిపారు. శివరాజు ప్రణవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. శివ ముప్పరాజు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే బాధ్యతల్ని నిర్వర్తించారు. సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫర్‌గా పని చేశారు. ఇక ఈ మూవీలో సాయికుమార్ కీలక పాత్రను పోషించారు.

## ‘ఆయా షేర్’ కోసం 2.5 ఎకరాల సెట్

**‘ది ప్యారడైజ్’ చిత్రంలోని ఆయా షేర్ పాట ఈ ఏడాది బిగ్గెస్ట్ హిట్స్**



ఇందులో హీరోను స్లమ్‌ల సామ్రాట్‌లా చూపించేలా ప్రత్యేకంగా సెట్స్ రూపొందించారు. ఇటీవల విడుదలైన ఆయా షేర్ పాట రా ఎనర్జీ, స్ట్రైకింగ్ విజువల్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ పాటకు వచ్చిన గ్రాండ్ లుక్ వెనుక ప్రధాన కారణం ఆర్ట్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన అద్భుతమైన సెట్స్. గ్రాండియర్‌తో పాటు సహజత్వాన్ని కలిపి ఈ సెట్స్ రూపొందించారు. అత్యంత ఆకట్టుకునే సెటప్‌లలో ఒకటి హీరో హౌస్ (కమాన్ సెట్). హీరో పవర్‌ఫుల్ డిప్ మూమెంట్ కోసం ప్రత్యేకంగా ఈ భారీ నిర్మాణాన్ని రూపొందించారు. ఈ నిర్మాణం వెడల్పు 60 అడుగులు, ఎత్తు 45 అడుగులు, లోతు 25 అడుగులతో నిర్మించబడింది. మొదట ఈ సెట్‌ను 30 అడుగుల వెడల్పుతో నిర్మించగా, తర్వాత ఇరువైపులా 15 అడుగుల చొప్పున విస్తరించి మొత్తం వెడల్పును 60 అడుగులకు పెంచారు. దాదాపు 25 మంది కార్మికులు సుమారు 20 రోజుల పాటు శ్రమించి ఈ భారీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. సెట్ చుట్టుపక్కల వాతావరణంలో సహజంగా కలిసిపోయేలా ప్రత్యేక ఏజింగ్ టెక్నిక్స్ ఉపయోగించి దాన్ని మరింత సహజంగా కనిపించేలా తీర్చిదిద్దారు. వాటర్ బాడీ విలేజ్ సెట్ మరో హైలెట్. ఇది 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబడింది. ఇందులో డమ్మీ నిర్మాణాలు కాకుండా పూర్తిగా నిర్మించిన 60 ఇళ్లు ఉన్నాయి. దాదాపు 50 మంది కార్మికులు 30 రోజుల పాటు శ్రమించి ఈ గ్రామాన్ని నిర్మించారు. ఒకేసారి సుమారు 500 మంది ఉండేలా ఈ గ్రామాన్ని డిజైన్ చేశారు. వాటర్ బాడీ కోసం 100 ట్యాంకర్ల నీటిని తీసుకువచ్చి ఏడు రోజుల పాటు నింపారు. అదనంగా నీటిని నిల్వ ఉంచేందుకు 20 అడుగులు 20 అడుగుల పరిమాణంతో, 20 అడుగుల లోతు ఉన్న ఒక చెరువును కూడా నిర్మించారు.

## 27న ‘హ్యాపీ రాజ్’




మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్పీ, ’హ్యాపీ రాజ్’ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రంలో కంపోజర్‌హీరో జివి ప్రకాష్ కుమార్ కథానాయకుడిగా నటించారు. స్టార్ హీరో డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియా రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్ పై జైవర్ధ నిర్మించారు.మ్యాడ్ ఫేం శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిచింది. ఈ చిత్రం ఇప్పటికే తమిళంలో పాజిటివ్ బజ్‌ను సృష్టిస్తోంది, ప్రమోషనల్ మెటీరియల్‌కు మంచి ఆదరణ లభించింది. కలర్, యాటిట్యూడ్ మాస్ టోన్‌తో అద్భుతమైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌తో తెలుగు ప్రమోషన్లు ప్రారంభమయ్యాయి. ఈ చిత్రంలో అబ్బాస్, జార్జ్ , గీతా కైలాసం, ప్రార్థన నాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హ్యాపీ రాజ్ రిఫ్రెషింగ్ నేపథ్యంలో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ మధన్ క్రిస్టోఫర్, మ్యూజిక్ జస్టిన్ ప్రభాకరన్, ఎడిటర్ ఆర్కె సెల్వ, ప్రొడక్షన్ డిజైనర్ కుమార్.

## ‘బంగారు బొమ్మ’ పాట రిలీజ్



సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా ’గోదారి గట్టు పైన’ తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్‌పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు.తాజాగా మూడో సింగిల్ ’బంగారు బొమ్మ’ అనే పాటను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు నాగ వంశీ సాఫ్ట్ బీట్స్ తో హృదయాన్ని హత్తుకునే ఆర్కెస్ట్రేషన్‌తో విన్టేజ్ మ్యాజిక్‌ను ఇచ్చారు. గేయ రచయిత బాలాజీ రాసిన సాహిత్యం హీరో ఫీలింగ్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. హీరోయిన్‌ని ప్రేమగా బంగారు బొమ్మ అని పిలుస్తూ, ఆమెను చూసినా, ఆమె గురించి ఆలోచించినా తనకు శాంతి కలుగుతుందని చెప్పడం అలరిస్తోంది. ప్రేమలో పూర్తిగా మునిగిపోయిన మనసును ఈ పాట అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. ఈ పాటకు అసలైన ప్రాణం లెజెండరీ గాయకులు ఎస్.పి. చరణ్, కె.ఎస్. చిత్ర అందించిన మధుర వోకల్స్. వారి హార్మనీ పాటకు గొప్ప మాధుర్యాన్ని, భావోద్వేగాలని జోడిస్తుంది. స్క్రీన్ పై సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ మధ్య కనిపించే క్యూట్ కెమిస్ట్రీ ఈ పాటను మరింత అందంగా తీర్చిదిద్దుతుంది. ఫస్ట్ లవ్ స్పార్క్‌ను సెలబ్రేట్ చేసే ఈ పాట అందరినీ ఆకట్టుకుంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సాయి సంతోష్, ప్రొడక్షన్ డిజైన్‌ను ప్రవాల్య, ఎడిటింగ్‌ను అనిల్ కుమార్ పి, సౌండ డిజైన్‌ను నాగార్జున తల్లపల్లి నిర్వహిస్తున్నారు. బంగారు బొమ్మ పాట విడుదలతో గోదారి గట్టుపైన సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి

## ‘గుర్తుకొస్తున్నాయి’ ఫన్ రైడ్ సినిమా



హీరో విరాజ్ అశ్విన్

విరాజ్ అశ్విన్ హీరోగా వినోద్ గాలి దర్శకత్వంలో శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న చిత్రం ’గుర్తుకొస్తున్నాయి’. యశశ్రీ రావు, రోహిణి హట్టంగడి, శివ నారాయణ నారిపెద్ది, ప్రియదర్శిని రామ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. సమ్మర్ లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. గ్లింప్స్ లాంచ్ ప్రెస్ మీట్‌లో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ శరత్ కి గుడ్ లక్. కచ్చితంగా ఇది చాలా పెద్ద హిట్ అవ్వాలి. విరాజ్ కి హ్యాపీ బర్త్‌డే. గ్లింప్స్ చాలా బాగుంది. డైరెక్టర్ వినోద్ టీమ్ అందరికీ ఆల్ ది వెరీ. ఈటీవీ విన్ గత రెండు సంవత్సరాలుగా సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. మేము సంవత్సరానికి ఒక హిట్ తీయడానికి కష్టపడుతుంటే సంవత్సరానికి మూడు నాలుగు హిట్లు కొడుతున్నారు. చాలా హ్యాపీగా ఉంది. లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి.. ఇలా అన్ని చిత్రాలు గొప్ప విజయాలు సాధించాయి. ఈ విజయాలు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. నితిన్ సాయి గ్రేట్ వర్క్ చేస్తున్నారు. చిన్నప్పుడు నుంచి ఈటీవీ అంటే అభిమానం. శ్రీవారికి ప్రేమలేఖ మయూరి పీపుల్స్ ఎన్‌కౌంటర్ అశ్విని ఇలా ఎన్నో అద్భుతమైన చిత్రాలు ఆ సంస్థ నుంచి వచ్చాయి. ఇప్పుడు మళ్లీ అలాంటి విజయవంతమైన చిత్రాలు రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రస్తుతం 16 సినిమాలు, పలు వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. మంచి ప్రతిభ ఉన్న వారికి ఈటీవీ విన్ గొప్ప వేదికగా నిలుస్తోంది. ’గుర్తుకొస్తున్నాయి’ చాలా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను.హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది నాకు చాలా స్పెషల్ డే. నా బర్త్ డే రోజున గుర్తుకొస్తున్నాయి గ్లింప్స్ ప్రజెంట్ చేయడం చాలా ఆనందంగా ఉం ది. మన జీవితంలో మనం చాలా జ్ఞాపకాలు క్రియేట్ చేసుకున్నాం. అవి భవిష్యత్తులో మనకు ఎప్పుడైనా గుర్తొచ్చినప్పుడు మొహం మీద నవ్వు వ స్తుంది అన్నారు. డైరెక్టర్ వినోద్ గాలి పాల్గొన్నారు.



## జులై 10న ఆల్ఫా విడుదల

నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో ఆలియా భట్ నటిస్తోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఆల్ఫా’. ఈ సినిమాను జూలై 10న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. వైఆర్‌ఎఫ్ బ్యానర్, అలియా, శర్వరి ఈ కొత్త అప్‌డేట్ గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఆల్ఫా’సినిమాలో ఆలియా భట్‌తో పాటు హిందీ సినీ పరిశ్రమలో అప్‌కమింగ్ స్టార్ శర్వరి కూడా నటించిందది. అలాగే ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో అనీల్ కపూర్, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాలో ఆలియా, శర్వరి కలిసి బాబీ డియోల్‌ను ఢీ కొట్టేలా కఠినమైన పోరాటంలో తలపడనున్నట్టు తెలుస్తోంది ఆల్ఫా చిత్రంతో ఆలియా భట్ తొలి సారి యశ్‌రాజ్ ఫిల్మ్స్‌తో కలిసి పని చేస్తున్నారు.యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై గ్లోబల్ హిట్ సిరీస్ ది రైల్వే మెన్‌ను తెరకెక్కించిన శివ్ రవైల్ దర్శకత్వంలో ఆల్ఫా సినిమా రూపొందుతోంది. ఆదిత్య చోప్రా నిర్మాత.

### ఎల్‌పిజి గ్యాస్ కొరతను నిరసిస్తూ..

# 16న ఆటో డ్రైవర్ల నిరసన

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎల్‌పిజి గ్యాస్ కొరతను నిరసిస్తూ, పెరిగిన రేట్లు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న(సోమవారం ఉదయం 10 గంటలకు) నారాయణగూడ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు రాష్ట్ర ఆటో డ్రైవర్ల జెఏసి పేర్కొంది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం లో శనివారం తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జెఏసి సమావేశం జరిగింది. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16వ తేదీ నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు బి.వెంకటేశం, పి. శ్రీకాంత్, ఎ.సత్తి రెడ్డి, ఎంఎ.సలీం, వి.మారయ్య, జనార్ధన్ రెడ్డి, లింగం గౌడ్, ఎస్.దయానంద్, శివానంద్, శ్రీనివాస్, జంగయ్య, ఎఐటియుసి, సిఐటియు, టిఎన్‌టిసి, బిఆర్‌టియు, టియుసిఐ, టిఎడిఎస్, తెలంగాణజాగృతి, గట్స్, టిటిడబ్ల్యుయు మొదలగు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# ఒక్క రోజే 341 మిలియన్ యూనిట్ల సరఫరా

**13న చరిత్ర సృష్టించిన తెలంగాణ విద్యుత్ శాఖ**

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సంస్థలు చరిత్రలో ఒకే రోజున అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు (ఎంయు) విద్యుత్ సరఫరా చేసి రికార్డు సృష్టించింది. ఈ నెల 13వ తేదీన ఉదయం 11:17 గంటలకు 18,228 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ను తట్టుకుని విజయవంతంగా సరఫరా చేసింది. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. 13వ తేదీన రాష్ట్రం 341.08 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసి, గత 2025 మార్చి 18వ తేదీ రికార్డు అయిన 335.19 మిలియన్ యూనిట్లను అధిగమించింది. అదే విధంగా, 18,228 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ను కూడా విజయవంతంగా తీర్చింది. ఇది 2025 మార్చి 20వ తేదీన నమోదైన 17,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ కంటే ఎక్కువ అని విద్యు శాఖ అధికారులు తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరగడం, వ్యవసాయ అవసరాలు అధికమవడం వల్ల విద్యుత్ అవసరం, గరిష్ట లోడ్ రెండూ పెరిగాయి.

**భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ**

రానున్న రోజుల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తూ రోజుకు 350కు పైగా మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం, సుమారు 19 వేల మెగావాట్ల గరిష్ట లోడ్‌ను నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. బలమైన విద్యుత్ గ్రిడ్, సమన్వయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికతో ఈ అవసరాలను ఎదుర్కొనే సామర్థ్యం రాష్ట్రానికి ఉందని తెలిపారు. ఈ అధిక డిమాండ్ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించినందుకు రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల సిబ్బందిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అభినందించారు.



నూతన వధువరులు సూర్య విక్రమాదిత్య, సాక్షిలను ఆశీర్వదించిన ఎంపి సిఎం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షి దంపతులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వదించారు.శనివారం ప్రజా భవన్‌కు విచ్చేసిన ఎంపి సిఎం చంద్రబాబు నాయుడు నూతన వధు వరులకు పుష్పగుచ్చాలు అందేసిన ఆశీర్వాదించారు. అంతకుముందు ప్రజా భవన్‌కు విచ్చేసిన చంద్రబాబును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క - నందిని దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిల్లా శ్రీధర్ బాబ, వాకిటి శ్రీహరి లు పాల్గొన్నారు.

## మృత్యు ఒడికి (మొదటి పేజీ తరువాయి)

జరిగిన తమ బంధువు ఇంటి తొట్టెల కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో మెదక్ హైదరాబాద్ 765 డి జాతీయ రహదారి పై రాంపూర్ శివారులో మెదక్ వైపు నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్ఐ మొహమ్మద్ మోహినుద్దీన్ కేసు నమోదు చేసి,మృతదేహాలను మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకు, అల్లుడు మృతి చెందడంతో భూరుగుపల్లి, బోగడ భూపతిపూర్ గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. రెండు గ్రామాల ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు.

## సంక్షేమ వసతి గృహాలు

**(మొదటి పేజీ తరువాయి)**

ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శని వారం ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయా సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను సమీక్షించా రు. తదుపరి వైద్య, ఆరోగ్యశాఖ, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల మరమ్మతుల బి ల్లులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా ఆర్థిక శా ఖకు వచ్చే విధంగా ఒక సీనియర్ అధికారిని నియమించి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల అద్దెలు, ఎలక్ట్రికల్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ప్రతినెలా చెల్లిస్తామని, సంక్షేమ శాఖ అధికారులు సకాలంలో ఆర్థిక శాఖకు బిల్లులు పంపాలని డిప్యూటీ సిఎం సూచించారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచామని, సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన బిల్లులను మొదటి ప్రాధాన్యతగా గుర్తించి చెల్లిస్తున్నామని తెలిపారు.

ప్రపంచం చూపు.. ఆయుర్వేదం వైపు..

ప్రపంచం మొత్తం ఆయుర్వేదం వైపు చూస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మెడిసినల్ ప్లాంట్లు పెంచేందుకు ఆయుష్ శాఖ ఏర్పాట్లు చేసుకోవాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ సమావేశంలో డిప్యూటీ సిఎం సూచించారు. ఉపాధి హామీ పథకం లో భాగంగా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మెడిసినల్ ప్లాంట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలు అడవిని కాపాడుకుంటారని అటవీశాఖ అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సూచించారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న దేవాలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని దేవాదాయ శాఖ సమావేశం లో డిప్యూటీ సిఎం సూచించారు. సమావేశాల్లో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉన్నతాధికారులు సభ్య సాచి గోష్, కృష్ణ ఆదిత్య, క్రిస్టినా, సువర్ణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## వైర్ తెగి బావిలో పడిన క్రేన్

**(మొదటి పేజీ తరువాయి)**

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కొరికి శాల గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పూడిక పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ కూలీలపై ఒక్కసారిగా పడడంతో ఈ ప్రమాదంలో కొరికి శాల గ్రామానికి చెందిన సుకినేని దేవారావు (48) బండారి అభిలాష్ (16) తో పాటు పిడిసిల్ల గ్రామానికి చెందిన సరికొమ్ముల పైడయ్య (53) అక్కడికక్కడే మృతి చెందారు. సుకినేని మోహన్ రావుకు తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఆసుపత్రికి తరలించారు. సుకినే దేవరావు, సుకినే మోహన్ రావుకు చెందిన వ్యవసాయ బావిలో క్రేన్ సహాయంతో పూడిక తీస్తుండగా, వైర్ తెగి క్రేన్ బావిలో పడింది. దానిపై నిల్చున్న దేవరావు, బండారి అభిలాష్, సరిగొమ్ముల పైడయ్య, సుకినే మోహన్ రావు బావిలో పడిపోయారు. దేవరావు, పైడయ్య, అభిలాష్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన మోహన్‌రావు ఆర్తనాదాలు చేస్తుండగా, చుట్టుప్రక్కల వారు గమనించి మొగుళ్లపల్లి పోలీసులకు సమాచారం అందించారు. మొగుళ్ళపల్లి ఎస్సై ముప్పు సురేష్ పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలతో రోదిస్తున్న సుఖినే మోహన్ రావు ను అంబులెన్స్ లో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు బండారి అభిలాష్ పదవ తరగతి విద్యార్థి కాగా శనివారం ఉదయం ఎస్ఎస్ సి పరీక్షలు జరగగా పరీక్షకు హాజరై స్వగ్రామం కొరికిశాలకు చేరుకొని బావిలో పూటిక తీస్తున్న ప్రదేశానికి వెళ్లి క్రేన్ వద్ద చూస్తున్న క్రమంలో ప్రమాదం సంభవించడంతో ప్రమాదంలో అభిలాష్ మృతి చెందాడు. తండ్రి గొర్ల కాపరి, తల్లి అంగన్వాడి టీచర్ అభిలాష్ మరణ వార్తతో రోదనలు చేయడంతో గ్రామస్తులు తోటి విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన సరిగోమ్ముల పైడయ్య భావి వద్దకు రోజువారీ కూలిగా పనికి వచ్చి ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఘటన స్థలానికి చిట్యాల సిఐ మల్లేష్ ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, పోలీస్ సిబ్బందితో మృతదేహాలను బయటకు తీసి చిట్యాల సివిల్ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ ఘటనలో ముగ్గురి మృతి చెందగా వారి గ్రామాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## నిర్బంధం రద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

వాంగ్‌చుక్ సుమారు 1.30 గంటల సమయంలో జైలు నుంచి విడుదల చేసినట్లు రతనాడ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ దినేష్ లఖావత్ ‘పిటిఐ’కి చెప్పారు. ఆయన సతీమణి గీతాంజలి అంగ్మో ప్రస్తుతం జోధ్‌పూర్‌లోనే ఉండి విడుదలకు సంబంధించిన లాంఛనాలు పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చడంపై లేహ్‌లో నిరసనలు చోటుచేసుకున్నాయి. అవి హింసాత్మకంగా మారిన రెండు రోజుల తర్వాత ప్రజాశాంతిని కాపాడటానికి జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు 2025 సెప్టెంబరు 26న జాతీయ భద్రతా చట్టం కింద సోనమ్ వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసనల్లో నలుగురు మరణించారు. 22మంది పోలీసులు సహా 45మందికి పైగా గాయపడ్డారు. ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే ఈ ఆందోళనలు తలెత్తాయని కేంద్రం వెల్లడించింది. శాంతి భద్రతలను కాపాడాలన్న ఉద్దేశంతోనే అతడిని కస్టడీలోకి తీసుకున్నట్లు ప్రకటించింది. అదుపులోకి తీసుకున్న వాంగ్‌చుక్‌ను జోధ్‌పూర్ కారాగారానికి తరలించారు. అంతకుముందు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో లద్దాఖ్‌లో శాంతికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో వాగ్‌చుక్ నిర్బంధాన్ని తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. భారతదేశ రక్షణకు, ప్రజా శాంతి క్రమానికి హాని కలిగవించే విధంగా వ్యవహరించకుండా నిరోధించడానికి వ్యక్తులను అదుపులోకి తీసుకోవడానికి జాతీయ భద్రతా చట్టం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అనుమతిస్తుంది. చట్టప్రకారంగా గరిష్ట డిటెన్షన్ పీరియడ్ కింద 12 నెలలు నిర్బంధించవచ్చు. అయితే దీనిని ముందుగానే రద్దు చేయవచ్చు. రాష్ట్ర హోదా, లద్దాఖ్ 6వ షెడ్యూల్ కోసం ఆందోళనలకు నేతృత్వం వహిస్తున్న లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ పిలుపునిచ్చిన పెద్ద ర్యాలీలకు రెండు రోజుల ముందు సోనమ్ వాంగ్‌చుక్ విడుదల జరిగింది.కేంద్రంతో చర్చల జాప్యాన్ని నిరసిస్తూ 2025 సెప్టెంబరు 24న జరిగిన హింసకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని దర్యాప్తు కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 16న ప్రదర్శనలకు ఈ సంఘాలు పిలుపునిచ్చాయి. వాంగ్‌చుక్, ఇతర ఖైదీల ముఖ్య డిమాండ్లలో ఇది ఒకటిగా ఉంది. కేంద్రపాలిత ప్రాంతంలో ఆందోళన లేదా హింస ప్రజలు ఆకాంక్షలు, ఆందోళనలకు సంబంధించిన అన్ని సమస్యలను వాటాదారులతో సంభాషణ ద్వారా పరిష్కరించబడతాయి. కాగా లద్దాఖ్ ఎంపి మొహమ్మద్ హనీఫా సోనమ్ వాంగ్‌చుక్ విడుదలను స్వాగతించారు. 6వ షెడ్యూల్ కింద రాష్ట్ర హోదా, రక్షణ కోసం ఈ ప్రాంతానికి సంబంధించిన విస్తృత డిమాండ్లను పరిగణనలోనికి తీసుకోవాలని, అలాగే ఇతర ఖైదీలను విడుదల చేయాలని, నిరసనకారులపై ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతియుతమైన నిరసన అనేది రాజ్యాంగబద్ధమైన హక్కు అని, సమస్యలను పరిష్కరించడానికి సంభాషణే ప్రాధాన్యతా మార్గం అని ఎంపి మొహమ్మద్ హనీఫా సోనమ్ నొక్కిచెప్పారు.

## నిరసనలు, ధర్నాలు

**(మొదటి పేజీ తరువాయి)**

సంఖ్యలో పాల్గొని యుద్ధాన్ని ఆపాలని,ప్రపంచ శాంతిని పరిరక్షించాలని, భారత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పునరుద్ధరించాలని చాటాలని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. సామ్రాజ్యవాద అమెరికా,ఇజ్రాయిల్ దేశాలు కలిసి ఇరాన్‌లో నాయకత్వాన్ని మార్చాలనే కుటిల నీతితో దాడికి తెగబడ్డాయన్నారు. ఈనెల 28న ఏకపక్షంగా ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయిల్ దేశాలు విక్షణరహితబాంబుల దాడికి పాల్పడుతూ చివరికి పిల్లలు చదుకునే పాఠశాలలపై క్షిపణి దాడుల చేసి 165 మంది చదువుకునే అమ్మాయిలు, టీచర్లను పొట్టన పెట్టుకున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత తీవ్రమై బ్యారెల్ ధర రూ.100 దాటడంతో దాని .ఫలితంగా భారతదేశంలో గృహ అవసరాల గ్యాస్ ధరలు రూ.60కి పెరిగిందన్నారు. అయితే . మన దేశంలో పెట్రోల్, గ్యాస్ ధరలకు కొరత లేదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇస్తున్న ప్రకటనలు పచ్చి అబద్దాలన్నారు. దేశ వ్యాప్తంగా గ్యాస్ సరఫరా తగ్గిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,మరోవైపు హోటల్స్ మూతపడుతున్నాయని, ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోవడమే కారణమని కూనంనేని పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ ఈనెల 16 నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఇందులో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com